**అంబాజీపేట, జనవరి 16,ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కనుమనాడు నిర్వహించే ప్రభల తీర్థాలు అంబాజీపేట మండలంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి.డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోటలో నిర్వహించిన ప్రభల తీర్థ మహోత్సవం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.సుదూర ప్రాంతాలనుండి వేలాది మంది భక్తులు తరలిరాగా ఒకే చోట కొలువైన ఏకాదశరుద్రులను ఒకసారి దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా విచ్చేసారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఎండ్లబండ్లపై పచ్చని వరిచేల మధ్య నుండి పయనించే రమ్యమైన దృశ్యాలను చూసేందుకు రెండు కనులు చాలవంటే అతిశయోక్తే... ఏకాదశరుద్రులలో గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం రుద్రప్రభలు జగ్గన్నతోట తీర్థనంకు వచ్చే సమయంలో దారిపొడవునా పిల్లకాలువలను, పచ్చని వరి చేలను తొక్కుకుంటూ,నిండుగా పారుతున్న ప్రధాన పంటకాలువ (అప్పర కౌశిక) నుండి ప్రభలను స్థానికులు తమ భుజాలపై మోసుకుంటూ కాలువను దాటించి,మరల తిరిగి వెళ్ళే సన్నివేశాలను చూసేవారికి ఒళ్ళు జలదరించింది.ఎక్కడా ఏవిదమైన అపశృతి దొర్లకుండా ప్రభలను భుజాలపై మోసుకుంటూ తీర్థం జరిగే ప్రదేశానికి తీసుకువస్తున్న దృశ్యాలు కనులారా చూడాల్సిందే..జగ్గన్నతోటలో కొలువైయున్న ఏకాదశరుద్రులను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం తదితరులు దర్శించుకున్నారు.

**రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రభలు :**

ప్రభలతీర్థ మహోత్సవాల్లో ముఖ్యంగా తొండవరం ( 51అడుగుల ఎత్తు), వాకలగరువు (52 అడుగుల ఎత్తు) ప్రభలు రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రభలుగా గుర్తింపబడ్డాయి.ఇంత ఎత్తైన ప్రభలను తయారు చేయడం, వాటిని స్థానిక యువకులు భుజస్కంధాలపై ఎత్తుకుని కొబ్బరితోటలు, అప్పరకైశికలు దాటుకుంటూ సాకుర్రు గున్నేపల్లి సెంటర్‌లో తీర్థం జరిగే ప్రదేశానికి తీసుకురావడం ఎంతో శ్రమతో కూడిన పని.అయితే భగవాదనుగ్రహంతో ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అవలీలగా మోసుకుపోతారు.అలాగే వీటికి బాసటగా పిల్ల ప్రభలను కొలువుదీరుస్తారు.వీటిని స్వయంగా 10 నుండి 15 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులు తయారు చేస్తారు.సాకుర్రు గున్నేపల్లి రుద్రప్రభను వీటితో పాటు కొలువుదీరింది.ఎత్తైనప్రభలను తిలకించేందుకు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశరుద్రుల తీర్థంనకు వెళ్లే వారు ముందుగా వీటిని దర్శించుకుంటారు.

# తెలంగాణ రాష్ట్ర జెన్‌కో యస్ఇగా ఆదినారాయణ



**రాజవొమ్మంగి, జనవరి 16, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండలం మారేడుబాక గ్రామానికి చెందిన గిరిజన ఉద్యోగి మంపా ఆదినారాయణ తెలంగాణా రాష్ట్ర జెన్‌కో విద్యుత్ సూపరిండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతిని పొందారని సర్పంచ్ తొంటా ఆదిరాజు, మంపా కన్నయ్యలు తెలిపారు. మారేడుబాక మాజీ సర్పంచ్ మంపా వెంకన్న, నూకాలమ్మ దంపతుల కుమారుడు అయిన ఆదినారాయణ ఇంటర్మీడియట్ విద్యను కాకినాడ ఐడియల్ కాలేజీ, ఇంజనీరింగ్ జెయన్‌టియులో విద్యాభ్యాసం సాగింది. జెన్‌కో లో మోతుగూడెం, పాల్వంచ, మణుగూరు, అడ్డతీగల, శ్రీశైలంలో పనిచేసారు. ప్రస్తుతం ఎస్ఇగా శ్రీశైలంలో విధులను నిర్వహిస్తున్నారు.

# ఒంటిమిట్టలో ఘనంగా పార్వేటి ఉత్సవం



**రాజంపేట అర్బన్, జనవరి 16 ప్రభాత వార్త :** ఆంధ్రా అయోధ్య ఒంటిమిట్టలో కనుమ పండుగను పురస్కరించుకొని సోమ వారం ఘనంగా పార్వేటి ఉత్సవాన్ని నిర్వహించారు. కోదండరామాలయంలో సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు అనంతరం గ్రామో త్సవం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు అనంతరం స్వామిని సాంప్రదాయంగా కొండపైకి పార్వేటి ఉత్సవ మండపంవద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల అనంతరం పార్వేటి ఉత్సవాన్ని నిర్వహించారు.

# ముందుగా వచ్చిన ఉత్సవం, హారతులివ్వలేని భక్తులు

## దారిమళ్లిన ఉత్సవంతో అధికారుల తీరుపై విమర్శలు



గిరిప్రదక్షిణ సాగుతున్న దృశ్యం

**శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయం అధికారుల తీరుతో శివ భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. సమయ పాలనను పాటించకపోవటం ఉదయాన్నే గిరి ప్రదక్షిణను ప్రారంభించటం అలాగే జయరామారావు నుంచి ఎన్‌టిఆర్‌నగర్‌లోకి వెళ్ళాల్సిన ఉత్సవంను ఆ ప్రాంతంలో మృతదేహం ఉండటంతో దారి మళ్లింపుతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. ఆలయంలో రాజకీయ నాయకుల మెప్పు కోసం దేవస్థానం అధికారులు 'సంప్రదాయాలకు స్వస్తి' చెబుతున్నారు.దాంతో భక్తులు, పరిశీలకుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. స్వామి అమ్మవార్ల ఉత్సవం సందర్భంగా ముందుజాగ్రత్తగా అధికారులు, సిబ్బంది పరిశీలించుకోవాల్సి ఉంది. సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంది.కానీ అలాంటి సమయస్పూర్తి, సంయమనం లేకపోవటంతో నిత్యం దేవస్థానం అధికారుల తీరుపై విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

**ఉత్సవాలు భక్తుల కోసమా? నాయకుల మెప్పుకా?!**

శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న ఉత్సవాలకు సంబంధించిన సమగ్ర సమాచారం, ఇక్కడి ఆచార వ్యవహారాలకు సంబందించి అర్చకులు, అధికారులు ముందుగానే నాయకుల దృష్టికి తీసుకురావాలి.కానీ అలాంటి చర్యలు ఇక్కడ జరగటం లేదు. దాంతో ప్రతి ఉత్సవానికి సంబంధించి అధికారులు, ఆర్చకులు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చలికాలంలో సంక్రాంతి కనుమ సందర్భంగా నిర్వహించే గిరి ప్రదక్షిణను ఉదయం 9గంటల సమయంలో ప్రారంభించేవారు. దేవస్థానం సోమవారం ఉదయం 7గంటలకే ఆలయంనుంచి స్వామిఅమ్మవార్లను బయల్దేరిం చారు. దాంతో స్థానికులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని హారతులిచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

**ఏర్పాట్లు బ్రహ్మాండం:**

గిరి ప్రదక్షిణతో పాటు శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఆర్‌డిఓ రామారావు, ఇఓ వికెసాగర్‌బాబులు రాగా ఏర్పాట్లులో బ్రహ్మాండంగా చేసారు. ఈ ఏడాది కొత్తగా గిరి ప్రదక్షిణతో పాటు కోలాటాలు, సంప్రదాయనృత్యాలు, చెన్నై నుంచి ప్రత్యేకంగా రప్పించిన భక్తకన్నప్ప దళం పంచవాయిద్యాలు, మహిళలు పాల్గొన్న దృశ్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి.అయితే ఈ సంబరాలను భక్తులు వీక్షించుటకు ముందు సమాచారం లేకపోవటంతో అధికారులు,నాయకులకే పరిమతమైంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే గిరి ప్రదక్షిణ సందర్భంగా జయరామావు వీధిలోనుంచి వెలమపాళెం, ఎన్‌టిఆర్, తెలుగుగంగ కాలనీ మీదుగా ఉత్సవం సాగాలి. అయితే ఎన్‌టిఆర్‌నగర్‌లో సోమవారం వేకువ జామున హత్య జరిగింది. గిరిప్రదక్షిణ సందర్భంగా ముందస్తు సమాచారంను అందించాలి. దారిలో ఎద్దైనా అవాంతరాలు జరిగాయా? అనే అంశాలను పరిశీలన చేసుకోవాలి. ఒక వేళ హత్య జరిగినప్పుడు ముందుగానే పోలీసులకు సమాచారం అందించి ఉంటే శవాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి ఉండే వారు.కానీ అలా చేయలేదు. స్వామి అమ్మవార్లను జయరామారావు వీధికి వచ్చిన తరువాత సమాచారం అందుకున్న అధికారులు 'ఉత్సవాన్ని' దారి మళ్లించారు.

# తిరుమలలో మినీ అన్నదానం కాంప్లెక్స్!

## కాలినడక భక్తుల కోసం ఎంబిసి ప్రాంతంలో ఏర్పాటు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు చేరుకునే కాలినడక భక్తులకు సౌకర్యంగా ఎంబిసి ప్రాంతంలో మినీ అన్నదానం కాంప్లెక్స్ ఏర్పాటు దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి కార్యాచరణ రూపొందించింది. ఇందుకు ఎంబిసి ప్రాంతంలో అవసరమైన స్థలాన్ని ఎంపికచేసి ఆ స్థలాన్ని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేపనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో మినీఅన్నదానం కాంప్లెక్స్ సిద్ధమైతే రానున్న మార్చినాటికి చంద్రగిరి సమీపంలోని శ్రీనివాసమంగాపురం శ్రీవారిమెట్టుదారి నుంచి కాలినడకన కొండకు చేరుకునే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఈ అన్నదానం కాంప్లెక్స్ సేవలు అందుతాయి. తిరుమలకు వచ్చే భక్తులకు నిరంతరాయంగా అక్షయపాత్రలా రుచికరమైన అన్నప్రసాదాలను మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో రోజుకు సరాసరి 60వేలమంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలో ఇప్పటికే పలుప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థమ్ అన్నప్రసాద కౌంటర్లను ఏర్పాటుచేసి భక్తులు ఆకలితో అలమటించకుండా చూస్తోంది. ఇప్పుడు తాజాగా శ్రీవారిమెట్లు మార్గంలో కాలినడకన వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా అన్నప్రసాదం అందించేందుకు ఏకంగా మినీ అన్నదానం కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనుంది. దీనివల్ల రోజుకు సరాసరి 15వేలమంది వరకు భక్తులకు ఈ సేవలు అందనున్నాయి. నడచివచ్చే భక్తులు కొండపైకి చేరుకోగానే ఎంబిసి వద్ద అన్నప్రసాదం స్వీకరించే అవకాశం కలగనుంది.

# చంద్రబాబు కొంతమంది వ్యక్తులను ఇంకా నమ్ముతున్నారు: ఎంపి కేశినేని

## వచ్చే ఎన్నికల్లో తన తమ్మునికి ఎంపి సీటిస్తే మద్దతు ఇవ్వను




**విజయయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు కొంతమంది వ్యక్తులను ఇంకా నమ్ముతూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ సభ్యుడు, టిడిపి నేత కేశినేని శ్రీనివాస్(నాని) ఆవేదన వ్యక్తం చేసారు.తన తమ్ముడి లాంటి సెక్స్‌రాకెటర్లు, కాల్ మనీ మాఫియా లీడర్లు,చార్లస్ శోబ్‌రాజ్ కన్నా హీనమైన వాళ్లను చంద్రబాబు ఎవ్వరి మాటలో విని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.పార్టీ అంటే తనకు గౌరవం,అభిమానమన్నారు.టిడిపి అభ్యర్ధిగానే తాను గెలిచానన్నారు. తాను చేసిన మంచి పనులు నచ్చి జనం తనకు అండగా నిలిచారన్నారు. పార్టీలో అతి ప్రముఖులుగా ముద్రలు వేసుకున్న నాయకులు ఎన్నికల్లో గల్లంతయ్యారన్నారు.వాళ్లకి మళ్లీ గెలిచే అవకాశాలు లేవన్నారు. వాళ్ల మాటలకు ప్రాధాన్యతను ఇస్తే తాను ఎలా మద్దతును ఇస్తానన్నారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన వార్డు మాజీ కౌన్సిలర్ కొంగర కాలేశ్వరరావు వర్ధంతి కార్యక్రమానికి ఆయన హజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ నాయకున్ని తాను గౌరవిస్తానన్నారు.తనకు టిక్కెట్ ఇవ్వకుండా ఎవ్వరికి ఇచ్చిన మద్దతును ఇస్తానన్నారు.అంతే తప్ప తన తమ్ముడికి సీటు ఇస్తే మద్దతు ఇవ్వనన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశాలకు ప్రోటోకాల్ పాటించకుండా అతన్ని ఎలా ఆహ్వానిస్తున్నారు .పార్టీ నేతలకు ఇవి పట్టవా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు పోటీ చేసే అవకాశం ఉందన్నారు.సీటు ఆశించవచ్చునన్నారు. దావూద్ ఇబ్రహీం, రియల్ ఏస్టేట్ మోసగాడు, చీటరు,పేకాట క్లబ్బులు నిర్వహించే కేశినేని చిన్ని ఎంపీ అభ్యర్ధా? నేను మద్దతు ఇవ్వాలా? అది జరుగదన్నారు. తెలుగుదేశం పార్టీని ప్రక్షాళన చేయాలని,లేని పక్షంలో పరిస్దితి ఎప్పటిలా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలోనే కొందరు టిడిపి కార్యకర్తలతో ఆయన ప్రైవేటుగా మాట్లాడుతూ పార్టీ పరిస్దితి ఇలా ఉంటే, ఎవ్వరితో పొత్తులు పెట్టుకున్నా మళ్ళీ జగనే వస్తాడని కేశినేని వ్యాఖ్యానించారు.తనకు రాజకీయాల పట్ల ఒక స్పష్టత్తో వచ్చానన్నారు.మంచి చేయడానికి తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అవతల ఉంది వ్యూహకర్త,.ఆచితూచి అడుగు వేస్తాడు.మన నేత ఎవ్వరోచెప్పిందింటాడని నాని మిత్రులతో అన్నట్లు సమాచారం.కేశినేని నాని తన మాటల్లో మాజీ మంత్రి దేవినేని ఉమా,మాజీ ఎంఎల్‌సీ బుద్ద వెంకన్నపై మండిపడ్డారు. టిడిపి స్దానిక ఇంచార్జ్,మాజీ ఎంఎల్‌ఏ తంగిరాల సౌమ్య నాని సోదరుడు కేశినేని చిన్నికి మద్దతు ఇస్తున్నారు.పార్టీ ఫ్లేక్సీలపై నాని ఫోటో బదులుగా చిన్ని ఫోటో వేస్తున్నారు.

# మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మృతి, ఏడుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

**రేణిగుంట, జనవరి 16 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మామండూరు వద్ద కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. లారీ డ్రైవర్ లారీని రోడ్డుపై నిర్లక్ష్యంగా ఆపడం కారు డ్రైవర్ వేగంగా వచ్చి లారీని ఢీకొనడం వల్ల ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో ఏడు మంది గాయాలపాలవడం సంభవించిందని స్థానికులు అంటున్నారు. వివరాలు ఇలా... హైదరాబాద్‌కు చెందిన నాగేష్, శ్రవణ్, లక్ష్మీనారాయణ, అపర్ణ, స్వాతి, సంజన, రాధిక, శరత్‌కుమార్ కారులో డ్రైవర్ శీనులు తిరుమల, తిరుమన్నామలై, తదితర ప్రాంతాలను దర్శించడానికి బయలుదేరారు. మీరు వస్తున్న కారు రేణిగుంట మండలం కుక్కల దొడ్డి గ్రామం దాటి మామండూరు సమీపిస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జయింది. నాగేష్(47), శ్రావణ్(19) అక్కడికక్కడే మృతి చెందారు. ఏడు మంది గాయపడ్డారు. వీరిలో సంజన(19) పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ ఈశ్వరయ్య తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలంకు చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

# శివరాత్రిలో మా 'పెళ్లికి' రండి

## ముక్కోటి దేవతలకు శివపార్వతుల ఆహ్వానం

## కన్నుల పండువగా గిరి ప్రదక్షిణం



గిరి ప్రదక్షిణకు బయలు దేరిన స్వామి అమ్మవార్లు, పాల్గొన్న ఎంఎల్ఎ, చైర్మెన్,ఆర్‌డిఒ, ఇఒ

**శ్రీకాళహస్తి, జనవరి 16 ప్రభాతవార్త:** భక్తి భావానికి ప్రతీకగా ఉన్న దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నెల రోజుల పాటు ప్రతి రోజూ వేకువ జామున గొబ్బెమ్మ సింహవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వగా ధనుర్మాసం చివరి రోజు స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణం నిర్వహించారు. ఈ గిరి ప్రదక్షిణం కైలాసగిరి పర్వత పంక్తుల్లో వెలసిన ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగే తమ వివాహానికి 'రమ్మని'పిలుపుగా అభివర్ణిస్తారు. ఈ మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె సాగర్‌బాబులు కన్నుల పండువగా నిర్వహించాలని తన సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు జరిగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణం నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లనను కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేశారు. స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి రాగా ఆయనతో పాటు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్‌డిఓ రామారావు, ఇఓ వికెసాగర్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేకాహ్వానితులు, వైకాపా శ్రేణులు వెంట రాగా ఉత్సవం ప్రారంభం అయ్యింది. ఎంఎల్ఏ,చైర్మెన్ చెరోవైపు స్వామి అమ్మవార్లను మోసుకుంంటూ అలంకార మండపం వరకు వచ్చారు.అక్కడ నుంచి బోయిలు స్వామి అమ్మవార్లను గిరిప్రదక్షిణకు సాగించారు. కాగా ఆలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరు గ్రామానికి చెందిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి కూడా వేరుగా మరో పల్లకిలో నీలకంఠేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ సాగింది. ప్రతి ఏడాది రెండు సార్లు నిర్వహించే గిరిప్రదక్షిణకు చుట్టూపక్కల గ్రామాల్లో పండగ వాతావరణం చోటు చేసుకుంటుంది. గతంలో గిరిప్రదక్షిణ శ్రీకాళహస్తి నుంచి లక్ష్మీపురం వరకు తారు రోడ్డు మీద సాగేది.

ప్రస్తుతం శాసనససభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవతో పట్టుదలతో రూ.18కోట్లు వెచ్చించి 21 కిలో మీటర్ల సిమెంటు రోడ్డును నిర్మించటంతో ప్రత్యేకత సంతరించుకుంది. దాంతో గిరిప్రదక్షిణలో పూర్వ వైభవం చోటు చేసుకుంటుంది. పనసకోనలోని దేవతల్ని కూడా దర్శించుకుంటున్నారు. హరహరా అంటూ తీర్థాన్ని తలపై చల్లుకుంటున్నారు. ఏడాదిలో రెండు సార్లు సంక్రాంతి సందర్భంగాను, మహాశివరాత్రి పర్వదినాల్లో చివరిరోజు గిరి ప్రదక్షిణ నిర్వహిం చటం ఆనవాయితిగా ఉండేది. మారిన కాలాను గుణంగా భక్త బృందం ప్రతి పౌర్ణమికి కూడా రాత్రి వేళల్లో తమిళనాడులోని తిరువణ్ణామలైలో లాగా గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. దాంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

**హర హర మహాదేవ శంభోశంకరా అంటూ..**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏడాది నిర్వహించే గిరి ప్రదిక్షణను సోమవారం ఉదయం ఆలయం నుంచి గొబ్బెమ్మ పుర ప్రదర్శన తరువాత ఆలంకార మండపంలో చక్కగా సోమాస్కందమూర్తిని అలంకరించి మంగళవాయిద్యాలతో ప్రారంభించారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్‌డిఓ రామారావు,ఇఓ వికెసాగర్‌బాబు ఎసి మల్లికార్జున్ ప్రసాద్ ఎఇఓ సతీష్‌మాలిక్, వెంటరాగా గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. వెంట సూపరింటెండెంట్ శ్రీనివాసులు రాజు టెంపుల్ ఇన్సెపెక్టర్ హరి యాదవ్, నాగభూషణం,సుదర్శనం వెంటరాగా సిబ్బందితో కలసి ముందుకు సాగారు. గిరి ప్రదక్షిణం సాగే మార్గంలో భక్తుల సౌకర్యార్థం మంచినీళ్ళు భోజన వసతులు కల్పించారు. అంగరంగ వైభవంగా ప్రదక్షిణం సాగింది.

**ముక్కోటి దేవతలకు ఆహ్వానం:**

సంక్రాంతి సందర్భంగా నిర్వహించే గిరి ప్రదక్షిణ కైలాసగిరుల్లో వెలసిన ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే 'పార్వతీ పరమేశ్వరులు కళ్యాణానికి' పిలుపుగా అభివర్ణిస్తారు. తరువాత నిర్వహించే గిరిప్రదక్షిణ వచ్చిన అతిధుల్ని మళ్లీ తమ స్వస్థానాలకు చేర్చేదే అని చెబుతారు.

ఈ ఏడాది గిరి ప్రదక్షిణ పాలకులు, అధికారుల పర్యవేక్షణలో అంగరంగవైభవంగా సాగింది. మార్గంలో విశేష సంఖ్యలో స్వామి అమ్మవార్లకు పూజలు, హారతులిచ్చారు.దారి పొడవునా సంక్రాంతిశోభ ఉట్టిపడేలా రంగు రంగుల ముగ్గులతో స్వామి అమ్మవార్లకు స్వాగతం పలికారు. భక్తులు గ్రామస్తులు టెంకాయ నీళ్ళు, గుగ్గుళ్లు, పులిహోర నైవేద్యాలు, ప్రసాదాలు వితరణ చేశారు. దేవస్థానం తరఫున మజ్జిగ కేంద్రాలు, పండ్లు అందజేశారు.

# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల మీదుగా బెల్గాం-సికింద్రాబాద్-బెల్గాంల మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జనవరి 16 ప్రభాతవార్త:** ప్రయాణికుల డిమాండ్ మేరకు బెల్గాం-సికింద్రాబాద్- బెల్గాంల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నేటి నుంచి ప్రారంభించనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రాణాంతక కోవిడ్-19కు ముందు కొల్లాపూర్- మణుగూరు-కొల్హాపూర్‌ల మధ్య తిరిగిన కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ స్థానంలో ప్రయాణికుల డిమాండ్, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాజాగా, ప్రస్తుతం బెల్గాం-సికింద్రాబాద్- బెల్గాంల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నామ న్నారు. బెల్గాం నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 07335 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 17 మంగళవారం (నేటి) నుంచి మార్చి 30 వరకు ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. ప్రతి రోజు మధ్యాహ్నం 01-10 గంటలకు బెల్గాం నుంచి బయల్దేరి మరుసటి రోజు తెల్లవారు జామున 5:50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి బెల్గాం వెళ్లే నెంబర్ 07336 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఈ నెల 18 బుధవారం నుంచి మార్చి 31 వరకు ప్రతి రజు రాత్రి 10:20 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3:55 గంటలకు బెల్గాం చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గ మధ్యంలో ఖానాపూర్, లోండా, ఆల్నావార్, ధార్వాడ్, హుబ్లీ, గదగ్, కొప్పళ, హోస్పేట్, తోరణగల్లు, దరౌజి, బళ్లారి, గుంతకల్లు, ఆధోని, మంత్రాలయం రాయచూరు కృష్ణా, యాద్గిర్, సూలేహళ్లి, చిత్తాపూర్, మల్ఖాయిడ్, రోడ్, సెరం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి బేగంపేటలలో నిలుస్తాయి.

వార్త

సముద్ర తీరాన్ని దాటిపోయేవారు భిన్న ప్రదేశాలను మారుస్తారే కాని, తమ అభీష్టాన్ని మాత్రం మార్చుకోరు.

-హోరేస్

# పర్యావరణ పరిరక్షణే పరిష్కారం!

'త' మలపాకుతో నువ్వుట్లంటే, తలుపు చెక్కతో నేనట్లంట అన్నట్లుగా ఉంది మానవుడి చర్యలకు ప్రతిచర్యలుగా ప్రకృతి వ్యవహరిస్తున్నతీరు. పర్యావరణానికి మానవుడు ఎంత నష్టం చేస్తున్నాడో అంతకు రెట్టింపు స్థాయిలో ప్రకృతి విరుచుకుపడుతున్నది. ఇప్పుడు తాజాగా ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో నేల కుంగిపోయి నివాసగృహాల్లో ఏర్పడిన పగుళ్ల సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఆ భవనాలు ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చునని, భూమి కుంగుబాటు, మరికొన్ని ఇళ్లకు కూడా వ్యాపించవచ్చునని సంకేతాలు వెలువడడంతో అక్కడి నుంచి ప్రస్తుతం పెద్ద సంఖ్యలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయకచర్యలను ప్రధానమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరొకపక్క డెహ్రాడూన్‌లోని వాడియా హిమాలయ భూగర్భశాస్త్ర సంస్థ, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఐఐటిరూర్కీ తదితర పరిశోధక బృందాలు సంయుక్తంగా ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఉన్నత అధికారవర్గాలతో కలిసి జోషీమఠ్‌లో చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు మొదలుపెట్టారు. ప్రకృతితోపాటు మానవుడి చర్యల కారణంగా ఈ విపత్కర పరిస్థితులు ఏర్పడుతున్నాయనేది కాదనలేనివాస్తవం. ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ భారతదేశానికి సంబంధించి ఎంతో పవిత్రమైన ప్రదేశంగా హిందువులు భావిస్తారు. ఆది శంకరాచార్యులు స్థాపించిన నాలుగు మఠాలలో ఉత్తరాదిన జోషీమఠ్ చాలా ముఖ్యమైనది. హిమాలయపర్వత సానువుల్లో ఉన్న ఈ మఠానికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. కేదారినాథ్, బద్రినాథ్‌లకు ఈ మఠం ముఖద్వారంగా భావిస్తారు. ఇప్పుడు అలాంటి పవిత్రమైన మఠం ఉనికే ప్రశ్నార్థకంగా మారడంతో అందరిలో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇది ఇప్పటికిప్పుడు జరిగిన విపత్తు కాదని, గత కొన్నేళ్లుగా అక్కడ ఆప్రాంతంలో అభివృద్ధి కోసమో, లేక ఇతర కారణాలతో ఇష్టానుసారంగా తవ్వకాలు, నిర్మాణాలు జరగడంవల్ల ఈవిపత్తు దాపురించిందని పర్యావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వాస్తవంగా ఈ మఠం సమీపంలో దాదాపు ఐదువేల భవనాలు, నివాస స్థలాలు ఉండగా, ఇప్పుడు వాటిలో ఆరేడువందల భవనాలకు బీటలు వారాయి. అవి ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చునని నిపుణుల హెచ్చరికలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. విపత్కర నివారణ విభాగం నిపుణులతో చర్చలు జరిపిన ప్రధానమంత్రి ఆ రాష్ట్రప్రభుత్వం సందర్శకులకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో ఆ ప్రాంతంలో చేపట్టిన ప్రాజెక్టుపట్ల కూడా ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమయింది. ముఖ్యంగా ఉత్తరాఖండ్‌లో చేపట్టిన చార్‌ధామ్ రైల్వే ప్రాజెక్టుపై అప్పట్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. బద్రినాథ్, కేధారినాథ్, యమునోత్రి, గంగోత్రిలను కలుపుతూ గఢ్వాల్ ప్రాంతంలో రైల్వేలైన్ నిర్మించాలని 2014లో కేంద్రం తలపెట్టింది. 327 కిలో మీటర్ల పొడవైన ఈ రైల్వేలైన్ 61సొరంగాలు, 59 వంతెనలు, 21 కొత్త రైల్వేస్టేషన్‌లు నిర్మించాలని 2024నాటికి పూర్తి చేయాలని పనులు ప్రారంభించారు. వాస్తవంగా చూస్తే గఢ్వాల్ ప్రాంతంలోనే రిషికేశ్-కర్ణప్రయాగ్‌లమధ్య మీటర్‌గేజ్ రైల్వేలైన్ నిర్మాణానికి 1925లోనే ఆనాటి బ్రిటిష్ పాలకులు సర్వే నిర్వహించారు. గఢ్వాల్ కొండలు చాలా పెలుసువైనవని విరిగిపడే అవకాశాలున్నాయని భూ విజ్ఞాన శాస్త్రజ్ఞులు అభిప్రాయం వెల్లడిస్తూ అప్పట్లో ఈ ప్రాజెక్టును తిరస్కరించారు. డార్జిలింగ్, సిమ్లా, ఊటీల్లో మీటర్‌గేజ్ నిర్మాణానికి అదే శాస్త్రజ్ఞులు అప్పట్లో ఆమోదించారు. వెనుకబడిన ప్రాంతంలో ఈ రైల్వే ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటాయని కొందరు ఆహ్వానిస్తుంటే, మరికొందరు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వర్షాకాలంలో కుంభవృష్టిల వల్ల గఢ్వాల్ కొండచరియలు విరిగిపడుతుండడం సాధారణమైపోయింది. 2013జూన్‌లో కురిసిన వర్షానికి సమోలిజిల్లా కేధారినాథ్‌లో పెద్దసంఖ్యలో మరణాలు సంభవించిన వందల సంఖ్యలో జనం అదృశ్యమయ్యారు. ఇక 1970 జులైలో ఇదే జిల్లా రుద్రప్రయాగ్‌లో కురిసిన వర్షం తీవ్రవిషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రాంతం భూకంపానికి నెలవేనని శాస్త్రజ్ఞులు ఎప్పటి నుంచో చెప్తున్నారు. గత వందేళ్లలో ఎన్నో చిన్న, పెద్ద, తీవ్రస్థాయి భూకంపాలు సంభవించాయి. ప్రధానంగా 1991, 1999లో వచ్చిన రెండు భూకంపాలు భారీనష్టాన్నే కలిగించాయి. 1991 అక్టోబరులో సంభవించిన భూకంపం ఒక్కటే దాదాపు పదిహేనువందల మందికిపైగా ప్రాణాలు తీసింది. మరోపక్క ఉత్తరాఖండ్‌లో నలభైఐదుకుపైగా హైడ్రోపవర్ ప్రాజెక్టులు పనిచేస్తుండగా మరో రెండువందలకుపైగా ప్రతిపాదనలు ఉన్నాయి. వీటి నిర్మాణం కోసం భవిష్యత్తులో మరిన్ని పేలుళ్ల జరపవలసి వస్తుంది. అవి గఢ్వాల్ కొండల పటిష్టతను దెబ్బతీసే ప్రమాదముందని శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసమే ప్రకృతి బీభత్సానికి కారణమవుతుందని శాస్త్రజ్ఞుల వాదనను ప్రస్తుతం జోషీమఠ్‌లో జరుగుతున్న పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. అక్కడేకాదు ప్రపంచవ్యాప్తంగా చూసినా భారతదేశంలో చూసినా వాతావరణంలో మార్పుల పెనుప్రభావాలు పుడమిపై విరుచుకుపడుతున్నాయి. ఆక్రమంలోనే ప్రకృతి విపత్తులు రోజురోజుకు పేట్రేగిపోతున్నాయి. ప్రకృతి విపత్తుల వల్ల గత యేడాది దేశవ్యాప్తంగా వేలాది మంది అసువులుబాసారు. మరెన్నో విధ్వంసాలు జరిగి లక్షలాది కోట్లరూపాయల నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాల పాలకులు సంయుక్తంగా ఆలోచించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అడుగులు వేయాలి.

మానవాళిని నాశనం చేసే మహాప్రళయం యుద్ధం. అది మతాన్ని, రాజ్యాన్ని, కుటుంబాలను నాశనం చేస్తుంది. అంతకంటే ఏ కీడయినా మేలే.



మార్టిన్ లూథర్

ఒకే శత్రువుతో అనేకసార్లు యుద్ధం చేయవద్దు. అలా చేస్తే నీ యుద్ధకళలన్నీ అతనికి నేర్పుతావు.



నెపోలియన్ బోనపార్టీ

# ప్రజావాక్కు



## ప్రజాధనం వృధా!

రాష్ట్ర హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు నాలుగు వేలకు పైగా చేరుకున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అంటే కోర్టు తీర్పుఇచ్చినా బాధితులకు న్యాయం జరగడంలేదన్నది స్పష్టమవుతున్నది. మరోవైపు బాధ్యులైన అధికారులు విధులు పక్కనబెట్టి కోర్టు విచారణకు వస్తున్నారు. ఈ విధంగా వారి కాలమంతా వృధాఅవటంతో ప్రజల సమస్యలకు పరిష్కారం లేకుండా పోతున్నది. ప్రజలు అసలు కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎందుకువస్తుంది. కోర్టుతీర్పు ఇచ్చినా, తీర్పు అమలు జరగనప్పుడు న్యాయవ్యవస్థ ఉనికి ప్రశ్నార్థకం అవుతుంది? ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో ఏమేధావి ఈ దుస్థితిపై పెదవి విప్పడం లేదు. ఇది మరో దౌర్భాగ్య పరిస్థితిగా భావించాలి. ఇలాంటి వ్యాజ్యాల్లో కనీసం కోర్టు ఖర్చులను బాధ్యులైన అధికారుల నుంచి రాబట్టాలి.

-గరిమెళ్లరామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

## కార్యాలయాల ఏర్పాటు ఎప్పుడు?

రాష్ట్రంలోని కోస్తాప్రాంతం ప్రజలసౌలభ్యం కొరకువిజయవాడ, విశాఖపట్నంలో లోకాయుక్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర లోకాయుక్త రాష్ట్రప్రభుత్వాన్ని కోరి సంవత్సర కాలం గడిచిపోయింది. అయినా పభుత్వంవైపు నుంచి ఎటువంటి స్పందనలేదు. మూడు రాజధానులు, పాలన వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం అంటున్న పాలకులు లోకాయుక్త జోనల్ కార్యాలయాలను వెంటనేవిజయవాడ, విశాఖలో ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బేషుగ్గా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంకా ఆలస్యం చేస్తే ముఖ్యమంత్రి గారి విశ్వసనీయత మరింత తగ్గుతుంది. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది.

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

## సముద్రజలాల కాలుష్యం అరికట్టాలి

తీరప్రాంతాల్లో ఇష్టానుసారం ఏర్పాటు చేస్తున్న పలు ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడం వల్ల మత్స్య సంపద నశించిపోతుంది. తద్వారా మత్స్యకారుల జీవనానికి విఘాతం ఏర్పడుతుంది. పట్టణాల్లో చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను టన్నుల కొద్దీ ట్రాక్టర్ల ద్వారా తెచ్చి నిత్యం సముద్రాలలో పడివేయడంతో సముద్ర జలాలు కాలుష్యం అవుతున్నాయి. సముద్రజలాల కాలుష్యాన్ని అరికట్టేవిషయంలో ప్రజల్లోఅవగాహన కల్పించాలి. సంబంధిత అధికారులు స్పందించి సముద్రజలాల కాలుష్యాన్ని అరికట్టాలి.

-తూలుగు రమణారావు, విజయనగరం జిల్లా

## వెయ్యినోటు ముద్రించాలి

2016లో నోట్లరద్దులో భాగంగా రద్దుఅయిన వెయ్యి రూపాయలనోటుని ఇప్పటివరకు ప్రభుత్వం తిరిగి ముద్రించకపోవడం ప్రజలకి అసౌకర్యం కలిగిస్తోంది. రద్దు చేసిన ఐదు వందల నోటుతోపాటు కొత్తగా రెండువేల నోటుని వెంటనే ముద్రించినప్పటికీ వెయ్యినోటుని మాత్రం ప్రభుత్వంఇప్పటివరకు ఎందుకు విడుదల చేయలేకపోయిందో అర్థం కావడం లేదు. గత రెండేళ్ల క్రితమే రెండువేల నోటుని ముద్రించడం ఆపేశామని రిజర్వు బ్యాంక్ ప్రకటించింది. వెయ్యి నోటు చెలామణిలో లేక అనేక వ్యాపార లావాదేవీల్లో ప్రజలు చాలారకాల ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంగా రెండువేల నోటు కూడా మార్కెట్లో కనిపించకుండాపోయింది. బ్యాంకులు, ఎటిఎంలలో కూడా రెండువేల నోటు కనిపించడం లేదు. పెద్ద, పెద్ద వ్యాపారాలు, లావాదేవీల్లో ఐదువందల నోట్లని వాడటం చాలా అసౌకర్యంగా ఉంటోంది. ఇప్పటికైనా ప్రజల కనీస అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం వెంటనే కొత్త వెయ్యి రూపాయల నోటుని తయారు చేసి విడుదల చేయాలి.

-పసునూరి శ్రీనివాస్, మెట్‌పల్లి, జగిత్యాలజిల్లా

## మధ్యాహ్నభోజన నాణ్యత పెరగాలి

రాష్ట్రంలోప్రభుత్వపాఠశాలల్లో మధ్యాహ్నభోజనపథకం అమల్లో పలుఅవకతవకలు జరుగుతున్నట్లు విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడయింది. భోజనం నాసిరకంగా ఉండటంతో చాలా మంది విద్యార్థులు ఇంటినుంచిభోజనం తీసుకువస్తున్నట్లు గుర్తించారు. సమస్యకు మరో కోణం ధరలు పెరిగినా ప్రభుత్వం నిర్వాహకులకు ఆమేరకుపెంచకపోవడం, సకాలంలో బిల్లులు చెల్లించక పోవడం ప్రధానకారణాలు. వాస్తవపరిస్థితి ఇలాఉంటే ప్రభుత్వం జగనన్న గోరుముద్దలు, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు అంటూ కోట్లరూపాయల ఖర్చుతో భారీ ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటు.

-జి.భారతీదేవి, ఏలూరుజిల్లా

## వైట్‌పేపర్ రివల్యూషన్

చైనీయులు దేశంలో తమకు ఏమాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవనిచెప్పేందుకు అనుసరిస్తున్న వైట్‌పేపర్‌రివల్యూషన్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. చైనాలో కొవిడ్‌ను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్‌ప్రభుత్వం తీసుకువచ్చిన జీరోకొవిడ్ పాలసీని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అక్కడివిద్యార్థులు, యువత ప్రభుత్వ తీరుకు నిరసనగా తెల్ల కాగితాలను ప్రదర్శిస్తూ నిరసనకు దిగుతున్నారు. అక్కడి వాస్తవపరిస్థితులను ప్రపంచానికి తెలియచేయడానికి ప్రయత్నిస్తున్న విదేశీ మీడియా ప్రతినిధులను తిట్టికొట్టి వేధించడం, తిప్పి పంపడం వంటి చర్యలు దారుణం.

-సి.చంద్రశేఖర్, నెల్లూరుజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# ఆర్థిక సుడిగుండంలో ప్రపంచం

**అరాచక వాదం వలన ఏ దేశం అభివృద్ధి చెందదు. ప్రతీ దేశం తమకున్న వనరులతో ప్రజలకు మేలు చేయాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అందివచ్చిన అవకాశాలను తెలివిగా వినియోగించుకోవాలి. యువశక్తి అభివృద్ధికి వరం. నైపుణ్యవంత మైన యువత వలన అభివృద్ధి శరవేగంతో ముందుకు దూసుకు పోగలదు. మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి. ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితులు భవిష్య ఆర్థికప్రణాళికల రూపకల్పనలు ఏవిధంగా ఉండాలో సూచిస్తున్నాయి. వర్తమాన ఆర్థికసంక్షోభం ప్రపంచానికి ఒక గుణపాఠం కావాలి. ఇకనైనా అన్ని దేశాలు అనవసరమైన అంశాలకు ప్రాధాన్యత నివ్వకుండా కలసికట్టుగా పనిచేసి ఈ ఆర్థిక సంక్షోభ సుడిగుండాన్ని దాటడానికి ప్రయత్నం చేయాలి.**



సుంకవల్లి సత్తిరాజు

ఆర్థిక క్రమశిక్షణ పాటించక పోతే ఎంతటి ధనిక దేశాలైనా చితికిపోక తప్పదు. పైగా ఆర్థికమాంద్యం నెలకొన్న కష్టకాలంలో కూడా అప్పులపై ఆధారపడి, దుబారా వ్యయం చేయడం వలన సంభవించే పరిణామాలు ఊహాతీతం. ప్రపంచంలోని పలు దేశాలు 'ఆర్థిక సంక్షోభం' అనే ఊబిలో కూరుకుపోయాయి. గత కొద్ది సంవత్సరాలుగా కొవిడ్ మహమ్మారి వలన ఎన్నో రంగాలు ఆర్థికంగా దివాలా తీసాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రష్యా, ఉక్రెయిన్ల మధ్య గత సంవత్సరం నుండి కొనసాగుతున్న యుద్ధం వలన చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇంధన రంగంలో స్వయం స్వావలంభన సాధించలేని దేశాలు చమురు ధరలను భరించలేక కకావికలమైపోతున్నాయి. వివిధ దేశాల్లో బ్యాంకింగ్ వ్యవస్థలు దివాలా తీసాయి. చమురు ధరల వలన అన్నిరంగాలు కుదేలైపోతున్నాయి. పాకిస్థాన్‌లో ముదిరిన ఆర్థికసంక్షోభం శ్రీలంకను తలపిస్తున్నది. ఉగ్రవాదానికి, ఆయుధాలకు విచ్చలవిడిగా ఆర్థిక వ్యయంచేసి, ఈ కష్టకాలంలో ప్రజల కనీస అవసరాలు తీర్చలేక పాకిస్థాన్ ఆర్థికంగా చిన్నాభిన్నమైపోయింది. వేర్పాటువాదం పెచ్చుపెరిగింది. ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైనది. అప్పుల కోసం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థల చెంత పాక్ పాదాక్రాంతమవుతున్నది. కనీవినీ ఎరుగుని ఆర్థిక, రాజకీయ, వేర్పాటువాద ఛాయలు పాక్‌ను చుట్టుముడుతున్నాయి. భారత్‌పై ఏడు దశాబ్దాలకుపైగా సాగిస్తున్న ఉగ్రవాదం వలన పాక్ సాధించింది శూన్యం. చైనావలలో చిక్కుకుని తీవ్రంగా నష్టపోవడం వంటి పరిణామాలతో భవిష్య పాక్ ముఖచిత్రం అత్యంత భయంకరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెనిజులాలో ఆర్థికయుద్ధం కొనసాగుతున్నది. అరాచకాలు, హత్యలు, ఆకలిచావులు అక్కడ సర్వసాధారణ ప్రక్రియలుగా మారిపోయాయి. అక్కడి పాలకుల పుణ్యమా అని, 90శాతంపైగా ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారు. వజ్రాలు, బంగారం, చమురు, నిక్షేపాలతో సుసంపన్న దేశంగా తులతూగవలసిన వెనిజులా నేడు ఒక శాపగ్రస్త దేశంగా రూపాంతరం చెందింది. ఆకలి కేకలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలతో ఆ దేశం అల్లకల్లోలంగా మారింది. ఇక మన పొరుగునున్న ద్వీపదేశమైన శ్రీలంకలో కొనసాగుతున్న ఆర్థిక సంక్షుభిత పరిస్థితులను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పెట్రోల్, గ్యాస్ ధరలు పట్టపగలే చుక్కలను చూపిస్తున్నాయి. కరెన్సీ ముద్రణ కష్టాలను తీర్చలేదు. ఔషధాల కొరత, నిత్యావసర వస్తువుల కొరతతో రెండు కోట్ల జనాభా సతమతమవుతున్నది. పేద, ధనిక, అనే తారతమ్యం లేకుండా ఆహారం కోసం, ఇతర నిత్యావసర సరుకుల కోసం, అనునిత్యం భారీ క్యూలైన్లతో ప్రజానీకం విసుగెత్తిపోతున్నది. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. ప్రజల కనీస అవసరాలు తీర్చలేక పాలకులు పడే ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన అప్పులతో, వాటిపై వడ్డీలు కూడా చెల్లించలేక, ప్రజలకు ఆహారం అందించలేక అన్నమో రామచంద్ర అని అలమటిస్తున్న శ్రీలంక దారుణ ఆర్థికపతనం చెందింది. కొవిడ్, రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం వంటి కారణాలే కాకుండా ఇప్పటివరకు దూరదృష్టి లేని ఆర్థికపోకడల వలన ఒక్కసారిగా వివిధదేశాల ఆర్థిక వ్యవస్థల్లోని మేడిపండు లాంటి అంతర్గత స్వరూపం బహిర్గతమైనది. పాతకాలం నాటి కరడుగట్టిన ఛాందస భావాలతో, పనికి మాలిన సిద్ధాంతాలతో ఆర్థిక విధ్వంసమే తప్ప అభివృద్ధి సాధ్యంకాదన్న సంగతిని వర్తమాన పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. విద్య,





వైద్యం, ఉపాధి వంటి అంశాలపై దృష్టి సారిస్తేనే ప్రపంచ గమనం ఒడిదుడుకులు లేకుండా సాగుతుంది. ఆర్థిక వనరులను దుర్వినియోగపరచి, అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే వినాశనం తప్పదు. పాకిస్థాన్‌లో చోటుచేసుకున్న పరిణామాలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అఫ్ఘానిస్థాన్‌లో కొనసాగుతున్న తాలిబాన్ల అరాచకవాదం ఆధునికంలో ఆటవికత్వాన్ని మైమరపిస్తున్నది. అఫ్ఘానిస్థాన్ కొంత కాలం తాలిబాన్ల నుండి విముక్తి చెంది, అమెరికా కనుసన్నల్లో పనిచేసే ప్రభుత్వాలు ఏలుబడిలోఉంది. కాబట్టి అక్కడ కొంత కాలం విద్య, అభివృద్ధి వంటి కార్యక్రమాల వలన ప్రజలు సుఖవంతంగా జీవించగలిగారు. తాలిబాన్ల పునఃప్రవేశంతో పరిస్థితులు మొదటికొచ్చాయి. బ్రిటన్ 'బ్రెగ్జిట్' ఫలితంగా యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగడం వలన, కొవిడ్ సమస్యల వలన ఆ దేశ జనాభాలో నాలుగోవంతు మంది ప్రజలు పేదలుగా మారిపోయారు. బ్రిటన్‌లో కూడా చాలా సబ్సిడీలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభంవలన అనేకమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్రిటన్‌లో ఆర్థిక మాంద్యం పెరిగింది. ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. ఇప్పటివరకు ప్రపంచంలో ఐదవ బలమైన ఆర్థికవ్యవస్థగా కొనసాగిన యు.కె స్థానాన్ని భారత్ ఆక్రమించింది. చైనాలో కూడా బయటకు చెప్పుకోలేనంత ఆర్థిక మాంద్యంఉంది. బ్యాంకులు దివాలా తీసాయి. చైనా ఇంకా కోవిడ్ నుంచి బయటపడలేదు. ప్రజల్లో పెద్దఎత్తున తిరుగుబాటు రావడం వలన కొవిడ్ నియంత్రణ సడలింపుల వలన కొవిడ్ వ్యాప్తి పెరిగి లక్షలాది మంది ప్రజలు మరణించారు. చైనా అప్పులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. అమెరికాలో కూడా ఆర్థిక మాంద్యం తీవ్రంగానే ఉంది. ఉద్యోగాలు ఊడిపోయాయి. ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలు రోడ్డున పడుతున్నారు. ఆహార ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్లు, వంటి సంస్థలు కూడా కష్టాల్లో ఉన్నాయి. తమ ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. ఇతర దేశాలతో పోల్చి చూస్తే భారతదేశం చాలావరకు భద్రంగా ఉందనే చెప్పాలి. ఆహార ధాన్యాలను ఇబ్బడిముబ్బడిగా పండించడం, వ్యవసాయ ప్రధానమైన దేశం కావడం, కష్టించేతత్వం భారతీయ సంస్కృతిలో ఒకభాగం కావడం వలన భారత్ చాలావరకు ఆర్థిక సంక్షోభ పరిస్థితులను తట్టుకుని నిలబడగలుగుతున్నది. వ్యవసాయ ప్రాధాన్యతను ఇకనైనా గుర్తించి ప్రోత్సహించాలి. గతంలో ప్రపంచంలోను, భారతదేశంలోను ఎక్కడికక్కడ వివిధరూపాల్లో ఆర్థిక వ్యవస్థలుండేవి. కుటీర పరిశ్రమలు, కులవృత్తుల వలన కుటుంబాలకు ఆదాయం సమకూరేది. ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితులు నాడు కనిపించేవి కాదు. వస్తు మార్పిడి విధానంవలన కరెన్సీ కేవలం నామమాత్రంగా చెలామణిలో ఉండేది. వస్తువుల ఉత్పత్తి, అమ్మకం స్థానికంగా జరిగేది. ఇప్పటి మాదిరిగా అధికజనాభా అప్పట్లోలేదు. అన్నిరకాల పంటలు పండేవి. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాటికాలంలో ఉండేది. అయితే ప్రపంచంలో అనేక మార్పులు సంభవించాయి. అన్నిదేశాల ఆర్థిక విధానాల్లో సమూల మార్పులు జరిగాయి. ప్రపంచంలో ఏచిన్న సంఘటన జరిగినా అది మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసేపరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ప్రపంచ దేశాలన్నీ గతకాలం నాటి సామ్రాజ్యవాద విధానాలను, యుద్ధాలను విడనాడాలి. ప్రపంచాధిపత్యంకోసం ప్రజలను ఇక్కట్లకు గురి చేయడం భావ్యంకాదు. ప్రపంచ దేశాలన్నీ ప్రజాస్వామిక విధానాలతో మెలగాలి. ఆర్థికంగా ఎదగాలి. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలి. ప్రపంచంలో మొత్తం నెలకొన్న ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితులకు చరమగీతం పాడాలి. అరాచక వాదం వలన ఏ దేశం అభివృద్ధి చెందదు. ప్రతీ దేశం తమకున్న వనరులతో ప్రజలకు మేలు చేయాలి. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. అందివచ్చిన అవకాశాలను తెలివిగా వినియోగించుకోవాలి. యువశక్తి అభివృద్ధికి వరం. నైపుణ్యవంతమైన యువత వలన అభివృద్ధి శరవేగంతో ముందుకు దూసుకు పోగలదు. మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి. ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితులు భవిష్య ఆర్థికప్రణాళికల రూపకల్పనలు ఏవిధంగా ఉండాలో సూచిస్తున్నాయి. వర్తమాన ఆర్థికసంక్షోభం ప్రపంచానికి ఒక గుణపాఠం కావాలి. ఇకనైనా అన్ని దేశాలు అనవసరమైన అంశాలకు ప్రాధాన్యత నివ్వకుండా కలసికట్టుగా పనిచేసి ఈ ఆర్థిక సంక్షోభ సుడిగుండాన్ని దాటడానికి ప్రయత్నం చేయాలి. ●

# మహిళలపై అత్యాచారాలను నిరోధించలేమా?

సి.హెచ్.ప్రతాప్

అరుదైన నేరాల్లోనే అరుదైన అమానుష నేరమిది. సమాజం ఎటుపోతోందో తెలియడం లేదు అంటూ ఢిల్లీలో ఇటీవల తెల్లవారుజామున ఒక అమ్మాయి ప్రయాణం చేస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టి ఆమెను 12 కి.మీ దూరం ఈడ్చుకుపోయిన కారు ఉదంతంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్య ఇది. ప్రియురాలితో విభేదించి ఆమెను చంపి మృతదేహాన్ని 36ముక్కలుగా నరికి దేశరాజధానిలోని వివిధ ప్రాంతాల్లో విసిరిన పరమపైశాచిక ప్రియుడి ఉదంతం ప్రపంచం మరువక ముందే సదరు సంఘటన జరిగింది. మహిళలపై ఇటువంటి పరమ పైశాచిక, ఘాతుక నేరాలకు ఢిల్లీనగరం పేరు గాంచడం నిజంగా దురదృష్టం. ఈ నేరాల తీరు చూస్తుంటే దేశ రాజధాని నగరంలో శాంతిభద్రతలు అనేవి అసలు ఉన్నాయా అన్న అనుమానం ప్రతిఒక్కరికి కలుగుతుంది. సదరు ఘటనలో ఐదుగురు వ్యక్తులున్న కారు 20ఏళ్ల మహిళ ప్రయాణం చేస్తున్న స్కూటర్‌ను ఢీకొని ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ దారుణ ఘటన జరిగిన సమయంలో వీరు మితిమీరి తాగి ఊగుతూ కారులో వెళ్లుతున్నారని, పెద్దశబ్దంతో సంగీతం పెట్టుకొని కారు నడుపుతున్నారని, కారు కింద చిక్కుకుపోయిన ఆమె అరుస్తున్నా పట్టించుకోకుండా వారు కారు నడిపినట్టు, పోలీసు బారికేడ్లు అడ్డమొచ్చిన చోట 'యు' టర్న్‌లు తిప్పుకొంటూ విలాసంగా సాగిపోయినట్టు ప్రత్యక్ష సాక్షుల కథనం. ఇంత కన్నా దారుణమైన విషయం ఏమిటంటే ఈ సంఘటనను చూసిన వారు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినా వారు దానిని పట్టించుకోకపోవడం. దేశ రాజధానిలో సాక్షాత్తు రాష్ట్రపతి, ప్రధాని కొలువుండే మహానగరంలో మహిళలపై ఇష్టానుసారంగా అత్యాచారాలు, వేధింపుల ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్టు? అన్నింటికీ మించి మహిళను



అత్యంత చులకనగా కేవలం భోగ వస్తువుగా పరిగణించి ఆమెను ఇష్ట విలాసంగా హింసించి ఆనందించే తత్వం దేశరాజధాని పురుషుల్లో జీర్ణించుకొనిపోయిందా అనే అనుమానానికి ఆస్కారం కలుగుతున్నది. ఢిల్లీలో 2021లో ప్రతిరోజూ ఇద్దరు మైనర్ బాలికలపైఅత్యాచారం జరిగినట్టు జాతీయ నేరరికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీదనే ఢిల్లీ మహిళలకు చాలా అరక్షిత ప్రదేశమని మరోసారి వ్యాఖ్యానించింది. 2021లో మహిళలపై నేరాలు40శాతం పెరిగాయి. ఆ సంవత్సరంలో ఇందుకు సంబంధించి 13,892 కేసులునమోదయ్యాయి. నిర్భయ చట్టం తర్వాత కూడా మహిళలపై అత్యాచార పర్వం అప్రతిహతంగా సాగుతోంది. ముద్దాయిలు క్రూరాతిక్రూరమైన నేరాలకు పాల్పడుతున్నా, వారం పదిరోజుల్లో బెయిల్ తీసుకొని దర్జాగా బయట ప్రపంచంలో తిరుగుతున్నారు. చట్టం, న్యాయ వ్యవస్థల పట్ల వీరికి ఎలాంటి భయభక్తులు లేవు. ఇలాంటి వారిని చూసి ముద్దాయిలను విచారణ పేరుతో పోషించే బదులు నడిరోడ్డుపై కాల్చి పారేయాలని డిమాండ్లు ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో పెరుగుతున్నాయి. ●

# రైతు రాజ్యమే బిఆర్‌ఎస్ అజెండా

డాక్టర్ తిరునహరి శేషు

పంతొమ్మిదివందల యాభై ఒకటి నుండి 2019 వరకు భారతదేశంలో జరిగిన ఎన్నికలలో పార్టీలు నాయకులు గెలుస్తూ ప్రజలు మాత్రం ఓడిపోతున్నారు కాబట్టే దేశంలో పాలన ప్రజలకు చేరువ కాలేదు. ప్రజా సమస్యలకు పరిష్కారాలు దొరకలేదు. ఈ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం ప్రకృతి సహజ సంపద మానవ వనరులు పుష్కలంగా ఉన్నా దేశం ఆశించినస్థాయిలో పురోగతి సాధించలేదు. స్వాతంత్ర్యం భారతలక్ష్యాన్ని చేరలేదు. అలాగే స్వాతంత్ర ఫలం పూర్తిగా సిద్ధించలేదు. కాబట్టి భారత్ స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల కోసం కాకుండా దేశం కోసం రాజకీయాలలో గుణాత్మకమైన మార్పుకోసం భారత రాష్ట్రసమితిని ఏర్పాటు చేసి అమెరికా, చైనాలకి ధీటుగా ప్రపంచ యవనికపై భారతదేశపు జెండాను రెపరెపలాడించడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముందుకు కదులుతున్నట్లుగా కనిపిస్తుంది. నాడు ప్రత్యేక తెలంగాణ పక్కా అంటే హేళన చేసిన గళాలే నేడు భారతరాష్ట్రసమితిపై విషం చిమ్ముతుంటే ఆబ్ కి బార్ కిసాన్ సర్కార్ నినాదంతో బలమైన జాతీయ అజెండాతో భారత రాజకీయ చిత్రపటంపై కెసిఆర్ నాయకత్వంలో బిఆర్‌ఎస్ అడుగులు వేయడానికి సిద్ధమవుతుంది. భారతదేశ రాజకీయాలలో ఉత్తరాది రాజకీయ ఆధిపత్యం కింద దక్షిణాది నాయకులు పెద్దగా ఎదగలేకపోయారు. కానీ అవకాశం వచ్చినప్పుడు రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నీలం సంజీవ రెడ్డి మైనార్టీ ప్రభుత్వాన్ని ఐదుసంవత్సరాలు విజయవంతంగా నడిపిన ప్రధానమంత్రిగా పివి నరసింహారావు, మాజీ ప్రధాన మంత్రి దేవగౌడ, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తాము ఏమిటో నిరూపించారు. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత కేంద్రంలో మోడీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ ప్రభుత్వానికి జాతీయ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో భావ సారూప్యతకల పార్టీలతో సంప్రదింపులు జరుపుతూ కేవలం రాజకీయ ప్రత్యామ్నాయమే కాదు ఒక బలమైన అజెండాతో ఆకాంక్షతో దేశం కోసం రైతు అజెండాతో బిఆర్‌ఎస్ రూపంలో జాతీయ జెండాను ప్రజల ముందుకు కెసిఆర్ తీసుకురావడంతో దేశ రాజకీయాలలో రాబోయే పరిణామాలపై చర్చ ఆసక్తి మొదలైందనే చెప్పాలి. ఇందిరాగాంధీ గరీబీ హటావో, రాజీవ్ గాంధీ 21వ శతాబ్దంలోకి భారత్ వాజ్‌పేయ్ ఇండియా షైనింగ్ ప్రధానమంత్రి నరేంద్రమోడీ సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ నినాదాలకంటే మహోజ్వల దేశాభివృద్ధి కోసం ఆప్ కీబార్ కిసాన్ సర్కార్ నినాదంతో కెసిఆర్ ప్రతిపాదిస్తున్న అజెండాపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. దేశంలో సాగునీరు, తాగునీరు విధానంపై దళిత సాధికారత కోసం దేశవ్యాప్తంగా అమలు చేసే దళితబంధుపై రెండుసంవత్సరాలలో వెలుగు జిలుగుల భారత్‌తో దేశవ్యాప్తంగాసాగుకు ఉచిత విద్యుత్ పంటలకు చట్టబద్ధతకల కనీస మద్దతు ధర లాంటి ప్రతిపాదనలతోపాటు రెండు పర్యాయలు బిజెపి అధికారంలోకి వచ్చినా రైతు ఆదాయం రెట్టింపు చేస్తామనే హామీ నెరవేరలేదు. రైతు రోజువారి సగటు ఆదాయం340 రూపాయలు మాత్రమే. కానీ సగటు రైతు రుణభారం మాత్రం రూ. 74వేల కంటే ఎక్కువే. భారతదేశం లాంటి వ్యవసాయక దేశంలో చౌదరి చరణ్‌సింగ్ దేవీలాల్, అజిత్ సింగ్ మహేంద్ర సింగ్, తికాయత్ శరత్‌జోషిల తరువాత కెసిఆర్ ప్రతిపాదిస్తున్న రైతుల అజెండ ప్రజలదృష్టిని ఆకర్షిస్తుంది. కెసిఆర్ అజెండాపై దేశవ్యాప్తంగాప్రజలు మేధావి వర్గాలలో విస్తృతమైన చర్చ జరుగుతుంది. ఇప్పటివరకు దేశంలో వచ్చిన వ్యవసాయసంస్కరణల స్థానంలోరైతు సంస్కరణలు తీసుకువచ్చి రైతాంగ సమస్యల పరిష్కారంతో మరొక కొత్త భారతదేశాన్ని ఆవిష్కరించాలనే కెసిఆర్ ఆలోచనకి కార్యరూపం వస్తే బిఆర్‌ఎస్ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ ఆశిస్తున్నట్లు మరొక 20 సంవత్సరాలలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారేఅవకాశం లేకపోలేదు. బిజెపిపార్టీని ఎదుర్కోవడానికి దేశవ్యాప్తంగా కెసిఆర్‌తో కలిసి వచ్చేవారు ఎవరూ ప్రస్తుతానికైతే ఎన్‌డిఏ కూటమితోను యుపిఏ కూటమితోను భాగస్వామ్యం లేని పార్టీలు వివిధరంగాలలో పనిచేసిన వృత్తినిపుణులు రైతు సంఘాల నాయకులు మేధావులు కెసిఆర్‌తో కలిసి నడిచే అవకాశం ఉంది. కర్ణాటకనుండి జనతాదళ్ సెక్యులర్ పార్టీనాయకులు మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డి దేవగౌడ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, సమాజ్‌వాది పార్టీఅధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, విసికే అధ్యక్షులు, తిరుమవలన్ హర్యానా మాజీ ముఖ్యమంత్రి చౌతాల జయంత్ సింగ్ లాంటి నాయకులు కెసిఆర్‌తో బిఆర్‌ఎస్ పార్టీతో కలిసి నడవడానికి సిద్ధడినారు. భవిష్యత్తులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, వామపక్షాలు కూడా కెసిఆర్‌తో జతకట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం యుపిఏ భాగస్వామ్యపక్షాలుగా ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ శివసేన జెఎంఎం డిఎంకే జెడియు, ఆర్‌జెడి పార్టీలు కూడా కెసిఆర్‌పట్ల సానుకూలంగానే ఉన్నాయి. ఒడిశాలో నవీన్ పట్నాయక్, బిజూ జనతాదళ్‌కి, బిజెపికి మధ్యనే రాజకీయవైరం ఉంది. కాబట్టి నవీన్‌పట్నాయక్ లాంటి మరికొంతమంది తటస్థంగా ఉండే నాయకుల వైఖరి ఎన్నికల తర్వాత స్పష్టం అవుతుంది. కాబట్టి కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్‌ఎస్ చత్రం కింద ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బిఆర్‌ఎస్ నుండి కెసిఆర్ వేసిన మొదటి అడుగు బిఆర్‌ఎస్ జాతీయ కిసాన్ సంఘం అధ్యక్షుడిగా గురునాం సింగ్‌ని నియమించడంతో తన అజెండాను స్పష్టం చేసినట్లుగానే భావించాలి. కెసిఆర్ ద్విముఖ రాజకీయ వ్యూహంతో ముందుకెళుతున్నట్లుగా కనిపిస్తుంది. మొదటి వ్యూహంలో భాగంగా దేశవ్యాప్తంగా తనకు అనుకూలమైన రాష్ట్రాలలో ప్రాంతాలలో బిఆర్‌ఎస్‌ని రాజకీయపార్టీగా బలోపేతం చేయడం రెండవ వ్యూహంలో భాగంగా భావసారూప్యత గల పార్టీలతో అవగాహనకి రావడం ద్వారా తానుఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవటమే కెసిఆర్ ధ్యేయంగా కనిపిస్తుంది. ఇందుకోసం కెసిఆర్ స్పష్టమైన ప్రణాళిక అజెండాతో ముందుకెళుతున్నట్లుగానే భావించాలి. గత ఎన్నికలలో బిజెపితో ఉన్న జనతాదళ్ యునైటెడ్ లోక్‌జనశక్తి పార్టీ శివసేన అకాలీదళ్ మరికొన్ని చిన్న పార్టీలు బిజెపి ఎన్డీయేకి దూరం కావడంతో రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బిజెపి ఒంటరిగా మిగిలిపోయే అవకాశం ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగే తొమ్మిదిరాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో పెద్దరాష్ట్రాలైన కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బిజెపి గెలుపు అంత తేలికైన విషయం కాదు. బిజెపి పార్టీకి రాజకీయంగా అనుకూలమైన పరిస్థితులు ఆ రాష్ట్రాలలో లేవు. ఈ మూడురాష్ట్రాలలో బిజెపి కంటే కాంగ్రెస్‌కే గెలిచే అవకాశాలు ఎక్కువగాఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల తర్వాత ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయపార్టీగా గుర్తింపుపొందింది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో వచ్చే ఓట్ల శాతంతో బిఆర్‌ఎస్ కూడా జాతీయ పార్టీగా సులభంగానే 2024లోక్‌సభ ఎన్నికల తరువాత గుర్తింపు పొందబోతుంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో బిఆర్‌ఎస్ ప్రభావం ఏమీ ఉండబోదని ఆ రాష్ట్రాల మంత్రులు పేర్నినాని సుదీర్ మాట్లాడుతున్నారు. కానీ బిఆర్‌ఎస్ పార్టీ కంటే బిఆర్‌ఎస్ ప్రజల ముందుకు తెస్తున్న అజెండా బలమైనది కాబట్టి 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి భారత రాజకీయాలలో కీలక మలుపు తిరగబోతున్నదనేది వాస్తవం. ●



# అమరావతి వార్త



## ఉల్లాసంగా ఉత్సాహంగా గ్రామీణక్రీడలు

**పెదనందిపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ లైబ్రరీ పెదనందిపాడు సోమవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామీణ క్రీడలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోస్లైకింగ్ కాలితో కొబ్బరికాయ విసరడం మ్యూజికల్ చైర్స్ కర్రసాము తదితర గ్రామీణ క్రీడల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న డాక్టర్ కొల్లా అనిత మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పోటీల వలన మానసిక ఉల్లాసం, శారీరక దారుడ్యం కలుగుతుందని ప్రజలందరూ స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. గత 20సంవత్సరాలుగా కొల్లా వెంకయ్య జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్లైకింగ్



పోటీల్లో ప్రధమ బహుమతి ఎం మోక్షిత్ ద్వితీయ స్థాయిలో పి.ఆదిత్య, మూడవ బహుమతి ఎ.పృద్వీ, కాలితో కొబ్బరికాయ విసరడం పోటీల్లో ప్రధమ బహుమతి కంచర్ల గోపి, రెండవ బహుమతి చేవెళ్ళ రాము, మూడవ బహుమతి ఎం.గోపి వంశీ, కనో స్లేషన్ ప్రైజ్ ఎం.త్రివేణి, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో ప్రధమ బహుమతి కె.చంద్రిక, రెండవ బహుమతి ఎల్.వైష్ణవి, మూడవ బహుమతి ఎం.త్రివేణి, ఈ సందర్భంగా చేవెళ్ళ రాము బృందం వారిచే కర్రసాము ప్రదర్శన నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ కొల్లా అనిత, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, కొల్ల రామన్, ఆచారి బండి నాగేశ్వరరావు, కుర్ర హరిబాబు, రవి శివరామకృష్ణయ్య తదితరులు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, కొల్లా వెంకయ్య చౌదరి, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, కొల్లా జగదీష్, మొదలగు వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్రసాము బృందం రాష్ట్ర, కేంద్ర స్థాయిలో అవార్డులు పొందిన సందర్భంగా వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెదనందిపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సందడిగా సంక్రాంతి సంబరాలు

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట స్టేడియంలో సంక్రాంతి సంబరాల వేడుకలు సందడిగా నిర్వహించారు. ఆదివారం, సోమవారం ఈ వేడుకలు అంబరాన్ని అంటాయి. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో పాటు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలను పట్టణ ప్రజలు, ప్రముఖులతో కలిసి వీక్షించారు. పూర్తి ఆహ్లాదకర వాతావరణంలో సంతోషాల మధ్య సంక్రాంతి వేడుకలు జరిగాయి. సాంప్రదాయ దుస్తుల పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నాట్యం వంటి కార్యక్రమాలను రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించింది. పలు సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. యాంకర్ శాంతి, మిమిక్రీ ఆర్టిస్ట్ శంకర్, సరికొండ రమాదేవి, సింగర్ మాల్గాడిసుభ తమ ఆట పాటలతో, మాటలతో యువతను ఆకట్టుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాలను డిఆర్ఓ వినాయకం, పి.డి.బాలునాయక్ తదితరులు వీక్షించారు.







## ముస్సాపురంలో కత్తి దూసిన కోడి వెనుతిరిగిన పోలీసులు

**పెదకూరపాడు, జనవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని ముస్సాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందాలు నిర్వహిస్తున్న వైనం గత మూడు రోజులుగా నెలకొంది. కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులు చేసి వెళ్లిన తర్వాత ముస్సాపురం షాడో సర్పంచ్, వైకాపా నాయకురాలు ఆధ్వర్యంలో కోడి పందాలు జోరుగా నిర్వహించారు. శనివారం రాత్రి

**- జయమ్మ వర్సెస్ పోలీస్ మధ్య హోరాహోరీ, పంతంలో నెగ్గి కోడిపందెం నిర్వహించిన షాడో సర్పంచ్**

**- సాంప్రదాయం పేరుతో జీవ హింస చేస్తున్నా పందెం రాయుళ్ళు...సుమారు వంద కోళ్ళు మరణం**

**- సరదా కోసం సవాళ్ళు కాస్తూ నోరులేని కోళ్ళ ప్రాణాలు తీస్తున్న కోడి పందెందారులు**

నుంచి సోమవారం రాత్రి వరకు కోడి పందాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది పందెం రాయుళ్ళు, ప్రజలు వీక్షించేందుకు, పందెం కాసేందుకు రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు కోడి పందాలు చేతులు మారాయని, సుమారు 100 కోళ్ళ వరకు కత్తి దాడిలో చనిపోయాయని స్థానిక ప్రజలు తెలిపారు. సంక్రాంతి సంబరాల పేరుతో సరదాను సయ్యాటగా మార్చి నోరులేని జీవాలతో పోట్లాడించి ప్రాణాలు తీసిన వైనం ముస్సాపురం సాక్షిగా జరిగింది. అరికట్టాల్సిన పోలీస్ యంత్రాంగం చేతులు దులిపేసుకొని నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. షాడో సర్పంచ్ మాత్రం మగరాయుళ్ళా అధికారులపై జులుం చూయించి కోడి పందాలకు స్టాల్స్ ఏర్పాటు చేసి బంకిని మొదలుపెట్టి లక్షల రూపాయలు సంపాదించుకున్నారు. డిఎస్పీ ఆదినారాయణ సైతం స్థావరాలను పరిశీలించి వెళ్ళిన తర్వాత వైకాపా నాయకురాలు షాడో సర్పంచ్ కోడి పందాలు నిర్వహించి తన పంతం నెగ్గించుకుంది. విఫలమైన పోలీస్ యంత్రాంగం వెనుదిరిగి గమ్యం చేసుకున్నారు. ఒకరు గ్రామంలో లా అండ్ ఆర్డర్ విషయంలో నియంత్రించాల్సిన పోలీస్ యంత్రాంగమే వెనుగితే, సామాన్య ప్రజలకు రక్షణ ఏ విధంగా దొరుకుతుందని, నోరులేని జీవాలను హింసించి కత్తి దారిలో ప్రాణాలు తీస్తుంటే జంతు ప్రియుల ప్రాణం విలవిలాపోయిందని మండల ప్రజలు అంటున్నారు. జయమ్మ వర్సెస్ పోలీసుల సాక్షిగా కోడి గుండెల్లో కత్తి దూరింది. అనుమతులు లేకుండా కోడి పందాలను, స్టాల్స్ ఏర్పాటు చేసి ఒక ఆటలా కాకుండా వ్యాపారంలా మార్చి లక్షల రూపాయలు సంపాదిస్తున్న నాయకులను, వారికి వత్తాసు పలికి పండుగ రోజున వందల సంఖ్యలో ప్రాణాలను పణంగా పెట్టిన కోడి, సాక్షిగా ఆటకు సంబంధిత నాయకులను ఆటకు సహకరించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అమరావతి మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో ఐదారు స్టాల్స్ నిర్వహించి కోడి పందాలు వేశారు. బొమ్మబొరుసు, మూడు ముక్కలాట, అనధికార మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. అమరావతి పోలీసులు ఎవరికి ఫోన్ చేసినా సెలవులో ఉన్నామని చెప్పడం గమనార్హం. ఉంగుటూరు సాక్షిగా వేల మంది ప్రజలు పండుగ రోజు సరదాను వ్యసనంగా మార్చుకుని చేతులో ఉన్న డబ్బులన్నీ పోగొట్టుకొని నిరాశగా వెనుదిరిగిన వైనం కోకొల్లలు.



మూడు ముక్కలాట ఆడుతున్న పందెం రాయుళ్ళు



కోడి పందాలు నిర్వహిస్తున్న పందెం రాయుళ్ళు

పెదకూరపాడు నియోజకవర్గంలోని ముస్సాపురం, ఉంగుటూరు వైకాపా నాయకుల హవా బాగా సాగింది. పోలీస్ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించారు.

### ఎస్ఎస్ఎమ్ఎస్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో

## పాలక వర్గం ఏకగ్రీవం

**విజయవాడ, జనవరి 16, ప్రభాతవార్త :**

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ ఉత్తర్వుల మేరకు సోమవారం ప్రశాంతి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో నిర్వహించిన విజయవాడ సత్యనారాయణపురంలోని



(ఎస్ఎస్ఎమ్ఎస్ అర్బన్ బ్యాంక్) శ్రీ శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంకు" పాలక వర్గం ఎన్నికల్లో ఏకగ్రీవంగా చైర్మన్‌గా కుసుమ లావణ్య దేవి, వైస్ చైర్మన్‌గా ఆర్ అమూల్య కల్పన, బ్యాంక్ డైరెక్టర్లుగా జి.అపర్ణ, వి.నాగమణి, కె.లక్ష్మికుమారి, ఎం.జ్ఞానాంబ, పి.రాధికలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వైవి కోటేశ్వరరావు మరియు చక్రవర్తి మరియు బ్యాంక్ సిఈవో జి.ప్రభాకరరావు'లు తెలిపారు. 5 సంవత్సరాలపాటు అధికారంలో ఉండే ఈ ఎన్నికైన పాలకవర్గ సభ్యులను బ్యాంకు సభ్యులు ఉద్యోగులు సత్కరించి, అభినందించారు. ఇప్పటి వరకు 28కోట్ల 50 లక్షలు డిపాజిట్లు ఉండగా 18 కోట్ల 60లక్షలు అడ్వానర్స్ ఉండగా మొత్తం నాలుగువేల ఆరువందల సభ్యులతో ఈ బ్యాంక్ కొనసాగుతుందని వారు తెలిపారు.

## వినియోగదారులకు వారి కుటుంబసభ్యులతో కూడిన క్యాలెండర్ల పంపిణీ

### సుమారు 600 మంది వినియోగదారులకు పంపిణీ

**విజయవాడ(గవర్నర్‌పేట), జనవరి 16, ప్రభాతవార్త**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బందరు రోడ్డు లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధీకృత సంస్థ పైలెట్ సర్వీస్ స్టేషన్ (పెట్రోల్ బంక్)లో విన్నూత్న పద్ధతిలో వినియోగారులకు వారి కుటుంబ సభ్యులతో కూడిన 2023 క్యాలెండర్‌లను ఉచితంగా సంస్థ మేనేజర్ కె.వెంకటప్పయ్య తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాదాపు 600 మంది



వినియోగారులు తమ తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఫొటోలు దిగి, వెనువెంటనే ఆరి వారి ఫోటోలతో ఉన్న క్యాలెండర్‌ను తమ వెంట తీసుకుని వెళ్ళారు. ప్రధానంగా మహిళలు, పిల్లలు పాల్గొని ఎంతో ఉత్సాహంగా తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్‌లు, గాలిపటాలను పంపిణీ చేశారు. సంస్థ అధిపతి ఎంవివి సత్యన్నారాయణ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా సంక్రాంతి పండుగ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఓసియల్ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ నరేంద్రమౌర్య, అనిల్, ఎన్‌టిఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, సంస్థకు సంబంధించిన నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కేశినేని శివనాథ్ (చిన్ని) మరికొందరు నేతలపై ఎంపి వ్యాఖ్యలు అర్ధరహితం

**ఎ కొండూరు, జనవరి 16, ప్రభాతవార్త :**

విజయవాడ ఎంపి ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో ప్రెస్‌మీట్‌లో తెలుగుదేవం పార్టీ నాయకుడు కేశినేని ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) మరికొందరు నేతలపై చేసిన విమర్శలు ఒక బాధ్యత గల ఎంపి మాట్లాడే తీరు కాదని ఈ విమర్శ టిడిపి క్రమశిక్షణా రాహిత్యానికి వ్యతిరేకమని తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ కొండూరు మం డలాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు, శ్రేణులు కార్యకర్తలు తీవ్రంగా ఆక్షేపిస్తూ ఖండించారు. టిడిపి పార్టీలో ఒక బాధ్యత గల ఎంపి పార్టీలో ఏదైనా వ్యవహారాన్ని అధినాయకుడు, మాజీ సిఎం చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు, అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ల సమక్షంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని అలా కాకుండా ఎంపి ప్రెస్‌మీట్‌లో క్రమశిక్షణగా చర్యలు ఉల్లంఘించి బహిరంగంగా ప్రెస్‌మీట్‌లో కేశినేని శివనాథ్ మరికొందరు నేతలపై పార్టీ టికెట్లు ఇవ్వవద్దని, టికెట్లు కేటాయిస్తే వారిని ఓడిస్తానని, తాను పార్టీకి పనిచేయనని అనుచిత వ్యాఖ్యలు చేయడం, గతంలో కూడా పార్టీ అధినాయకుడపై సోషల్ మీడియాలో వ్యతిరేక విమర్శలు చేయడం విజయవాడ ఎంపి నియోజకవర్గంలోని అసెంబ్లీ స్థానాల్లో తానొక్కడే లీడర్‌నని, తాను చెప్పిందే వేదమని ఎంపి భావించడం నియంత పోకడని, పార్టీలేనిదే ఎంపి వ్యక్తిగత పలుకుబడి ఏ మాత్రం కాదని, ఇకనైనా ఎంపి శివనాథ్ (చిన్ని)పై మరికొందరు నేతలపై విమర్శలు చేయడం మాని, పార్టీ అభివృద్ధికి, పటిష్టతకు కృషి చేయాలని లేని పోంలో మౌనంగా వుండి రాజకీయ జీవితానికి స్వస్తి పలకాలని, ఇలాంటి వ్యాఖ్యల వల్ల టిడిపికి అధినాయకుడికి ఎటువంటి నష్టం లేదని, 2024లో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, ఎంపి ఆత్మపరిశీలన చేసుకొని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తిరువూరు నియోజకవర్గ పార్టీ శ్రేణులు కార్యకర్తలు హితవు పలికారు.

## జిఎంసీ సంక్రాంతి సంబరాలు విజయవంతం

**గుంటూరు విద్య, జనవరి 16, ప్రభాతవార్త :** సంక్రాంతి సంబరాల విజయవంతంలో అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులతో పాటు నగర ప్రజల సహకారం కూడా మరువలేనిది అని నగర్ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ



ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు విజయవంతం అయ్యాయని మేయర్ పేర్కొన్నారు. సంబరాల్లో భాగస్వాములైన ఈవెంట్ ఆర్గనైజర్ కాసుల కృష్ణంరాజు, కళాకారులు, అధికారులు, లైటింగ్, మైక్ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు, ఎన్టీఆర్ స్టేడియం సిబ్బందిని ఆదివారం సంబరాలు ముగిసిన వెంటనే మేయర్ కావటి మనోహర్ నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తదితర ప్రజాప్రతినిధులు ఆ అధికారులను ప్రత్యేక అభినందించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. నగరపాలక సంస్థ ఎంఎల్ఓ మహేష్ ను పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. సంబరాల నిర్వహణకు సహకరించిన స్పాన్సర్స్ కు నగరపాలక సంస్థ తరుపున మేయర్, కమీషనర్ లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### అయ్యప్ప శరణుఘోషతో

## మకరజ్యోతి దర్శనం

**గుంటూరు కల్చరల్, జనవరి 16, ప్రభాతవార్త :**

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం భారతి ధార్మిక విజ్ఞానపరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ, ఆలయ పాలకమండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాల్లో విఘ్నేశ్వరపూజ, గంగిరెద్దుల





విన్యాసాలు, అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. అనంతరం పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమా మహేశ్వరరావు, గోపీచంద్, శ్రీహరి తదితరులు అయ్యప్ప శరణుఘోష నడుమ మకర జ్యోతి వెలిగించారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు సంక్రాంతి సందర్భంగా అరిసెలు తీర్థప్రసాదాలు అందించారు.

## గుంటూరు మాస్టర్స్ అథ్లెట్స్‌కు సన్మానం

**గుంటూరు స్పోర్ట్స్, జనవరి 16, ప్రభాతవార్త :**

ఇటీవల గుంటూరు ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 40వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక చుట్టుగుంట వాకింగ్ ట్రాక్‌లో శిక్షణ పొందుతున్న ఏడుగురు క్రీడాకారులు వై.వేంకటేశ్వరరావు కె.సాంబశివరావు, కృష్ణమూర్తి, వి.వేంకటేశ్వర్లు, అడపా వెంకటేశ్వర రావు, వి.సురేష్‌బాబు, పి.బాలకోటయ్య లు పతకాలు సాధించి రాష్ట్ర, జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసినందుకు గాను ఆదివారం ఉదయం స్థానిక చుట్టుగుంట వాకింగ్ ట్రాక్‌లో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు, రిటైర్డు ఆర్జెడి ఐ.కె.వి.ప్రసాద్‌లు ఘనంగా సన్మానించారు. రాబోయే జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలని వారు కోరారు. కార్యక్రమంలో అడపా వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, రమణలు పాల్గొన్నారు.



# పలువురికి సన్మానం

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆరెమండ గ్రామంలో వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో పాల్గొని విశేష సేవలందించిన పలువురిని ఆరెమండ గ్రామస్తులు సంక్రాంతి సందర్భంగా సత్కరించారు. శ్రీకృష్ణదేవరాయలు, చిరంజీవి ఫ్యాన్స్, వంగవీటి మోహనరంగా, పవన్ కళ్యాణ్ సేవా సంఘాల ద్వారా సేవలందిస్తున్నవారిని సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు.



సేవా కార్యక్రమాలు నిర్వహించే వారిని ప్రోత్సహిస్తే మరింతమంది సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు వస్తారని, తద్వారా మరింత మందికి చేయూతనందించవచ్చని చెప్పారు. సేవ చేసేవారిని ప్రోత్సహించడం సమాజ ధర్మమని అంబటి ఏడుకొండలు చెప్పారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

# గో మాతలను కాపాడుకోవాలి

**- ధర్మకర్తల మండలి ఛైర్మన్ నాగసూరి ప్రతాప్‌కుమార్**

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** గో మాతలను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ నాగసూరి ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలో సోమవారం కనుమ పండుగను పురస్కరించుకొని గోవులను పూజించారు. ఈ సందర్భంగా నాగసూరి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గోవులకు వైరస్ సోకి అక్కడక్కడ మృతి చెందుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, వైరస్ నుంచి గోవులను కాపాడుకొనేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోమాతను పూజిండం వల్ల సర్వసుఖాలు కలుగుతాయన్నారు. అన్ని జంతువుల్లోకి గోవుకు ప్రత్యేకమైన స్థానముందన్నారు. తొలుత అర్చకులు గోవుకు సంబంధించిన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. గోవులను కన్నుల పండువగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తుల్లిమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చదువు ద్వారానే అభివృద్ధి

**- బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాటి కిషోర్**

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** చదువు ద్వారానే సమాజంలో అసమానతలు తొలగి అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ)నియోజకవర్గ ఇన్‌చార్జి యాతాటి కిషోర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బిఎస్పీ అధినేత్రి కుమారి మాయావతి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహక ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించినట్లుగా ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని అప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని చెప్పారు. ముఖ్యంగా యువకులు ఈ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ మండలాధ్యక్షుడు చుక్కా కిషోర్‌కుమార్, యువజన నాయకుడు కంచర్ల సాత్విక్, బి.ఆకాష్, పి.ముకుంద తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి

**-మృతుని కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పరామర్శ**

**కొల్లూరు, జనవరి 16, ప్రభాతవార్తః** విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన రైతుకు న్యాయం చేయాలని కొల్లూరు మండల సిపిఎం, టిడిపి, బంధువుల ఆధ్వర్యంలో కొల్లూరు సబ్ స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కొల్లూరు మండలం కిష్కిందపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు కొల్లి వెంకటేశ్వరరావు (46) మొక్కజొన్న పంటకు నీరు పెడుతున్నసమయంలో కరెంట్ తీగ తెగి క్రిందపడి ఉన్నది గమనించకుండా పొలానికి నీరు పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతునికి న్యాయం చేయాలని సిపిఎం, టిడిపి నాయకులు మృతుని బంధువుల ఆధ్వర్యంలో న్యాయం చేయాలని కొల్లూరు సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టి ఆందోళన చేశారు. ఇంతవరకు సంబంధిత అధికారులు స్పందించకపోవటంతో ధర్నా కొనసాగిస్తామని ఆందోళనకారులు అంటున్నారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మండల టిడిపి నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగా మధుసూధన్‌ప్రసాద్, టి కృష్ణమోహన్, టి సురేష్, వి వెంకట్రామయ్యలు పాల్గొన్నారు.



# జనసైనికుల ఆత్మీయ సమ్మేళనం

**కొల్లూరు, జనవరి 16, ప్రభాతవార్తః** రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వైకాపా ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు విశ్రమించేదిలేదని జనసేన ఐటి విభాగం అధ్యక్షుడు ముత్తిరెడ్డి రవికృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల జనసైనికుల ఆత్మీయ సమ్మేళనం పెసర్లంకలో జరిగింది. సమావేశానికి లంక గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా జనసైన ఐటి విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ముత్తిరెడ్డి రవికృష్ణ మాట్లాడుతూ సమైక్యపోరాటంద్వారానే సమాజంలో మారు ్రసాధ్యమన్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునే శాసనంగా భావించి జనసైనికులు ముందుకుసాగాలన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలివల బసవయ్య, వెలివల సుబ్రహ్మణ్యం, కమ్మెల శ్రీకాంత్,శీలం శ్రీనివాసరావు, సనకా అనిల్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జనసేన ఐటి విభాగ అధ్యక్షుడు ఆత్మకూరి హరికృష్ణ, వణుకూరి గోపికృష్ణ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

# రావణ వాహనం అందజేత

**కొల్లూరు, జనవరి 16, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన కొల్లూరులో వేంచేసియున్న శ్రీ గంగాపార్వతి సమేత అనంతభోగేశ్వరమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఆలయ అర్చకులు కొమ్మూరు వెంకట శివప్రసాద్ రావణా సుర వాహనాన్ని సోమవారం సమర్పించా రని ఆలయ ఇఒ ఎం అనుపమ తెలిపారు. వాహనం విలువ సుమారు రూ.2.5లక్షలు ఉంటుందని తెలియజేశారు.



# బాపట్ల జిల్లా వార్త



• వేమూరు • రేపల్లె • బాపట్ల • పర్చూరు • అద్దంకి • చీరాల

# ఏపి ఎస్ఆర్ఎంలో సంక్రాంతి సంబరాలు

**--ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు**

**మంగళగిరి, జనవరి 16, ప్రభాతవార్త :** ఏపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి.తెలుగు సంస్కృతీ,సాంప్రదాయాలకు అద్దం పట్టేలా పండుగ ప్రాముఖ్యతను తెలియజేసే క్రీడా పోటీలను నిర్వహించారు.రంగవల్లి,మంటలేని వంట (కుకింగ్ విత్ అవుట్ ఫైర్),టగ్ ఆఫ్ వార్ మరియు ఉట్టికొట్టే పోటీల్లో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.రంగవల్లి పోటీల్లో అలేఖ్య,సువర్ణ,దీప్తి ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా స్వాతి, శిరీష,అంజలి,దివ్య,స్వాతి లేఖలు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు.అదేవిధంగా మంటలేని వంట పోటీల్లో షాలిని,ప్రియాంక, సుధ,ప్రత్యూషలకు ప్రధమ స్థానం లభించగా,అలేఖ్య,కీర్తి,సురేఖ,అన్వేషకు ద్వితీయ స్థానం లభించింది.కప్ స్టాకింగ్ పోటీల్లో వేదశ్రీ,స్వాతిలేఖలు బహుమతులు దక్కించుకున్నారు.యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా,రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్,డైరెక్టర్ అనూప్ సూర్యవంశీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ శివరంగన్,డాక్టర్ అరుంధతి,డాక్టర్ శ్వేత,డాక్టర్ లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహభరితంగా సాగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పందాలు

**బాపట్ల, జనవరి16,ప్రభాతవార్త:** సంక్రాంతి సంభరాలను పురస్కరించుకుని మాజి శాసన మండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అధ్వర్యంలో స్థానిక అలపర్తి ఎన్‌క్లేవ్ రోడ్డులో అదివారం నిర్వహించిన 13వ రాష్ట్ర స్థాయి పోలురాదా ఎద్దుల పందములు అత్యంత ఉత్కంఠభరితంగా, ఉత్సాహభరితంగా సాగాయి .ఎడ్ల పందెములను ప్రారంభించిన అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ ఎడ్ల పందాలు మన సంస్కృతి,స ంప్రధాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఎడ్ల పందెలాలో సుమారు 30జతలు పాల్గొన్నాయి.ఉదయం 10గంటలనుంచి సాయింత్రం వరకు సాగాయి.పోటీలను సీనియర్,జూనియర్ విభాగాలుగా నిర్వహించారు.ఈ పోటీలలో గెలుపొందిన వారికి సీనియర్ విభాగంలో 6,జూనియర్ విభాగంలో 6 బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో లేళ్ళ నరేంద్రనాధ్,రౌతు రామాంజనేయులు,రౌతు శ్రీధర్‌బాబు,అళ్ళ శ్రీనివాసరావు బ్రదర్స్,దూళిపాళ్ళ శ్రీనివాసరావు,జిట్టా మురళీ,తదితరులు పాల్గొన్నారు.



# కోలాహలంగా సంక్రాంతి వేడుకలు

**గంగిరెద్దులు..హరిదాసు కీర్తనలతో గ్రామాల్లో సందడి**

**కొల్లిపర,జనవరి 16 ప్రభాతవార్త:** ప్రతి ఇంటి ముందు గొబ్బెమ్మలు..ముగ్గులు..గంగిరెద్దులు.. హరిదాసు కీర్తనలతో గ్రామాల్లో సందడి నెలకొంది.దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు.సంక్రాంతి పండుగను, కనుమ పండుగను మండల ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు.ప్రతి ఇంటిలో పితృదేవుళ్ళకు స్మరించు కుంటారు.గృహంలో దేవుని చిత్రపటం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొన్ని గ్రామాల్లో కోలాటాలు నిర్వహించారు.ప్రతి ఒక్కరూ పొంగళ్ళు, పిండివంటల తో పండుగను కోలాహలంగా జరుపు కున్నారు. కనుమ పండుగను పురస్కరించుకుని విందు చేసుకున్నారు.





# జవాన్ అంటే రియల్ హీరో...జవాన్ అంటే త్యాగానికి మారుపేరు

**గుంటూరు కల్చరల్, జనవరి 16, ప్రభాతవార్త :** సైనికుడనే పదం వినగానే ఒళ్ళు పులకరిస్తుందని,సైనికుడి యూనిఫారమ్ మనస్సులో ఒకరకమైన ఉద్వేగాన్ని రగిలిస్తుందని జవాన్ అంటే రియల్ హీరో అని,జవాన్ అంటే త్యాగానికి మారుపేరని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సైనిక దినోత్సవ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అమరులైన సైనికయోధులకు నివాళులర్పించారు.కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ అధికారి వి.కె.ఎస్.మల్లేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధరంగంలో, మంచుకొండల్లో,ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపలాకాయడం అవసరమైతే గుండు కెదురు గుండె నిలపటం పవిత్ర కార్యంగా భావిస్తాడు సైనికుడన్నారు.భరతమాత ముద్దుబిడ్డలను గుర్తు చేసుకోవడం శ్రద్ధాంజలి ఘటించడం పౌరసమాజం బాధ్యత అన్నారు.రచయిత బండి జమదగ్ని మాట్లాడుతూ 1948లో చిట్టచివరి బ్రిటిష్ కమాండర్ సర్ ఫ్రాన్సిస్ బచ్చర్ నుండి భారతీయ సైన్యం ,తొలి కమాండర్-ఇన్-చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ కె.ఎం.కరియప్ప బాధ్యతలు స్వీకరించారని అందుకు గుర్తుగా ప్రతి ఏడాది జనవరి 15,16తేదీల్లో ఆర్మీడే ని నిర్వహిస్తారన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వ్యక్తిగత జీవితాలు ఫణంగా పెడుతూ దేశాన్ని అన్నివిధాల కాపాడుతూ ఆపదల్లో ఆదుకునే భారత సైన్యానికి ప్రతిఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలని వారిని గౌరవిస్తూ "ఆర్మీ డే" ని జరుపుకుందామని అన్నారు.కార్యక్రమంలో గాయకుడు మురళీకృష్ణ,రాజశేఖర్,రత్నాజీలు దేశభక్తిగీతాలు ఆలాపించారు.

# యాక్ట్ ఫైబర్ భాగస్వామ్యం

**గుంటూరు విద్య, జనవరి 16, ప్రభాతవార్త :**

భారతదేశం యొక్క అతిపెద్ద ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ ఐఎస్పీలలో ఒకటైన యాక్ట్ ఫైబర్ వినోద సేవను ప్రసారం చేసి,నెట్ ఫ్లిక్స్‌తో కొత్త భాగస్వామ్యాన్ని ప్రకటించినట్లు యాక్ట్ ఫైబర్ నెట్ సంస్థ ప్రతినిధి తెలిపారు.దీనియొక్క వినియోగదారులు ఎంచుకోబడ్డ దీర్ఘకాలిక ప్రణాళికల పైన ఏ అదనపు ఖర్చులేకుండా నెట్ ఫ్లిక్స్ ప్రాధమిక ప్రణాళికకు ప్రాప్యత పొందుతారని తెలిపారు.ప్రయోజనాలు హైలెట్ చేయడానికి టూ గుడ్ టుబి ట్రూ ప్రచారాన్ని యాక్ట్,నెట్ ఫ్లిక్స్ విడుదల చేస్తాయని పేర్కొన్నారు.

# ఐసీఓటివై 2023 అవార్డు

**గుంటూరు విద్య, జనవరి 16, ప్రభాతవార్త :** దేశంలోనే అతివేగంగా పెరుగుతున్న ఫోర్ వీల్స్ వాహనాల తయారీదారుల్లో ఒకటి కియా ఇండియా,ఐసిఓటివై 2023లో గొప్ప విజయాలు సాధించి,ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్ 2023గా కియా కారెన్స్‌కు గౌరవం దక్కించుకుందని కియా ప్రతినిధులు తెలిపారు.ఈవీ 6 గ్రీన్‌కార్ అవార్డు 2023ని ఐసిఓటివై ద్వారా గెలుచుకుందని దీంతో ఒకే సంవత్సరంలో రెండు ఐసీఓటివై అవార్డ్లు గెలుపొందిన మొదటి బ్రాండ్ గా కియా గుర్తింపు పొందిందన్నారు.

# క్రీడాకారుల్లో క్రీడా స్పూర్తి ముఖ్యం, ఓటమి గెలుపు తొలిమెట్టుకు నాంది

**తెనాలి, జనవరి 16, ప్రభాత వార్త :** క్రీడాకారుల్లో క్రీడా స్పూర్తి ముఖ్యమని, ఓటమి గెలుపు తొలిమెట్టుకు నాంది పలుకుతుందని మంగళగిరి బెటాలియన్ ఏఆర్ సిఐ అద్దేపల్లి గణపతి అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో కరుణానిలయం విద్యా సంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజిమన్ స్మారకంగా, కొత్త ఐజాక్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 11నుండి నిర్వహించిన



నాలుగు జిల్లాల స్థాయి షెడ్యూల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఏబీఎం చర్చి అధ్యక్షులు సుద్దపల్లి శరత్ వెంకయ్య అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో గణపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పొన్నెకంటి బెంజిమెన్, కొత్త ఐజాక్ చిత్రపటాలకు కిస్సా బృందంతో కలిసి పిబి విజయ్‌కుమారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభను చాటిన వారికి విద్యా ఉపాధిలో మెరుగైన అవగాహన అవకాశాలుంటాయన్నారు. పేద విద్యార్థుల కోసం విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎందరినో ప్రయోజకులను చేసిన గొప్ప వ్యక్తి బెంజిమెన్స్ స్మారకంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పొన్నకంటి జోసఫ్ రత్నాకర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అందుబాటులో ఉన్న సౌకర్యాలతోనే బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహిస్తున్న కిస్సా బృందం కృషిని ప్రశంసించారు. గ్రామ సర్పంచి డాక్టర్ చొప్పర ప్రీతి మాట్లాడుతూ కరుణా నిలయం విద్యా సంస్థల్లో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్న తస్థాయిలో ఉన్నారని, వారికి ఊతమిచ్చిన పొన్నెకంటి బెంజమెన్, కొత్త ఐజాక్ శ్యామ్ ఇరువురికి ఘన నివాళిగా పోటీలు జరిగాయన్నారు. కిస్సా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్ వినయ్‌కుమార్, పి.వి.రాంబాబు, సంస్థ ఆవిర్భావం, నిర్వహిస్తున్న క్రీడల వివరాలను వెల్లడించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ := గుంటూరు, బాపట్ల పల్నాడు, ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఎంతో రసవత్తరంగా సాగిన పోటీల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి. మెంటబుల్స్ విభాగంలో బాపట్లకు చెందిన రామ్‌చరణ్ వెంకటేష్ విన్నర్స్ కాగా, రన్నర్స్‌గా చిలకలూరిపేటకు చెందిన ఆకాష్, జితేంద్ర, తృతీయ స్థానంలో సాయి చరణ్, కిరణ్, అలాగే మెన్ సింగల్స్‌లో చీరాలకు చెందిన కిరణ్ విన్నర్‌గా, సాయి చరణ్ రన్నర్‌గా నిలిచారు. వెటర్న్ డబుల్స్ విజేతగా కొలకలూరుకు చెందిన ఎం.విజయ్‌కుమార్, పి.వి.రాంబాబు, రన్నర్‌గా శ్రీమన్నారాయణ, గోపికృష్ణ, తృతీయ స్థానంలో విజయవాడకు చెందిన గురు శ్రీనివాసరావు, సోను గెలుపొందారు. అండర్ 15 విభాగంలో విభాగంలో విన్నర్‌గా తెనాలికి చెందిన సంజయ్, అరవింద్, రన్నర్స్‌గా కొలకలూరుకు చెందిన విజ్రాన్, అవినాష్, మూడవ స్థానంలో తెనాలికి చెందిన హర్ష, అనురూప్ నిలిచారు. అలాగే ఉమెన్స్ డబుల్స్‌లో కొలకలూరుకు చెందిన భవ్య, ప్రవణిదాస్, రన్నర్స్‌గా తెనాలికి చెందిన మోహన, అర్షిన్ తృతీయ స్థానంలో గీతిక, సంగీత నిలిచారు. విజేతలకు నగదు, బహుమతులతో పాటు షీల్డ్‌లను బహుకరించారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల బిసి నాయకులు దానబోయిన ప్రసాద్ యాదవ్, నన్నపనేని అనిల్ చౌదరి, వై.జగన్మోహనరావు, సిహెచ్ హనుమంతరావు, ఎన్.మురళీధర్, ప్రేమయ్య, కిస్సా సభ్యులు పీవి రాంబాబు, కె.జార్జి థామస్, కొత్త కిరణ్మయి, ఎస్‌కె కరిముల్లా, కదిరి శ్రీకాంత్, ఎం.రమేష్, సత్యనారాయణ, సిహెచ్ నాగరాజు, కిరణ్ పోటీలను పర్యవేక్షించారు.

# గాంధీ ఆశ్రమ భవన నిర్మాణానికి లక్ష రూపాయలు వితరణ

**తెనాలి, జనవరి 16, ప్రభాత వార్త :** స్థానిక మహాత్మగాంధీ సేవా శాంతి ఆశ్రమ శాశ్వత భవన నిర్మాణానికి దాతలు జమిలీ లక్ష్మీదేవి, కోటా ప్రసాద్‌బాబు లక్ష రూపాయలు వితరణ చెక్కును ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా శాంతిని కోరుకునే వారు ఇలా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయం అని, వారు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఎప్పుడూ తోడు నీడుగా ఉంటాడని అన్నారు. దాతలు మరింత ముందుకు వచ్చి శాంతి సామరస్య పూర్వక సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.



# అన్నా క్యాంటీన్లో గడవర్తి సుబ్బయ్య అన్నదానం

**తెనాలి, జనవరి 16, ప్రభాత వార్త :** స్థానిక గెయిటీ థియేటర్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్లో గడవర్తి హరి శంకర్‌రావు భ్రమరాంబ జ్ఞాపకార్థం వారి కుమారుడు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ పెండ్యాల వెంకట్రావు, మహ్మద్ ఖుద్దూస్, ఈదర పూర్ణచంద్, జి.రమేష్,ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ముట్టడి ప్రకాష్‌కు సత్కారం

**తెనాలి, జనవరి 16, ప్రభాత వార్త :** ఎన్టీఆర్ శత జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ముట్టడి ప్రకాష్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిటి అవధాని, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఈదర వెంకట పూర్ణచంద్, ఎన్.లింగారావు, వి.భీమేశ్వరప్రసాద్, డి.భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు, కె.ఏడుకొండలు, కె.నాగభూషణం, శివప్రసాద్, మోహనరావు, నాగభూషణం, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు ఎస్జీటి ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్

**గుంటూరు విద్య, జనవరి 16, ప్రభాతవార్త :**

సంచాలకులు,పాఠశాల విద్య,ఆంధ్రప్రదేశ్,అమరావతి ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల్లో అవసరమున్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు,వారికి గల అర్హతల మేరకు పాఠశాల్లో అవసరమైన సబ్జెక్టును నింపి,వారికి నెలకు రూ.2500/-టీచర్ అలవెన్సు ఇవ్వబడునని ఉత్తర్వులు జారీచేసి ఉన్నారు.దీని ప్రకారం అక్టోబర్-2022ప్రమోషన్ విల్లింగ్ ఇచ్చిన వారికి ఈనెల 13న కౌన్సిలింగ్ జరిగింది.ఇంకా మిగిలిన 30శాతం డిఎస్సీ కోటా ఖాళీలను కూడా (గణితం,బయాలజీ సైన్స్,ఇంగ్లీషు,సోషల్ స్టడీస్)నింపుటకు తదుపరి సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటి ఉపాధ్యాయులకు 17న సర్టిఫికేట్ పరిశీలన నిర్వహించబడును.గవర్నమెంట్ ఉర్దూ బాయిస్ హైస్కూల్,పాతబస్టాండ ,గుంటూరులో ఉదయం 10.30గంటలకు నిర్వహించబడును.జాబితాలను http://deognt.blogspot.com//నందు ఉంచబడినవి.కనుక సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులను సర్వీసు రిజిస్టర్,ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావలసిందిగా గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శైలజ తెలిపారు.

# ఫ్యామిలీ సర్టిఫికేట్స్ విషయంలో హైకోర్టు ఆదేశాల పట్ల అవగాహన సంస్థ హర్షం

**గుంటూరు కల్చరల్, జనవరి 16, ప్రభాతవార్త :** ఫ్యామిలీ సర్టిఫికేట్స్ పొందే విషయంలో రాష్ట్రప్రభుత్వ అధికారుల అస్తవ్యస్త విధానాల వల్ల అనేకమంది ఇబ్బందులకు గురిఅవుతున్నారని జీవో 145ను సవరించాలంటూ హైకోర్టు కీలక ఆదేశాలివ్వడంతో చాలామందికి ఊరటనిస్తుందని అవగాహన సంస్థ హర్షం ప్రకటిస్తుంది.చట్టబద్ధంగా సంక్రమించాల్సిన హక్కులను అడ్డుకునేందుకు కొందరు కుటుంబ సభ్యుల ఆలోచనలు అమలులో అధికారులు,భాగస్వాములు కాగూడదని జీవో 145కి సవరణ చేయాలని,సవరణ ఉత్తర్వులు తహసీల్దార్లకు పంపాలని ఇచ్చిన హైకోర్టు ఆదేశాలను అధికారులు,ప్రభుత్వం శిరసావహించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.ప్రజలకు ఉపయోగపడే కీలక ఆదేశాలిచ్చిన హైకోర్టు న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణప్రసాద్‌ను అవగాహన సంస్థ అభినందిస్తుంది.

# వైకాపా ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు

**: మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు**

**నాదెండ్ల,జనవరి16,ప్రభాతవార్త:** జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు, మాజీది మంత్రి ప్రత్తిపాటి పిలుపుమేరకు సోమవారం మండలంలోని గణపవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో "ఇదేంఖర్మ మన



రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి అరాచకపాలన గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజలు ప్రభుత వ్ంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు ఇన్‌చార్జి హుస్సేన్, చుండూరి క్రిష్ణ, దామచర్ల కిషోర్, పోతవరం మాధవ, తూబాటి శివకృష్ణ, ముప్పరాజు వెంకటేష్, సుధీర్, అట్లూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీ-నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**చిలకలూరిపేటటౌన్,జనవరి16,ప్రభాతవార్త:** పట్టణంలోని చిలకలూరిపేట వాసవి క్లబ్ 17వ వార్షికోత స్వం పురస్కరిచుకొని క్లబ్ ఆధ్వర్యంలో స్దానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం రాత్రి మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. అనంతరం వాసవిక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షుడిగా వాసవి రీజియన్



ఛైర్మన్ తులాబందుల మణిదీప్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా మున్సిపల్ ఛైర్మన్ హజరయ్యారు. అనంతరం వాసవిక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ వాసవిక్లబ్ సభ్యులు సమాజంలో ఉన్నతమైన కార్యక్రమాలు చేస్తున్నారని ప్రసంసించారు. క్లబ్ సభ్యులకు సహాయసహకారలు అందిస్తానని అన్నారు. వాసవిక్లబ్‌ల నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా శిఖాకొల్లి సుబ్బారావు, ఎస్ రామరావు, కె రాధాకృష్ణమూర్తి, యంగ్‌స్టార్స్‌క్లబ్ తవ్వా సుధాకర్, వందనపు రామకృష్ణ, యం రామ్మోహన్, ప్లాటినం క్లబ్ తవ్వా శ్రీనివాసరావు, టి శ్రీనివాసరావు, మురికిపూడి విజయ్‌కుమార్, గోల్డెన్‌క్లబ్ భవిరిశెట్టి మణికుమార్, ఊటుకురి శ్రీనివాసరావు, దివ్వెల రత్నకుమార్, వనితా డైమండ్‌క్లబ్ బచ్చు ఓంకారదేవి, అర్వపల్లి కుసుమ, మేళ్లచెరువు అరుంధతి నియమించబడ్డారు. కార్యవర్గంచేత జిల్లా గవర్నర్ కజ్జాయం విజయలక్ష్మీ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ముగ్గులపోటీలలో ప్రధమబహుమతి సాధించిన ఎన్ లక్ష్మీ క్రికి మొదటి బహుమతిగా ప్రిస్టేజియస్ గ్యాస్ స్టవ్‌ను బహుకరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పొట్టి హనుమంతరావు, మద్ది అప్పారావు, కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, పొట్టి శ్రీరాములు, మాజేటి వెంకటేశ్వర్లు, అర్వపల్లి సత్యనారాయణ, తవ్వా నాగమల్లేశ్వరరావు, కొత్త కోటేశ వ్రరావు, అరవపల్లి మెహర్‌తేజ, ఆలపాటి రాహుల్, రాచుమల్లు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**తులాబందుల మణిదీప్‌కు సత్కారం..........** వాసవి రీజీయన్ ఛైర్మన్, జిల్లా ఆర్యవైశ్యయువజన సంఘం అధ్యక్షుడు తులాబందుల మణిదీప్‌ను పలువురు పట్టణ ప్రముఖులు సత్కరించారు. తులాబందుల మణిదీప్ జిల్లా ఆర వ్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా నియమించబడ్డ విషయం విదితమే కాగా మణిదీప్‌ను సోమవారం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్, వాసవిక్లబ్ నాయకులు మద్ది వెంకటఅప్పారావు, కె సుబ్రహ్మణ్యం, శివానందం, తులాబందుల సుధాకర్, కె వెంకటరత్నం, పి నాగేశ్వరరావు, జీ వీరయ్య, జి రమేష్, సామా లక్ష్మీనారయణ, మోహర్‌తేజ, రామారావు, టి సుధాకర్, కె కృష్ణ, కె శివన్నారా యణ, జక్కా శ్రీనివాస్, తవ్వా నాగమల్లేశ్వరరావు, ఎన్ లక్ష్మణ్, దామిశెట్టి కిషోర్, ఎన్ రాము, కె వెంకటేశ్వరరావు, తదితరులు అభినందించారు.

# ఘనంగా నిర్వహించిన స్వామివార్ల తెప్పోత్సవం

**యడ్లపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** అంగరంగ వైభవంగా ప్రత్యేక పూలతో అలంకరించి స్వామివార్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పడవలలో జలవిహారం సన్నివేశం పలువురిని అకర్షించింది. మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామం మధ్యలో ఉన్న చెరువులో శ్రీ గంగా పార్వతీ సమేత మల్లిఖార్జునస్వామి వార్లను, మరియు సీతా రామస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఊరే గించారు. అదేవిధంగా జాలాది గ్రామంలో శ్రీ హరిహర దత్తక్షేత్రలోని శ్రీ సీతారామస్వామి



ఉత్సవ విగ్రహాలను గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పడవలలో తెప్పోత్సవ కార్యక్రమం అదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్దానిక గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల నుండి భారీగా తరలివచ్చి స్వామివార్ల జలవిహారాన్ని వీక్షించి తరించారు.

# ఘనంగా గోదాదేవి కళ్యాణం

**యడ్లపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** గోదాదేవి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని సొలస, లింగారావుపాలెం, వంకాయలపాడు గ్రామాలలో గోదాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొలస రంగనాయక స్వామివారి దేవాలయ పూజారి పరుచూరి రామకృష్ణమాచార్యులు వివరిస్తూ భోగిపండుగనాడే శ్రీ గోదారంగనాధుల కళ్యాణము జరుపటం అనవాయితీగా వస్తున్న అచారమని, ధనుర్మాసం నెలరోజులూ వ్రతంలో భాగముగా అమె అనుగ్రహించిన తిరుప్పావైని అనుసంధించి అఖరున కళ్యాణంతో ముగించి శ్రీ



గోదారంగనాధుల కృపకు పాత్రులుకావటం జరుగుతుందన్నారు. ఈ కళ్యాణ మహోత్సవాలలో నూతన దంపతులు, దంపతులు కూర్చొని అమ్మవారి కళ్యాణం నిర్వహించటం జరుగుతున్నదన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్ధప్రసాదాల వితరణ చేయటం జరిగిందన్నారు.

# ఘనంగా సంక్రాంతి వేడుకలు

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ నాయకులు, శ్రీకృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేత కొల్లి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేడుకలకు రొంపిచర్ల, గోగులపాడు తదితర గ్రామాలతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన



నాయకులు కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం అందరికి మంచి చేయాలని, సంతోషాలను తీసుకురావాలని భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

**చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి...**చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబంధించి సమస్యలతో రూపొందించిన ప్రశ్నాపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి బ్రహ్మయ్య, కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్ధన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



పెదకూరపాడు, గురజాల , మాచర్ల , చిలకలూరిపేట , నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి,

# విజేతలకు బహుమతుల ప్రధానం

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక సేవా స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మిట్టపల్లి రమేష్, డాక్టర్ ఎల్.సృజన, డాక్టర్ ఎం.సునీతకుమారి, సుజాత, విజయ, లక్ష్మి, కోదండరామాచార్యులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బహుమతులను మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉషారాణి, చంద్రశేఖర్, కావ్య, ఎం.రమేష్



బాబులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఏడుగురు చిన్నారులు భరతనాట్యం చేసి ఆకట్టుకున్నారు.

# నరసరావుపేటలో వాల్తేరు వీరయ్య సినిమా డైరెక్టర్ బాబీ సందడి

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** ఇటీవల రిలీజ్ అయిన మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా దర్శకులు కొల్లి బాజీ నరసరావుపేటలో సందడి చేశారు. వాల్తేరు వీరయ్య సినిమా ప్రదర్శన జరుగుతున్న థియేటర్‌లో కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు దర్శకుడు బాజీ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని, గొప్పగా విజయవంతం



చేస్తారని మరోసారి రుజురు చేసిందని దర్శకుడు బాజీ తెలిపారు. తొలుత దర్శకుడు బాబీకి ఆయన మిత్రుడు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఆలయాల్లో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

# రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే

**: డాక్టర్ అరవింద్‌బాబు**

**నరసరావుపేట, జనవరి 16 ప్రభాతవార్త :** రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడిపి హయాంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకపోతే న్యాయస్థానం ద్వారా ఆ బిల్లులను తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఇటువంటి పాలన భవిష్యత్తులో ఉండదన్నారు. కొన్ని గ్రామాలలో వాలంటీర్ల ద్వారా టిడిపి కార్యకర్తలను బెదిరిస్తున్నారని అటువంటి వాటికి బెదిరిపోయే పని లేదన్నారు. పార్టీ నాయకులు, అభిమానులకు ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటానన్నారు. కష్టకాలంలో ఐక్యంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ



సహకరించి ముందుకు పోవాలన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికే ప్రాధాన్యతను ఇస్తామన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌లను విమర్శించే అర్హత వైకాపా పార్టీ నాయకులకు లేదన్నారు. ఈ నెల 18వతేదీన నియోజకవర్గంలో ద్విచక్ర వాహన ర్యాలీ జరుగుతుందని, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ అరవింద్‌బాబు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**నకరికల్లు, జనవరి 16 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన అడ్డరోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసులకు అందిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరం మండలం నాగేశ్వరపురం తండాకు చెందిన నానిక నాయక్ ఆటో డ్రైవర్. ఆయన మర్రిచెట్టుపాలెం గ్రామంలో ఉన్న డైరీకి పాలు తీసుకెళ్తుంటాడు. పాలు డైరీలో పోసి తిరిగి గ్రామానికి వెళ్తుండగా వెనుక వైపు నుండి వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీ కొంది. ఆటో పక్కకు పడిపోవడంతో నానిక నాయక్ తీవ్ర గాయాలపాల య్యాడు. ఆయనను చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

**: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**

**క్రోసూరు, జనవరి 16 ప్రభాతవార్త :** పెదకూరపాడు నియోజకవర్గంలో గత మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరులో గృహసారథుల నియామకంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వ పాలనలో పెదకూరపాడు అభివృద్ధికి దూరంగా నిచిలిపోయిందన్నారు. కానీ వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందన్నారు. వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసికట్టుగా ముందుకెళ్ళి వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారం చేపట్టే దిశగా కృషి చేయాలన్నారు. ఈ నెల 20వతేదీలోపు గృహ సారథుల నియామకం పూర్తి చేయాలన్నారు. షేక్. అబ్దుల్ రహీంను క్రోసూరు మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమించినట్టు ప్రకటించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

# సచివాలయ మండల కన్వీనర్‌గా మాగులూరి అనీల్‌కుమార్ ఎంపిక

**పెదకూరపాడు, జనవరి 16 ప్రభాతవార్త :** సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు, వాలంటీర్లు అందరూ నాయకులు, ప్రజలతో సమన్వయంతో కలుపుకొని పని చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. నూతనంగా సచివాలయ మండల కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన మాగులూరు అనీల్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాగులూరి అనీల్ ఎమ్మెల్యే శంకరరావును సత్కరించారు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ అర్హులైన ప్రతివారికి ప్రభుత్వం సంక్షేమం అందేలా చూస్తామని, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రజలతో ప్రభుత్వ అధికారులు మమేకమై పనిచేసేలా బాధ్యత వహిస్తామని అనీల్ అన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**క్రోసూరు, జనవరి 16 ప్రభాతవార్త :**

మండలంలోని హసానాబాద్ గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త, మాజీ ఎంపిటిసి కేసబోయిన వెంకటేశ్వర్లు అల్లుడు బోయిన వెంకటస్వామి అనారోగ్యంతో మృతిచెందిరు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరరావు వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే గ్రామానికి చెందిన మరో వైకాపా కార్యకర్త నందిగామ బుడే సాహెబ్ అనారోగ్యంతో మృతిచెందారు. వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు.

# పెద కంచర్లలో అలరించిన నాటకోత్సవాలు

**వినుకొండ,జనవరి16,ప్రభాతవార్త:** పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్ రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో నాల్గవ వార్షిక నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు బెంగుళూరుకు చెందిన కళాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు తెలిపారు. గ్రామానికి చెందిన ఎన్నారైల సహకారంతో నాలుగేళ్ళ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు



కాకాని సురేంద్రబాబు, రోటరీక్లబ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షులు అలా శ్రీనివాసరావు బీజేపీ కిసాన్ మోర్చా నేత వీరయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. పెట్రోమాక్స్ పంచాయితీ, పక్కింటి మొగుడు, యాది, తదితర ప్రదర్శించిన నాటికలు అలరించాయి.

# బాలయ్య నటన అదరహో...

**పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షులు జీ.వీ**

**వినుకొండ,జనవరి16,ప్రభాతవార్త:** నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమా సినీ అభిమానులకు,నందమూరి ఫ్యాన్స్‌కు గొప్ప విజయంగా నిలిచిపోతుందని బాలయ్యబాబు నటన, డైలాగ్స్



అద్భుతంగా ఉన్నాయని ఆలోచింపజేసే కథాంశం అని పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు అన్నారు. సంకా ంత్రి పండగ సంబరాల్లో భాగంగా అభిమానులతో కలసి కీర్తి థియేటర్‌లో బాలయ్య సినిమా వీరసింహారెడ్డి చూశారు. ఈ సందర్భంగా బాలయ్య అభిమానులు జీ.వీని భారీ పూలమాలలతో సత్కరించారు. ప్రజల ఆలోచనశక్తి పెంచే విధంగా యువతకు మంచి సందేశం ఇచ్చేలా సినిమా బాగుందని జీ.వీ ప్రశంసించారు. ఇటువంటి సినిమాలు బాలయ్య మరిన్ని చేయాలని ఆకాంక్షించారు.

# తెదేపా ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**వినుకొండ,జనవరి16,ప్రభాతవార్త:** తెలుగు సంస్కృతి సాంప్రదాయలకు సంక్రాంతి పండగ ప్రతిక అని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పండగ సంబరాల్లో భాగంగా పట్టణంలోని 32వ వార్డు విష్ణుకుండినగర్ నందు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్‌పి కాలవకట్టపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని మహిళలు చుట్టు పక్కల గ్రామాల మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య



అతిథిగా జీ.వీ హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు జీ.వీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

**ఈపూరు........**మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో నందమూరి తారకరామారావు మెమోరియల్, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేశారు. జిల్లా తెదేపా అధ్యక్షులు జీ.వీ ఆయన సతీమణి ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. మహిళలు, యువతులు చేసిన రంగవల్లులను తిలకించి అభినందనలు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పెద్దన్నకు ఘన సన్మానం

**మాచర్ల, జనవరి 16 ప్రభాతవార్తః** మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన వెల్దుర్తి మండలానికి చెందిన పెద్దన్న (తాడి వెంకటేశ్వర రెడ్డి) ని సోమవారం పట్టణంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మేరాజ్యోత్ హనుమంత్ నాయక్ దుశ్శాలువలతో ఘనంగా



సన్మానించారు. తన ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసీపీ యువజ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు పెద్దన్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, అంజనీనాయక్, లక్ష్మానాయక్, ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సంతకం చేసిన వెళ్లిన బ్రహ్మారెడ్డి

**భారీ బందోబస్తు**

**మాచర్ల, జనవరి 16 ప్రభాతవార్తః** గతేడాది మాచర్ల పట్టణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి కండీషన్ బెయిల్ పొందిన టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డితో పాటు మరికొందరు టీడీపీ నేతలు ఆదివారం ప్రత్యేక బస్సులో మాచర్ల పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సంతకాలు పెట్టి తిరిగి



వెళ్లిపోయారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకోగా వారిని పోలీసులు చెల్లాచెదురు చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా గుంపులుగా సంచరించవద్దని హెచ్చరికలు జారీ చేశారు. బస్సులో నుంచే బ్రహ్మారెడ్డి అభివాదం చేస్తూ వెళ్లిపోయారు.

# వైభవంగా రథోత్సవం

**దుర్గి, జనవరి 16, ప్రభాతవార్త :** దుర్గి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. గత రెండు రోజులుగా జరుగుతున్న తిరునాళ్ళ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేక రథంలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అంతకముందు స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా పలువురు పుణ్య దంపతులు పీటల మీద కూర్చొని వేద పండితుల



మంత్రచ్ఛోరణలతో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంఘీక, పౌరాణిక నాటకాలు, సంగీత విభావరి, కోలాట ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబి డ్యాన్స్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. స్వామివారి రథోత్సవాన్ని గ్రామ పెద్దలతో కలసి కారంపూడి సి.ఐ.జయకుమార్, దుర్గి యస్.ఐ వెంకటరమణలు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# శ్రీమల్లిఖార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు

**యడ్లపాడు, జనవరి 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లి ఖార్జున స్వామివారికి శుక్రవారం 108బిందెలతో ప్రత్యేకాభిషాలు నిర్వహించారు. ధనుర్మాసదీక్ష పూర్తిఅయిన దక్షిణాయనం చివరిరోజు మరియు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించటం జరిగిందని గ్రామానికి చెందిన వంకాయలపాటి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారని, వారికి స్వామివారి ప్రసాదాలందజేయటం జరిగిందన్నారు.

# ప్రభుత్వ పథకాలు అందరికీ అందించే బాధ్యత తీసుకోండి

: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట, జనవరి 16 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత తీసుకోవాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు సూచించారు. అచ్చంపేటలో గృహసారథుల నియామకంపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు మంచి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని సూచించారు. కార్యకర్తలను, ప్రజలను, నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. శింగారెడ్డి రామకృష్ణారెడ్డిని అచ్చంపేట మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. త్వరలో గృహసారథుల నియామకం కూడా జరుగుతుందన్నారు. వాలంటీర్లు సచివాలయ కన్వీనర్లు గృహసారథులు అందరూ ప్రజల కోసం పని చేయాలని కోరారు.



# కలిసిమెలిసి ఉండటమే పండుగల పరమార్థం

**క్రోసూరు, జనవరి 16 ప్రభాతవార్త :** అందరూ కలిసిమెలిసి జీవించాలనేదే తెలుగు పండుగల వెనుక పరమార్థమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు



మండలం గాడెవారిపాలెంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముగ్గుల పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ గ్రామాల్లో మంచి వాతావరణంలో అందరూ కలిసి మెలిసి సంక్రాంతి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో తాను భాగస్వామి కావడం తన అదృష్టమన్నారు. అందరూ కష్టాల్లో కన్నీళ్ళలో సంతోషాల్లో కలిసిమెలిసి జీవించాలని కోరారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి పొందిన నక్కా తిరుపతమ్మను ఎమ్మెల్యే శంకరరావు అభినందించారు.

# పూర్వ విద్యార్థుల సహకారంతో వంట గది నిర్మాణం

**అచ్చంపేట, జనవరి 16 ప్రభాతవార్త :** పాఠశాల విద్యను చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ఋణం తీర్చుకునేందుకు 1998-99 విద్యార్థులు అంతా ఒక్కటిగా కలిసికట్టుగా విరాళాలు సేకరించి రూ.3.5 లక్షలతో వంట గది, విద్యార్థులు భోజనం చేసేందుకు ఫ్లాట్‌ఫాంను నిర్మించి ఆదివారం పాఠశాలకు అప్పగించారు. శ్రీ తుమ్మెపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి దాకా చదువుకున్న 1998-99 పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఉపయోగపడే పని చేయాలని నిర్ణయించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణను కలిశారు. విద్యార్థులు మధ్యాహ్నం పూట భోజనం, వంట చేయడానికి వంటగది, పిల్లలు తినటానికి నీడ లేదని తెలిపారు. పూర్వ విద్యార్థులు కలిసి నిర్ణయించుకొని రూ.3.5 లక్షలతో వంటగది నిర్మించి, భోజనాలు చేసేందుకు ఫ్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.మధుసూదనరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వంట గదిని, ఫ్లాట్‌ఫారంను ప్రారంభించి పాటశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణకు తాళాలు అందజేశారు. పాఠశాలకు మేలు చేయాలనే ఆలోచనతో అందరూ కలిసి నడవడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు అంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ప్రేమ, ఆప్యాయతలతో ఆనందంగా గడిపారు. పాఠశాల



అంతా కలియతిరిగారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ వంటగది, ప్లాట్‌ఫాంపై నీడ కూడా ఉంటే ఎండకు, వర్షాలకు పిల్లలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని చెప్పడంతో అప్పటికప్పుడే పూర్వ విద్యార్థి దంతాల రామలక్ష్మయ్య రూ.లక్ష విరాళం ప్రకటించడంతో మిగిలిన స్నేహితులు కూడా తాము సైతం విరాళం అందిస్తామని ముందుకువచ్చారు. షెడ్డు నిర్మాణం కూడా మేమే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు పాపిరెడ్డి, కోటిలింగం, అప్పారావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మురళి, రాజేష్, చంద్ర, నరసింహారావు, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, హుస్సేన్, బి.మస్తాన్‌బి, శారదా, వెంకయ్య, జానీ, రంగా, శ్రీను, ధనుంజయరావు, జ్యోతి, ప్రసన్న, గాంధీ, అంకమ్మరావు, కిషోర్, కుమార్‌లు పాల్గొన్నారు.

# విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేత

**పెదకూరపాడు, జనవరి 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీకి చెందిన విద్యార్థి గ్రూప్ సెలక్షన్ కోసం ప్రిపేర్ అవుతున్న సందర్భంగా మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు భానుప్రకాష్ ఉపకార వేతనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలకట్టలేనిది ఎవరో దొంగిలించలేనిది ఒక్క చదువేనని ఆ చదువుకునే వారికి, పేద విద్యార్థులకు వీలైనంత విధంగా స్కాలర్‌షిప్‌లిచ్చి సహకరిస్తానని భానుప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అర్తిమళ్ళ రమేష్, ముంతాజ్, రామగోపాలరావు, కృష్ణారావు, మస్తాన్‌షరీఫ్, షబ్బీర్, కొండవీటి ప్రసాద్, రవి రాంబాబు పాల్గొన్నారు.



# పలువురు వైకాపా కార్యకర్తలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరామర్శ

**క్రోసూరు, జనవరి 16 ప్రభాతవార్త :** మండలంలోని క్రోసూరు గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త కోడూరు ప్రేమ్‌చంద్ అనారోగ్యంతో సత్తెనపల్లిలోని గజ్జల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నందు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వైద్యశాలకు వెళ్ళి ప్రేమ్‌చంద్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆరోగ్యంపై వైద్యులను వాకబు చేశారు. ప్రేమ్‌చంద్ త్వరగా కోలుకొని ఆరోగ్యవంతునిగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైకాపా నాయకులు ఉన్నారు. అదే విధంగా మండలంలోని 88 తాళ్ళూరు గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త కటకం జగన్నాధరావు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే శంకరరావు పరామర్శించారు. జగన్నాధం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోవాలని కోరుకున్నారు.



# ఘనంగా మకర జ్యోతి కార్యక్రమం

**అచ్చంపేట, జనవరి 16 ప్రభాతవార్త :** ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అచ్చంపేట గ్రామంలో మకర జ్యోతి కార్యక్రమాన్ని శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ మణికంఠ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో 41 రోజుల పాటు మాల ధరించిన స్వాములు అందరికీ అన్నదానం, జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే శ్రీ పూర్ణపుష్కలా సమేత హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఊరేగింపు అయిన తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అయ్యప్పస్వామి వారికి మహా పడిపూజ కార్యక్రమం, 9 అభిషేకములు నిర్వహించి, 6:45 నిమిషాలకు జ్యోతి దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధరణికోట వాస్తవ్యులు వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వట్టికుంట శేషగిరిరావు విచ్చేశారు. అన్నదాన కార్యక్రమానికి 41 క్వింటాళ్ళ బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగింది. వీరి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార క్రమాన్ని నిర్వహించి తదనంతరం భక్తులందరికీ కూడా తీర్థ ప్రసాద పంపిణీ చేయడం జరిగింది. ఈ ప్రదేశం అంతా కూడా అయ్యప్ప నామ స్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు సూదా సదాశివరావు, అందెల కోటేశ్వరరావు, గంజనబోయిన రామచంద్రరావు, తిమ్మిశెట్టి రాంబాబు, అమ్మన్న, ఆచారి, గడ ం నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# పిజీ విద్యార్థిని శ్రావణికి ల్యాప్‌ట్యాప్ అందజేత

**పెదకూరపాడు, జనవరి 16 ప్రభాతవార్త :** ఉన్నత చదువులు చదువుకునే పేద, మధ్యతరగతి, మెరిట్ విద్యార్థులను ప్రోత్స హించేందుకు నెలకుదుటి వెంకట్రావు చిలకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఎన్వివిఎస్ వరప్రసాద్ (బుజ్జి) ల్యాప్‌ట్యాప్‌ను పంపిణీ చేశారు. పెదకూరపాడుకు చెందిన గోగులపాటి వెంకటేశ్వర్లు కుమార్తె శ్రావణి ఎంబీఏ విద్యను అభ్యసిస్తుండగా సోమవారం గుంటూరులోని వరప్రసాద్ గృహంలో శ్రావణికి ల్యాప్‌ట్యాప్ అందించారు. ఈ సందర్భంగా కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వరప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫణితేజ, కృష్ణతేజలు పాల్గొన్నారు.



# ప్రాచీన కళలకు జీవం పోస్తున్న శ్రీకళానిలయం

--ప్రముఖ కాంట్రాక్టర్ గుదిబండి చిన వెంకటరెడ్డి

**కొల్లిపర, జనవరి 16 ప్రభాతవార్త:** తెలుగువారి సంస్కృతీ,సంప్రదాయాలు అడుగంటి పోతున్న తరుణంలో శ్రీకళానిలయం వాటికి జీవం పోసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ కాంట్రాక్టర్ గుదిబండి చిన వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్లిపర అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని శ్రీకళానిలయం ఆద్వర్యంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మారక కళాప్రాంగణంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైసీపీ రాష్ట్ర నేత గుదిబండి చిన వెంకటరెడ్డి, ఎన్ఆర్ఐ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, ఎఆర్ఆర్ కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీకళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి కార్యక్రమం పర్యవేక్షించారు. తొలుత జరిగిన సభలో ముఖ్యఅతిధిగా హాజరయిన చిన వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతి పరిజ్ఞానం పెరిగాక ప్రాచీన కళలు, ప్రాచీన క్రీడలు అడుగంటి పోతున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటంలో తప్పులేదుగాని పాత సంస్కృతీ సంప్రదాయాలు మరిచి పోరాదన్నారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలను మన భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వటంలో తప్పులేదు గాని సంస్కృతీ సంప్రదాయాలను, బంధుత్వాలను తెలియచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభాకరరెడ్డి మాటా ్లడుతూ సంస్కృతీ సంప్రదాయాలను బ్రతికించి రాబోయే తరాలకు తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏడాది సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చైతన్య కళాభారతి కరీంనగర్ వారిచే నిర్వహించిన చీకటి పువ్వు నాటిక పలువురును ఆకట్టుకుంది. తెనాలి వారిచే తేజస్వి ప్రఖ్య బృందం కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, వివేకా మోడల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులచే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం శ్రీకళానిలయం కమిటీ సభ్యులు రంగ స్థల దర్శకులు సైదారావును, రంగస్థల రేడియో ఆర్టిస్ట్ కంచర్ల జోషప్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అద్యక్షులు జొన్నల అమ్మిరెడ్డి, ఉపాద్యక్షుడు గుదిబండి పెదనాగిరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నవరపు రమేష్, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను చూసేందుకు మండల ప్రజలతో పాటు, దూర ప్రాంతాల కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.





# సంక్రాంతి సంబరాలతో హోరెత్తిన కొత్తపాలెం

-రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దిన మహిళలు-ఉత్సాహాన్ని నింపిన కోడిపందాలు

-కనువిందు చేసిన పశు ప్రదర్శనలు-దాండియా నృత్యాలతో అలరించిన మహిళలు

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:** తెలుగువారి అత్యంత పెద్ద పండుగలలో సంక్రాంతి ఒకటి. సంక్రాంతి పర్వదినం పూర్తిగా పల్లెల్లోని చిన్నా చితకా అందరిలోనూ ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపే పండుగ. సంక్రాంతి నెల ప్రారంభించినప్పటి నుంచి ప్రతి రోజు మహిళలు ఇళ్ళ ముంగిళ్ళలో చలిని కూడా లెక్క చేయకుండా రంగవల్లులు తీర్చిదిద్ది, అందులో వివిధ రకాల రంగులను అద్ది, వాటిలో గొబ్బెమ్మలు పెట్టడం వంటి కార్యక్రమాలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారు. ఈ నెల రోజుల పాటు దేవాలయాల్లో వేకువ జామునుంచే తిరుప్పావై పాశురాలు చదవడం, తిరుప్పావై ప్రవచకులు పాశురాల సారాంశాన్ని, గోదాదేవి మహిమలను, భగవంతుని స్మరించిన విధానాన్ని వివరిస్తారు. ఈ నెల రోజులు అమ్మవారికి కట్టెపొంగలి, చక్కెర పొంగలి, పులిహోర వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకొంటారు. భోగి రోజు వేకువ జామునే తలంటు స్నానాలు ఆచరించడం, భోగి మంటలు వేయడం చేస్తారు. సంక్రాంతి రోజు వివిధ రకాల పిండి వంటలను చేయడం, భుజించడం వంటివి చేయడంతోపాటు వివిధ రకాల పోటీలు నిర్వహించి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. నెల రోజుల పాటు హరిదాసుల సంకీర్తనలు, జంగమదేవరలు, ఘంటం సాహెబులు, గంగిరెద్దుల విన్యాసాలు ఇలా వివిధ రకాల వేషధారణలు ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయి. మండల పరిధిలోని సీతారామపురం గ్రామపరిధిలోని కొత్తపాలెంలో ఇరిగేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి నారాయణరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పెద్ద పెద్ద టెంట్లు వేసి పండుగవాతావరణం ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహించారు. కోడి పందాలు, పశు ప్రదర్శనలు, కోలాటాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాండియా నృత్యాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకొన్నాయి. దాసరినారాయణరావు, రాష్ట్ర మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, అంజుమన్ కమిటి ఛైర్మన్ షేక్ మహ్మద్(మాము), జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ కరీముల్లా, కాపునాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావులు కోడి పందాలు నిర్వహణలోనూ, పశు ప్రదర్శన పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా దాండియా నృత్యాలను ప్రతి ఒక్కరూ కనులారా వీక్షించి ఆనందాన్ని పొందారు. దాసరి నారాయణరావు స్వయంగా పాల్గొని దాండియా నృత్యం చేశారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది.



# సందడిగా సంక్రాంతి సంబరాలు

-భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం -తగ్గని ప్రజాదరణ

-కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన రావి -సంక్రాంతి సంబరాల్లో రావి

**పొన్నూరు, జనవరి 16,ప్రభాతవార్త:**

ఆయన ఎమ్మెల్యే కాదు....ఇటీవల వైకాపా బహిష్కరించిన నేత...అయినా ఎక్కడా కార్యకర్తల్లో....నాయకుల్లో....ప్రజల్లో అభిమానం తగ్గలా...తొమ్మిది సంవత్సరాలు వైకాపా పొన్నూరు సమన్వయకర్తగా పనిచేశారు అంతే....సమన్వయకర్తగా పొన్నూరు నియోజకవర్గంలో ఆయన ఎక్కని, తొక్కని గడపంటూ లేదంటే అతిశయోక్తి కాదు....వైకాపా ఎలాంటి కార్యక్రమం చేపట్టినా.....స్థానికంగా ఉండే నాయకులు, కార్యకర్తల సహాయ సహకారాలతో వారికి వెన్నుదన్నుగా ఉండి పార్టీని బలోపేతం చేశారు అంతే....అయితే కార్యకర్తల్లో, నాయకుల్లో ఆయనంటే వీరాభిమానం....కార్యకర్తకు ఏ చిన్న కష్టం వచ్చినా....నష్టం వచ్చినా...అర్ధరాత్రి అయినా....అపరాత్రి అయినా... నేనున్నాంటూ క్షణాల్లో వాలేవారు....అదే ఆయనను కార్యకర్తల హృదయాల్లో నుంచి తీసేయలేకపోవడానికి కారణం అని పలువురు రాజకీయ వేత్తలు చెప్తున్నారు.... ఆయనెవరో కాదు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ. 2019 ఎన్నికల్లో చివరి క్షణాల్లో సామాజిక సమీకరణాల నేపథ్యంలో రావి వెంకటరమణకు పార్టీ టిక్కెట్ నిరాకరించింది..! అయినప్పటికీ పొన్నూరులో అందరూ ఐకమత్యంతో పనిచేసి టిడిపి కంచుకోటను బద్దలు కొట్టి పొన్నూరులో వైకాపా జెండాను ఎగురవేసి జగన్మోహనరెడ్డికి గిఫ్ట్‌గా ఇచ్చారు. ఆ తర్వాత నుంచి రావి వెంకటరమణ పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో పొన్నూరు నియోజకవర్గంలో దూరంగా ఉంటూ వచ్చారు...! అయితే నియోజకవర్గంలో ఎవరింట్లో అయినా కార్యక్రమాలు జరిగితే పిలవడమే తరువాయి వచ్చేవారు. వారిని ఆశీర్వదించడం...దీవెనలు అందించడం చేసేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎప్పటి నుంచో పార్టీకి సేవలందించిన వారిని కాదని, బయట నుంచి(టిడిపి,జనసేన) వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం వంటివి చేశారనే అభిప్రాయంతో ఇక్కడ ఎప్పటి నుండో పార్టీలో చురుగ్గా ఉన్నటువంటివారు సోషల్ మీడియాలో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం వంటివి చేశారు. దీంతో నియోజకవర్గంలో రావి వర్గం......కిలారి వర్గం అంటూ.....స్థానిక నాయకులు రెండుగా చీలారు. ఈ నేపథ్యంలో పార్టీని చక్కబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం రావి వెంకటరమణ నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. దీంతో పార్టీ అధిష్టానం ఇక్కడ జరిగే పరిస్థితులను పరిశీలించి రావి వెంకటరమణను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయినప్పటికీ ఇక్కడి నాయకుల్లో, కార్యకర్తల్లో మాత్రం జోష్ తగ్గలా! రావి వెంకటరమణ సస్పెండ్ అయిన నాటి నుంచి కార్యకర్తలు, నాయకులు వారి కార్యకలాపాలను మరింత ఎక్కువ చేశారని పలువురు నాయకులు చెప్తున్నారు. ఇటీవల చేబ్రోలు మండలం వడ్లమూడిలో జరిగిన పార్టీ కార్యకర్తల, ముఖ్యనాయకులు సమావేశంలో కూడా రావి వర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా సంక్రాంతి సంబరాల పేరుతో పొన్నూరు మండల పరిధిలోని మన్నవ గ్రామానికి సోమవారం రాత్రి రావి వెంకటరమణ వచ్చారు. రావి వెంకటరమణకు దొప్పలపూడి అడ్డ రోడ్డు నుంచి కనీ వినీ ఎరుగని రీతిలో భారీగా స్వాగతం పలికారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

భారీ మోటర్ బైక్ ర్యాలీతో మన్నవ గ్రామానికి తోడ్కొని వెళ్ళారు. అక్కడ జరిగిన వివిధ కార్యక్రమాల్లో రావి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావి వెంకటరమణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ గ్రామీణుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపే పండుగని చెప్పారు. గ్రామీణ వాతావరణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాబోయే తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించవచ్చన్నారు. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోతున్నారని, వాటిని పరిరక్షించేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తనను అభిమానంతో ఉత్సవాల్లో పాల్గొనేందుకు కారకులైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు రావి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కృష్ణచైతన్య, రేగులగడ్డ వాసు, గేరా సుబ్బయ్య, డక్కుమళ్ళ రవి, షేక్ షఫాయితుల్లా, నన్నపనేని అంకినీడుచౌదరి, షేక్ నాజర్, జంగా రాజేష్, లక్ష్మీకాంత్, మొల్లా కరీమ్, నాగళ్ళ శ్రీనివాసరావు, చింతలపూడి మురళీకృష్ణ, బ్రహ్మయ్య, పఠాన్ బాబూఖాన్, బోయిన శివ నాగరాజు, తజ్ముల్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.



# బహురూపికి బహుమతుల పంట

**గుంటూరు కల్చరల్, జనవరి 16, ప్రభాతవార్త :**

అభినయ నాటక పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పొనుగుపాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో నగరానికి చెందిన శ్రీ సద్గురు కళానిలయం వారు ప్రదర్శించిన బహురూపి నాటికకు పలు బహుమతులు అందుకున్నారు. ఉత్తమ నటుడిగా బి.జయశంకర్, ఉత్తమ రచయితగా శిష్టా చంద్రశేఖర్, ఉత్తమ సంగీతానికి సురభి నాగరాజు, ఎం.నగధరరావు లు ఉత్తమ ఆహార్యానికి పి.కోటేశ్వరరావు, ఉత్తమ జ్యూరి పురస్కారాన్ని సిహెచ్ సత్యనారాయణ లు బహుమతులు అందుకున్నారు.

# తిరుమల తిరుపతి హిందూ ధర్మప్రచార పరిషత్ విశేష గోపూజ

**గుంటూరు కల్చరల్, జనవరి 16, ప్రభాతవార్త :**

స్థానిక సంపత్‌నగర్ రామాలయం ప్రాంగణ వేదికగా పాలకమండలి నిర్వహణలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూప్రచార పరిషత్ ఆధ్వర్యంలోభక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. సువాసినులు, భక్తులు ఆవుదూడలకు పూలమాలలు వేసి పసుపు గంధం



కుంకుమలతో, వస్త్రాలతో సాయి ఆచార్యుల వేద మంత్రాల నడుమ విశేష హారతితో సేవించుకున్నారు. అతిధజగా పాల్గొన వేదపండితులు కే.నాగరాజా శర్మ మాట్లాడుతూ సమస్థ దేవతా స్వరూపం గోవు, ఆ గోమాహాలక్ష్మిని అర్చించడం వలన అనేక దోషాలను నివారించ వచ్చని తెలిపారు. తిరుమల తిరుపతి దేవసా ్థనం జి.అమ్మడు మాట్లాడుతూ పండుగలన్నీ ప్రకృతితో మమేకమైనవని, పశువులు జీవనాధారానికి మూలమని వాటికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ముత్తి శ్రీనివాసరావు, పసుపులేటి శేషుబాబు, దండు వేణుగోపాల్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్ళు, పేదలకు అన్నప్రసాద వితరణ జరిగింది.

# కేంద్రమంత్రికి తప్పిన ప్రమాదం..
# కాన్వాయ్‌లోని పోలీస్ వాహనం బోల్తా

**పాట్నా, జనవరి 16:** కేంద్ర సహాయక మంత్రి అశ్విని కుమార్ చౌబే ఘోర రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఆదివారం రాత్రి బక్సర్ నుంచి పాట్నా వెళుతుండగా ఆయన కాన్వాయ్‌లోని ఓ పోలీస్ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దుమ్రాన్‌లోని మథిలా-నారాయణపూర్ రోడ్డులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బోల్తాకొట్టిన కారు కాలువలో పడడంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. అయిదుగురు పోలీసులతో సహా డ్రైవర్‌కు గాయలవ్వగా, క్షతగాత్రులందరినీ చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీస్ వాహనం ప్రమాదానికి గురైన సమయంలో వెనకాలే కేంద్ర మంత్రి కారు ఉండడం విశేషం. అయితే ఈ ఘటనలో కేంద్ర మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత సంఘటన స్థలానికి చెందిన ఓ విడియోను ఆయన ట్విట్టర్‌లో పంచుకున్నారు. ప్రమాదంలో బోల్తా పడిన ఎస్కార్ట్ వాహనాన్ని మంత్రి తనిఖీ చేయడాన్ని చూడవచ్చు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. 'బక్సర్ నుంచి పాట్నాకు వెళ్లే క్రమంలో కోరన్‌సరాయ్ పోలీసు స్టేషన్‌కు చెందిన వాహనం దుమ్రావ్ మథిలా-నారాయణపూర్ రహదారి వంతెన కాలువలో ప్రమాదానికి గురైంది. శ్రీరాముని దయవల్ల అందరూ క్షేమంగా ఉన్నారు. గాయపడిన పోలీసులు, డ్రైవర్‌ను దుమ్రావ్ సదర్ ఆసుపత్రికి చేర్చారు' అని ట్వీట్ చేశారు. కాగా బిజెపి నేత అశ్విని కుమార్ చౌబే ప్రస్తుతం కేంద్ర పర్యావరణం, అటవీ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ శాఖ సహాయమంత్రిగా కొనసాగుతున్నారు.



## గంగావిలాస్ నౌక పాతదే
### కొత్తగా బార్ ఏర్పాటు?: ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

**రాయ్‌బరేలీ, జనవరి 16:** ప్రపంచంలోనే అతిపెద్ద నదీ పర్యాటక నౌక గంగా విలాస్‌ను ప్రధాని ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, అది కొత్తగా ప్రారంభించింది కాదని, 17 ఏళ్లుగా అది నడుస్తోందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పి) అధ్యక్షుడు అఃలేశ్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం అందులో మద్యం అందుబాటులో ఉండే బార్‌ను కొత్తగా ఏర్పాటు చేసినట్లు తనకు తెలిసిందని ఆయన అన్నారు. దీనిపై బిజెపి నాయకులే స్పష్టత ఇవ్వాలని అఃలేశ్ అన్నారు. పాతవాటిని కొత్తగా ప్రారంభించే సంప్రదాయం బిజెపికి ఉన్నదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రచారం చేసుకోవడం, అబద్ధాలు చెప్పడంలో బిజెపివాళ్లు ఎందో ముందుంటారని అఃలేశ్ అన్నారు. పవిత్రమైన గంగా నదిలో ప్రయాణించే ఆ నౌకలో మద్యం అందించే బార్లు ఉన్నట్లు తాను విన్నానని, ఇప్పటివరకూ గంగానదికి హారతి ఇస్తారని మాత్రమే తనకు తెలుసని, ఇప్పుడు కొత్తగా అందులో బార్ ఏర్పాటు చేసిన విషయంపై బిజెపి నేతలే చెప్పాలని ఆయన అన్నారు. 51 రోజుల ప్రయాణం, రూ.55 లక్షల ఖర్చు 51 రోజులపాటు కొనసాగే గంగా విలాస్ ప్రయాణంలో ఒక్కొక్కరికీ రూ.50 లక్షల నుంచి రూ.55 లక్షల వరకూ ఖర్చవుతుందని అంటున్నారు. వారణాసిలో గంగా హారతితో మొదలై బీహార్‌లోని విక్రమశిల యూనివర్సిటీ, పశ్చిమబెంగాల్‌లోని సుందర్బన్ డెల్టా, అస్సాంలోని కజిరంగా నేషనల్ పార్క్‌సహా పలు ప్రపంచ వారసత్వ ప్రాంతాలను(భారత్, బంగ్లాదేశ్‌లోని ప్రాంతాలు) ఆ నౌకలో వెళ్లే ప్రయాణీకులు చూడొచ్చు. 27 నదుల మీదుగా, 3200 కిలోమీటర్లమేర ఆ నౌక ప్రయాణిస్తుంది. 36మంది పర్యాటకులకు వీలున్న ఆ నౌకలో ప్రయాణించేందుకు 2024 ఏప్రిల్ వరకూ బుకింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి.

## ఉన్నావ్ అత్యాచారం కేసులో నిందితుడు కుల్‌దీప్‌సింగ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు

**న్యూఢిల్లీ, జనవరి 16:** తన కూతురు వివాహానికి హాజరు కావడానికి ఉన్నావ్ కేసులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న కుల్‌దీప్‌సింగ్ సెన్‌గర్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం అనుమతి మంజూరు చేసింది. బిజెపి బహిష్కృత నేత అయిన కుల్‌దీప్‌సింగ్ ఉన్నావ్‌లోని మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు. కుల్‌దీప్‌సింగ్‌కు జస్టిస్ ముక్తా గుప్తా, జస్టిస్ పూనమ్ ఎ. బంబా లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌పై బయట ఉన్న రోజుల్లో ప్రతిరోజూ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలని కుల్‌దీప్‌సింగ్‌ను ధర్మాసనం ఆదేశించింది. లక్నో, గోరఖ్‌పూర్‌లలో తన కూతురి పెళ్లికి సంబంధించిన పనులు, ఏర్పాటు చేయాల్సి ఉందని, తన కుటుంబంలో తానొక్కడినే పురుషుడినని కుల్‌దీప్‌సింగ్ సెన్‌గర్ కోర్టుకు విన్నవించారు. అయితే నిందితుడి కూతురు పెళ్లి నిమిత్తం రెండు మ్యారేజ్ హాళ్లను బుక్ చేసినట్లు నిందితుడి తాజా పరిస్థితిని సిబిఐ నివేదించింది. ఉన్నావ్ రేప్ కేసులో 2019 డిసెంబరు 16న ట్రయిల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సెన్‌గర్ దాఖలు చేసిన విజ్ఞప్తి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. అలాగే ట్రయిల్ కోర్టు తనకు జీవితఖైదు శిక్ష విధిస్తూ చెప్పిన తీర్పును సైతం సవాల్ చేస్తూ అదే నెల 20వ తేదీన అప్పీల్ దాఖలు చేశాడు. ఆ విజ్ఞప్తిలో తనను అన్యాయంగా దోషిగా నిర్ధారించారని సెన్‌గర్ పేర్కొన్నారు. నిందితుడు సెన్‌గర్‌కు ట్రయిల్‌కోర్టు జీవితాంతం జైలు శిక్ష అనుభించేలా తీర్పు చెప్పింది. అలాగే ఒక నెల రోజుల్లో రూ. 25 లక్షల జరిమానా కట్టాలని కూడా తీర్పు చెప్పింది. 2017లో బాధిత మైనర్ బాలికను కుల్‌దీప్‌సింగ్ సెన్‌గర్ కిడ్నాప్ చేసి ఆ తర్వాత ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ కేసు విచారణను ఉన్నావ్ నుంచి ఢిల్లీలోని ఓ కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బదలీ చేశారు.



## బంగాళాఖాతంలో చిక్కుకుపోయిన 600 మంది యాత్రికులు

**కోల్‌కతా, జనవరి 16:** మకర సంక్రాంతి సందర్భంగా పశ్చిమబెంగాల్లోని 24 పరగణాల జిల్లా గంగాసాగర్‌లో పుణ్యస్నానాలకు వెళ్లిన సుమారు 600 మంది భక్తులు బంగాళాఖాతంలో చిక్కుకుపోయారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడ హుగ్లి నది-బంగాళాఖాతంలో సంగమించే చోటుకు వీరు రెండు ఫెర్రీల్లో వెళ్లారు. కానీ సముద్రంలో ఆటు రావడంతో నీరు తగ్గి ఆ రెండు ఫెర్రీలు బురదలో చిక్కుకుపోయాయి. యాత్రికులు రాత్రి మొత్తం సముద్రంలోనే గడపాల్సి వచ్చింది. ఈ ఘటన కాక్‌ద్వీప్ వద్ద చోటు చేసుకొంది. దీంతో వీరిని రక్షించడానికి కోస్టుగార్డ్ సిబ్బంది రంగంలోకి దిగారు. వీరికి సహాయం కోసం హోవర్ క్రాఫ్ట్‌ను కూడా పంపారు. అయితే ఆది వారం ఒక్కరోజు మకర సంక్రాంతి సందర్భంగా గంగాసాగర్‌లో దాదాపు 10 లక్షల మంది భక్తులు స్నానాలు చేశారు.

## కలకత్తా హైకోర్టులో 72 యేళ్ల తర్వాత పరిష్కారమైన పెండింగ్ కేసు

**కోల్‌కతా, జనవరి 16:** స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దాఖలైన ఓ కేసులో కలకత్తా హైకోర్టు 72 ఏళ్ల తర్వాత పరిష్కరించింది. బెర్హామ్‌పోర్ బ్యాంక్ లిక్విడేషన్‌కు సంబంధించి 1951లో దాఖలైన కేసును గత వారమే కలకత్తా హైకోర్టు క్లోజ్ చేసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 1948లో బెర్హామ్‌పోర్ బ్యాంక్ అప్పుల్లో కూరుకుపోయింది. ఖాతాదారులు బ్యాంకులో దాచుకున్న సొమ్మును తిరిగి ఇచ్చేందుకు డబ్బు లేదని చేతులెత్తేసింది. బ్యాంకును మూసివేస్తున్నట్లు యాజమాన్యం కోర్టుకు తెలిపింది. బ్యాంకు ఆస్తులను అమ్మేసి వీలైనమేర అప్పులు తీర్చి క్లోజ్ చేయడానికి అనుమతి కోరుతూ 1948 నవంబర్ 19న కలకత్తా హైకోర్టులో యాజమాన్యం పిటిషన్ వేసింది. దాంతో, అలర్టయిన ఖాతాదారులు తాము డిపాజిట్ చేసిన సొమ్ము ఇప్పించాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు అప్పటి నుంచి వాయిదాల మీద వాయిదాలు పడ్తూ విచారణ జరుగుతూనే ఉంది. గతేడాది నవంబర్‌లోనూ ఈ కేసు విచారణకు రాగా, ఎవరూ హాజరు కాలేదు. దాంతో, న్యాయమూర్తి మరోసారి వాయిదా వేశారు. గత వారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరోసారి విచారణ చేపట్టారు. అయితే, ఈ కేసును 2006లోనే పరిష్కరించినట్లు బ్యాంక్ తరఫు న్యాయవాది..ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఈ విషయం రికార్డుల్లో నమోదు కాకపోవడంతో కేసు అలాగే పెండింగ్ కేసుల్లో ఉన్నట్లు గుర్తించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కేసును క్లోజ్ అయినట్లు ప్రకటించారు.

# నేపాల్‌లో కుప్పకూలిన విమానం
## మంటల్లో 72 మంది సజీవదహనం
## మృతుల్లో ఫోక్ సింగర్
## ప్రధాని మోడీ తీవ్ర విచారం



ప్రమాదంలో మరణించిన జానపద గాయని నీరా చంత్యాల్



విమాన ప్రమాద దృశ్యం

**కఠ్మాండు, జనవరి 16:** మరో పది నిమిషాల్లోనే ల్యాండింగ్ కావాల్సిన విమానం ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. దీంతో మంటలు చెలరేగి విమానంలో ఉన్న 72 మంది సజీవ దహనమయ్యారు. ఎంతో సంతోషంగా విమాన ప్రయాణం చేసి ల్యాండ్ అవుతున్న సమయంలో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదం మృతుల కుటుంబాలను శోకసముద్రంలో నెట్టేసింది. అయితే ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో జానపద గాయని నీరా చంత్యాల్ కూడా ఉన్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి పోఖారాకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందినట్లు నీరా సోదరి హీరా చంత్యాల్ షెర్చన్ ధృవీకరించారు. నీరా ఫేస్‌బుక్‌లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ కూడాచేసింది. ఇంతకుముందు మరొక స్టేటస్‌లో ఆమె రేపు పోఖరాలో సరదాగా గడపాలి అంటూ పోస్టును షేర్ చేసింది. నేపాల్ చాంత్యాల్ యూత్ అసోసియేషన్ సోమవారం పోఖారాలో పురుషుల, మహిళల వాలీబాల్ పోటీలను నిర్వహించాల్సి ఉంది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సంగీత ప్రదర్శనకు నీరా హాజరుకానున్నారు. నేపాల్ చంత్యాల్ యూత్ యూనియన్ కస్కీ కార్యదర్శి నవీన్ ఘర్తి చంత్యాల్ మాట్లాడుతూ విమాన ప్రమాదం నేపథ్యంలో ఈవెంట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విమాన ప్రమాదంలో 68 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. అలాగే నేపాల్ రాజధాని ఖాట్మండు నుంచి ఏటీ ఎయిర్‌లైన్స్ ట్విన్ ఇంజిన్ ఎటిఆర్ విమానంలో బయలుదేరింది. ప్రయాణికుల్లో ఆరుగురు చిన్నారులతో సహా పదిహేను మంది విదేశీయులు ఉన్నారు. విమానంలో 53 మంది నేపాలీలు, ఐదుగురు భారతీయులు, నలుగురు రష్యన్లు, ఇద్దరు కొరియన్లు, ఒక అర్జెంటీనా, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌లకు చెందిన ఒక్కొక్కరు ఉన్నట్లు ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదురుగు భారతీయులను అభిషేక్ కుష్వాహా, బిషాల్ శర్మ, అనిల్ కుమార్ రాజ్‌భర్, సోనూ జైస్వాల్, సంజయ జైస్వాల్‌గా గుర్తించినట్లు యేటి ఎయిర్‌లైన్స్ అధికారి ఒకరు తెలిపారు. పోఖారాలో కొంతమంది భారతీయులతో సహా 72 మంది ప్రయాణికులు, సిబ్బందితో ప్రయాణిస్తున్న విమానం కూలిపోవడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామని అన్నారు. నేపాల్ విమాన ప్రమాదంపై మోడీ విచారం..మృతుల కుటుంబాలకు సంతాపం నేపాల్ విమాన ప్రమాదంపై ప్రధాని నరేంద్రమోడీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఈ విషాదం తనను బాధించిందని, ఎన్నో విలువైన ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు వాళ్లకు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు.



## ఢిల్లీలో 3 రోజులపాటు మరో కోల్డ్‌స్పెల్
### 3 డిగ్రీల దిగువకు ఉష్ణోగ్రతలు

**న్యూఢిల్లీ, జనవరి 16:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు మరో కోల్డ్ స్పెల్ ఏర్పడే అవకాశమున్నదని భారత వాతావరణ శాఖ(ఐఎండి) తెలిపింది. ఈ క్రమంలో 3 డిగ్రీలకంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని తెలిపింది. జనవరి 18 తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశమున్నదని ఐఎండి అధికారి ఒకరు పేర్కొన్నారు. వరుసగా కొన్నిరోజులపాటు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే దానిని కోల్డ్‌స్పెల్‌గా వ్యవహరిస్తారు. ఈ నెల 5 నుంచి 9 వరకు ఏర్పడిన కోల్డ్ స్పెల్ వల్ల ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో వరుసగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన పదేళ్లలో ఇంతటి తక్కువస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇది రెండోసారి. గడిచిన 15 రోజుల్లో 50 గంటలపాటు పొగమంచు కురిసిందని ఐఎండి తెలిపింది. 2019 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో మంచు కురియడం ఇదే తొలిసారి. వాయువ్య ప్రాంతం నుంచి వస్తున్న చలి గాలులతో ఉష్ణోగ్రతలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. రానున్న ఐదు రోజుల్లో ఢిల్లీతోపాటు పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పొగ మంచు కురిసే అవకాశమున్నదని ఐఎండి వెల్లడించింది.

## డెనిప్రోపై లాంగ్ రేంజి బాంబర్ దాడి!



**మాస్కో, జనవరి 16:** ఉక్రెయిన్‌లోని డెనిప్రోలో ఓ అపార్ట్‌మెంట్‌పై జరగిన క్షిపణి దాడి సంచలనం సృష్టిస్తోంది. రష్యా ఈ యుద్ధంలో లాంగ్‌రేంజి బాంబర్లను వినియోగిస్తున్నట్లు ఉక్రెయిన్ గుర్తించింది. డెనిప్రోలోని తొమ్మిది అంతస్తుల అపార్ట్‌మెంట్‌పై దాడికి వీటిని వినియోగించారని ఉక్రెయిన్ సైన్యం ధ్రువీకరించింది. ఈ దాడిలో విమాన వాహక నౌకలను ధ్వంసం చేసే కెహెచ్-22 రకం క్షిపణులను ప్రయోగించినట్లు తెలిపింది. ఇవి అత్యంత శక్తిమంతమైనవి కావడంతో అపార్ట్‌మెంట్ బ్లాక్ మొత్తం కుప్పకూలిపోయింది. ఇప్పటివరకు సుమారు 30 మందికిపైగా ఈ దాడిలో మరణించినట్లు గుర్తించారు. మరో 44 మంది ఆచూకీ గల్లంతైంది. దాదాపు 70 మంది గాయపడ్డారు. ఇప్పటికే ఈ క్షిపణిని ఎక్కడి నుంచి ఎంత ఎత్తులో ప్రయోగించారో తమ రాడార్లు గుర్తించినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. అజోవ్ సముద్రం సమీపం నుంచి టీయూ-22ఎం3 లాంగ్ రేంజి బాంబర్ విమానం నుంచి ఈ క్షిపణిని ప్రయోగించినట్లు గుర్తించామంది. ఇటువంటివి ఐదు క్షిపణులను ఉక్రెయిన్ జనావాసాలపైకి వదిలిందని ఆరోపించింది. ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ, ప్రపంచం నలుమూలల నుంచి సంతాప సందేశాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ అంతా రక్షణ శాఖ, జనరల్ స్టాఫ్ ప్రణాళిక ప్రకారమే జరుగుతోంది అని వ్యాఖ్యానించారు. జూన్‌లో కెహెచ్-22 రకం క్షిపణిని వాడి ఓ షాపింగ్ కాంప్లెక్స్ మొత్తాన్ని రష్యా ధ్వంసం చేసింది. వాస్తవానికి అప్పట్లో సైనిక వాహనాలను రిపేర్ చేసే ఓ డిపోపై దాడికి యత్నించగా, ఆ క్షిపణి షాపింగ్ కాంప్లెక్స్‌ను తాకింది. ఈ ఘటనలో అప్పట్లో 18 మంది మృతి చెందారు.

## కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చుకోండి
### కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జనవరి 16:** న్యాయమూర్తుల నియామకాలపై నిర్ణయం తీసుకునే సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులకు కూడా చోటు కల్పించాలని సూచిస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖ రాశారు. గత కొంత కాలంగా న్యాయమూర్తుల నియామకాల వ్యవహారంలో సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతన్న విషయం విదితమే. కొలీజియం వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పలువురు మంత్రులు బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంల్లో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చుకోవాలంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన రాజ్యాంగ ఎంపిక ప్రక్రియలో హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలని సూచించారు. పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రజలకు తెలియచేయడం అవసరమని కిరణ్ రిజిజు ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియపై అపారదర్శక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పారదర్శకత, ప్రజల జవాబుదారీతనం కోసం 25 యేళ్ల సుప్రీంకోర్టు సృష్టించిన రెండు అంచెల కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చాలని కేంద్రం సూచించింది. మరోవైపు న్యాయస్థానాల్లో కొండల్లా పేరుకుపోయిన కేసులకు కొలీజియం వ్యవస్థే కారణమన్నట్లుగా కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఇటీవల ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ, 2014లో తెచ్చిన జాతీయ న్యాయనియామకాల కమిషన్‌ని కొట్టేయడం ద్వారా ప్రజలెన్నుకున్న పార్లమెంటు సార్వభౌమతాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని విమర్శించడం ఈ వివాదాన్ని మరింత తీవ్ర చేసింది. ఈ విమర్శకుల సుప్రీంకోర్టు స్పందిస్తూ, కొలీజియం నచ్చకపోతే ఇంకో వ్యవస్థను తీసుకురావాలని కేంద్రంపై అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లను కేంద్రం వెనక్కి పంపడంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. అభ్యంతరం వ్యక్తం చేయడానికి ఎలాంటి కారణాలు లేకున్నా సిఫార్సులను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ఈ నేపథ్యంలో కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలంటూ కేంద్రం సిజెఐకి లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఒక్కరోజులో కరోనా కేసులు 114
## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,46,81,154

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి16:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 114కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,80,936కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,47,983మంది కోలుకోగా 2227 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,726కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది.దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,36,935కి చేరగా,79,88,377 మంది వరకు కోలుకున్నారు.1,48,419మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,29,217కి చేరింది.అందులో 67,56,344మంది కోలుకున్నారు.71,570మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,72,512 చేరింది.



## కాలిఫోర్నియాలో వరద భీభత్సం
## ఎమర్జెన్సీ ప్రకటించిన జో బైడెన్

**వాషింగ్టన్, జనవరి16:** కాలిఫోర్నియాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎమర్జెన్సీ ప్రకటించారు. కొన్ని వారాలుగా తుఫాన్‌తో భారీ వర్షాలతో కాలిఫోర్నియా ప్రజలు అల్లాడిపోతున్నారు. కాలిఫోర్నియాలో భారీ విపత్తు చోటు చేసుకున్నదని జో బైడెన్ ప్రకటించారు. ఆ రాష్ట్ర ప్రజలకు అవసరమైన ఆర్థిక, హార్ధిక సాయం అందచేయాలని అధికారులను ఆదేశించారు. తీవ్ర శీతాకాల తుఫాన్ వల్ల పోటెత్తిన వరదల వల్ల విరిగి పడిన మట్టి చరియల్లో, బురదలో చిక్కుకున్న బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. కాలిఫోర్నియాలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో బాధితులకు తాత్కాలిక వసతి కల్పిస్తారు. భారీ చలిగాలులు చుట్టుముడుతున్నాయి. భారీగా కురుస్తున్న వర్షాలతో మట్టి చరియలు విరిగిపడే ముప్పు ఉంది. కాలిఫోర్నియా నుంచి కొలరెడో వరకు పర్వత శ్రేణుల నుంచి భారీగా మంచు కురుస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరం అని జాతీయ వాతావరణ సర్వీస్ హెచ్చరించింది. వరదల వల్ల కాలిఫోర్నియాలో కనీసం 19 మంది మృతి చెందారు. వరద నీరు లోతట్టు ప్రాంతాల్లో ప్రయాణిస్తున్నది. మూడంతస్తుల ఎత్తులో అలలు ఎగసిపడుతున్నాయి. ఈ వరదల వల్ల 34 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు. కాలి ఫోర్నియాలోని సాలినాస్ నది వరదతో పరి వాహక ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్నది. జాత తీయ రహదారులపై వరద నీరు ప్రవహి స్తున్నది. మరో తుఫాన్ పొంది ఉన్న నేపథ్యం లో 24 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

## కొవిడ్ లక్షణాలుంటే 10 రోజుల ఐసోలేషన్
## డబ్ల్యుహెచ్‌ఒ కొత్త మార్గదర్శకాలు

**జెనీవా, జనవరి16:** కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టిందని భావిస్తున్న కొన్ని దేశాలు సంబంధిత ఆంక్షలను పూర్తిగా సడలిస్తున్నాయి. కానీ విస్తృతంగా వ్యాక్సిన్ అందించినప్పటికీ చాలా దేశాల్లో మహమ్మారి ప్రాబల్యం కొనసాగుతూనే ఉంది. ఇలా మరో వేవ్ భయాలు నెలకొన్న వేళ ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక సూచనలు చేసింది. కరోనా ఇన్‌ఫెక్షన్ సోకిన వ్యక్తులకు సంబంధిత నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది.



దీంతోపాటు జనసమూహాల్లో మాస్కు ధరించడం, కొవిడ్ చికిత్స, వైద్య నిర్వహణ విషయంలో సిఫార్సులను అప్‌డేట్ చేసినట్లు తెలిపింది. కొత్త వేరియంట్లు వ్యాప్తి చెందుతోన్న నేపథ్యంలో మాస్కు ధరించడంతో పాటు బూస్టరు డోసు వేసుకోవాలని సూచించింది. కొవిడ్ ఇన్‌ఫెక్షన్ సోకిన బాధితులకు లక్షణాలు కనిపిస్తే అవి మొదలైనప్పటి నుంచి 10 రోజులపాటు ఐసోలేషన్‌లో ఉండాలి. కరోనా బారిన పడ్డ వ్యక్తికి ఒకవేళ యాంటీజెన్ టెస్టులో నెగెటివ్ వస్తే ఐసోలేషన్ నుంచి ముందుగానే బయటకు రావచ్చు.
కొవిడ్ నిర్ధారణ అయి లక్షణాలు లేని వారు మాత్రం అయిదు రోజులు ఐసోలేషన్‌లో ఉండాలి. గతంలో వీరికి ఐసోలేషన్ వ్యవధి పది రోజులుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి చెందుతోన్న నేపథ్యంలో స్థానిక పరిస్థితులతో సంబంధం లేకుండా మాస్కులను విధిగా ధరించాలని డబ్ల్యుహెచ్‌ఒ సిఫార్సు చేసింది. చికిత్స విషయంలో నిర్మాట్రెల్విర్, రిటోనావిర్ వినియోగాన్ని కొనసాగించాలని సూచించింది.

## పాకిస్థాన్‌లో ఆహార సంక్షోభం నేపథ్యంలో
## గోధుమపిండి ట్రక్‌ను బైక్‌లతో ఛేజింగ్!

**ఇస్లామాబాద్, జనవరి16:** దాయాది దేశం పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభం నానాటికి తీవ్రమవుతోంది. ఆకలి తీర్చుకోవడం కోసం అక్కడి ప్రజలు తమ ప్రాణాలు పణంగా పెడుతున్నారు. తాజాగా గోధుమ పిండి సరఫరా చేస్తున్న ట్రక్కును వందలాది మంది బైక్‌లపై ఛేజ్ చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోధుమ పిండి లోడుతో వెళుతున్న ట్రక్కు నుంచి పిండి బ్యాగ్‌ను కొనుగోలు చేసేందుకు ఇద్దరు వ్యక్తులు ట్రక్ వెనుకభాగంలో ఎక్కి ప్రమాదకర రీతిలో ప్రయాణించడం వీడియోలో కనిపిస్తుంది. ఆ వెనుకే వందలాదిమంది బైక్‌లతో ట్రక్‌ను వెంబడిస్తున్న దృశ్యాలను చూడొచ్చు. ఈ వీడియోను సజ్జద్ రజా అనే ప్రొఫెసర్ ట్విటర్‌లో షేర్ చేశారు. ఇదేం బైక్ ర్యాలీ కాదు. ఒక బ్యాగ్ గోధుమపిండి కోసం పాకిస్తాన్ ప్రజల కష్టాలు. ఇప్పటికైనా జమ్మూకాశ్మీర్ ప్రజలు కళ్లు తెరవాలి. పాకిస్తానీ కానందుకు సంతోషిస్తున్నాను. ఇప్పటికీ భవిష్యత్తు గురించి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉంది. పాకిస్తాన్‌తో భవిష్యత్తు ఉందని భావిస్తున్నారా? అని ట్వీట్ చేశారు. కొద్దిరోజుల క్రితం ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, సింధ్, బలూచిస్థాన్ వంటి ప్రాంతాల్లో సబ్సిడీలో లభించే గోధుమ పిండి కోసం ప్రజలు గంటల కొద్దీ వేచి చూస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో భద్రతా బలగాల పర్యవేక్షణలో పిండిని పంపిణీ చేయడం ప్రారంభించారు. ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడ ంతో గత నెలలో పాకిస్తాన్ ద్రవ్యోల్బణం 24.5 శాతానికి చేరుకుంది. మరోవైపు అధిక ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిలువలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి సంస్థలు ఆర్థిక సాయం అందించేందుకు నిరాకరించాయి. దీంతో పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులో పడింది. పాకిస్తాన్‌లో ఎక్కువ మంది ప్రజలు గోధుమ పిండిని ఉపయోగిస్తారు. పాకిస్తాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రకారం రోజుల వ్యవధిలో గోధుమ పిండి ధర 41 శాతం నుంచి 57 శాతానికి పెరిగింది.

# సినిమా డైలాగులు చెప్పినంత మాత్రాన హీరోలు కారు

## ప్రజల్లో నిజమైన స్థానం సంపాదించుకున్న వారే నాయకులు అవుతారు: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి

**అనంతపురం, జనవరి 16 ప్రభాతవార్త బ్యూరో** జనంలోకి వెళ్లి సినిమా డైలాగులు చెప్పి తొడలు కొట్టినంత మాత్రాన హీరోలు కాలేరని ప్రజల్లో



రాతిదూలం పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

నిజమైన స్థానం సంపాదించుకున్న వారే నాయకులు అవుతారని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఏ.నారాయణపురం గ్రామంలో వైసీపీ నేత మధన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన మన ఊరు మన సంక్రాంతి కార్యక్రమానికి బైరెడ్డి సిద్దార్థరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండవ రోజు రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వీటిని వీక్షించేందుకు తరలి వచ్చారు. విజేతలకు బహుమతులు అందించేందుకు బైరెడ్డి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం చాలా ఖర్చుతో కూడున్నదని ప్రజల కోసం అలాగే సంస్కృతి సాంప్రదాయాలు కాపాడటానికి వాటిని నిర్వహిస్తున్న మధన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏ ప్రాంతానికి వెళ్లిన ఈ స్థాయిలో ప్రజాభిమానం రావడానికి సీఎం జగనే కారణమని అభిప్రాయ పడ్డారు. కొంత మంది జనంలోకి వచ్చే సినిమా డైలాగులు చెబుతుంటారని, అలాగే తొడలు కూడా కొడుతుంటారని, అలాంటి వారికి ప్రజల్లో స్థానం ఉండదన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. ఆయనకు ప్రజల అండ ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ అనంతపురం వచ్చిన ప్రజలు ఆదరిస్తుంటారని, వారి అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనన్నారు. మరోవైపు మధన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలకు బైరెడ్డి సిద్దారెడ్డి రాకతో మరింత సందడి తెచ్చిందని అభిప్రాయపడ్డారు. సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకే ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.



# దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళులు

**చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:** సుఖ సంతోషాల నడుమ సంక్రాంతి పండుగను పండుగలానే జరుపుకోవాలి తప్ప పండుగ పేరిట పందేరాలతో జూదాలకు బానిసలు కావద్దని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హితవు పలికారు. ఆదివారం సొంతూరు నారావారిపల్లిలో కుటుంబ సభ్యులతో పాటు నందమూరి కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. సంక్రాంతి సంబరాలను సొంతూరులో జరుపుకునేందుకు పట్టణాలు, నగరాలు, విదేశాలలో వున్నప్పటికీ ప్రతి ఒక్కరూ తప్పనిసరి రావాలన్నారు. సొంతూరుకు రావడాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకుని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మొదట కులదైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపించారు. అక్కడి నుండి చంద్రబాబు తన తల్లి దండ్రులు నారా అమ్మణమ్మ, నారా కర్జూరనాయుడు సమాధుల వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అదేవిధంగా నారావారి ఇంటి ముంగిట గల దివంగత మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో నారా భువనేశ్వరీ, నారా లోకేష్, నారా బ్రాహ్మిణీ, నారా దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ, నందమూరి వసుంధర, కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.



# అడవిలో వేటాడిన వెంకన్న

## - స్వామి తరపున బాణాలు వేసిన అర్చకులు

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుప్రజల తొలిపండుగ సంక్రాంతి పర్వదినం మరుసటిరోజు కనుమపండుగ వేళ అడవిలో వేటకు వెళ్ళిన శ్రీనివాసుడు ఆనాటి ఘటనలు గుర్తుచేస్తూ తిరుమలలో నేటికీ కనుమరోజు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం కనుమపండుగ సందర్భంగా మధ్యాహ్నం 1గంటకు ఆలయం నుంచి నాలుగుకిలోమీటర్ల దూరంలోని పాపవినాశనం ప్రాంతంలో ఉన్న పార్వేటమండపంకు మలయప్పస్వామితిరుచ్చిలో వేంచేశారు. స్వామి వెంటమరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి వేంచేశారు. పార్వేటమండపంలో వేదోక్తంగా పుణ్యాహము, ఆరాధన, నివేదనలు జరిగి హారతులిచ్చారు. ఉభయదార్లకు తాళ్ళపాక వంశస్థులకు, హథీరాంజీమఠం వాళ్ళకు మర్యాదలు జరిగాయి. శ్రీకృష్ణస్వామివారిని సన్నిధి యాదవ పూజచేసిన చోటుకు వేంచేపుచేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు. అనంతరం మలయప్పస్వామి ముందుకు కొంతదూరం పరుగెతిత వారి తరపున అర్చకులు బాణాలు వేసి వెనుకకు మూడుసార్లు రావడంతో వేట ముగిసింది. ఇక్కడ సాంప్రదాయంగా అడవిని తలపించేలా సింహం,పులి, జింక బొమ్మలను అమర్చారు. అక్కడ నుంచి మంగళవాయిద్యాల నడుమ మలయప్పస్వామి తిరుమల ఆలయ మహద్వారం వద్దకు చేరుకుని హథీరాంజీ బెత్తం తీసుకుని సన్నిధిలోకి చేరుకున్నారు. వేడుకగా పార్వేట ఉత్సవం ముగిసింది. ఈ కార్యక్రమంలో జెఇఓ వీరబ్రహ్మాం, ఎస్ఇ 2 జగదీశ్వరరెడ్డి, ఇఇ జగన్మోహన్‌రెడ్డి , డిఇ రవిశంకర్‌రెడ్డి, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, డిప్యూటీ ఇఓ హరీంద్రనాథ్,విజిఓలు గిరిధర్, బాలిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# గోమాతను పూజిస్తే సకలశుభాలు

## - గోపూజలో చైర్మన్ సుబ్బారెడ్డి

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సాంప్రదాయంలో 16వేల దేవతలు కొలువైన గోమాతను పూజిస్తే సకలశుభాలు కలుగుతాయని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. కనుమపండుగ సందర్భంగా సోమవారం ఉదయం తిరుమలలోని గోశాలలో గోపూజలో పాల్గొనిఆవులకు స్వయంగా పసుపు,కుంకుమ రాసి నూతన వస్త్రాలు సమర్పించి పూలమాలవేసి కర్పూర హారతులిచ్చారు. ఇలాగే తిరుపతిలోని ఎస్వీగోసంక్షణశాలలో గోపూజలో టిటిడి ఇఓ ఏవిధర్మారెడ్డి, జెఇఓ సదాభార్గవి, అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై గోపూజలు



**ఇంద్రకీలాద్రి, జనవరి 16, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో ప్రారంభమైన సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ రోజున ఆలయ వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కొండపైన గోశాలలో గోపూజా కార్యక్రమములు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఈవో దర్భముళ్ల భ్రమరాంబ పాల్గొన్నారు. ఆలయంలో నిత్యం ధర్మపదం వేదికపై నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో కె.జాహ్నవి, సుష్మ, అభినయ కార్తీక, భువిక, ఆశ్రిత, దివ్య, తనుశ్రీ'లు కూచిపూడి నృత్యంతో భక్తులను అలరించారు.

- నిత్యన్నదాన విరాళ దాతలు : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిత్యము నిర్వహించే అన్నదాన పథకమునకు విజయవాడకు చెందిన సిహెచ్ రామకృష్ణ (ఐఎఫ్ఎస్) కుటుంబసభ్యులతో కలసి ఆలయ అధికారులకు రూ.1,00,116/-లు విరాళమును అందచేశారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం వేదపండితుల ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటము, ప్రసాదము, శేషవస్త్రము అందచేశారు.

# కనుమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాణప్రతిష్ట

## జగ్గయ్యపేటలో వైభవంగా గ్రామోత్సవం - ఉర్రూతలూగించిన కళా ప్రదర్శనలు !

**జగ్గయ్యపేట, జనవరి 16, ప్రభాతవార్త :**పాడిపంటలను, పశుసంపదను లక్ష్మీ స్వరూపంగా అర్చిస్తూ కనుమ-ప్రబల తీర్థం ఉత్సవం సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో అత్యంత శోభాయమానంగా జరిగింది. వందలాదిమంది భాగస్వామ్యంతో ఉర్రూతలూగించిన ఈఉత్సవంలో ఆబాలగోపాలం పాల్గొన్నారు. తెలుగువారి ఆచార సంప్రదాయాలకు ప్రాణంపోస్తూ ఈసంబరాలు ఆద్యంతం వైభవంగా జరిగాయి. పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో పాతపేటగట్టుపై నాలుగురోడ్ల కూడలిలో సంక్రాంతి పండుగ శోభను ప్రతిబింబిస్తూ పల్లెటూరు వాతావరణంలో భారతీయ సంస్కృతిని ఆవిష్కరిస్తూ పాడిపంటలు-పశుసంపదలను లక్ష్మీస్వరూపంగా అర్చిస్తూ కనుమ పండుగను ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలతెల్లవారుతుండగానే పాతపేటగట్టుకు వందల సంఖ్యలో సంప్రదాయక దుస్తుల అంకరణలతో చేరుకున్న మహిళలు కూడలిలో ఆవుపేడతో కళాపిచల్లి రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను అలంకరించి భోగి, సంక్రాంతికి వీడ్కోలుగా మంటరగిల్చి పసుపు కుంకుమలతో కనుమ పండుగను ఆహ్వానిస్తూ మేళతాళాలు మంగళకర వాయిద్యాల నడుమ కోలాట ప్రదర్శనలతో కనువిందుచేశారు. చెక్కభజన, డప్పులు, కోలాటాలు, గంగిరెద్దుల విన్యాసాలు, కర్రసాము, కోడిపుంజుల ఆటలు, భోగిమంటలు, పంతంగుల పంపిణీ, రంగవల్లులు, ఆడపడుచులు పట్టిపరికిణీలతో చిందులు, పండ్లు పంచుకున్న గృహిణులు, తుదకు కదంబ ప్రసాద వితరణలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎంఎల్‌ఏ శ్రీరాంరాజగోపాల్ (తాతయ్య) చేసిన కర్రసాము ప్రదర్శన యువతను ఉర్రూతలూగించింది. మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, యార్డు ఉపాధ్యక్షులు మానేపల్లి నాగబ్రహ్మం, ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు నూకల బాలకృష్ణ (బాల), మున్సిపల్ మాజీవైస్‌చైర్మన్ నూకల కుమారరాజా, కౌన్సిలర్లు గెల్లా సంధ్యారాణి, నోముల స్వప్న, కంచేటి గీతారాణి, నూకల సాంబశివరావు, సంగెపు బుజ్జిబాబు, ఇర్రి నరసింహారావు, గొట్టె నాగరాజు, పట్టణ ప్రముఖులు శ్రీరాం ధనుంజయ, కొత్తా పురుషోత్తం, శ్రీరాం జయరామ్, చౌడవరపు జగదీష్, నోముల రఘు, పెనుగొండ రాజీవ్, గెల్లా పూర్ణచంద్రరావు, కర్లపాటి కొండ, తుమ్మేపల్లి చిన్నా, పబ్బిశెట్టి బాబ్జి, తాండవ కృష్ణ, కొత్తా సురేష్‌కుమార్, కొంకిమళ్ళ మల్లు, నూకల రంగా, రాయపూడి శ్రీనివాసరావు, కాకరపర్తి సోమయ్య, దోగుపర్తి సురేష్, మహంకాళి జయప్రకాష్, చల్లా సత్యనారాయణ, స్ట్రాంగ్‌మెన్ సాయి, వాసవీక్లబ్, వాసవీ వనితాక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట పాతపేటగట్టు కూడలిలో జరిగిన కనుమ ఉత్సవంలో బాలలకు భోగిపండ్లు, అక్షింతలతో ఆశీర్వదిస్తున్న ఆర్యవైశ్య సంఘం, టిడిపి నాయకులు, మాజీ ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు.

# భూతగాదా-మంత్రాల నేపథ్యంలో భార్యభర్తల దారుణ హత్య

**చింతూరు జనవరి 16 ప్రభాతవార్త** మంత్రగాళ్ళు అనే అనుమానం,భూతాగాదాల నేపథ్యంలో మిడియం లక్ష్మయ్య(56),మిడియం సింగమ్మ(54) అనే ఇద్దరు భార్యభర్తలు సోమవారం తెల్లవారుజామున ధారుణ హత్యకు గురయ్యారు.ఈ ఘటన ఎయస్ఆర్ జిల్లా చింతూరు మండలం స్టాపర్డ్‌పేట అనే కుగ్రామములో జరిగింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి శవ పంచనామా అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేసి హత్య ఘటనపై దర్యప్తు చేపట్టారు.

# యువగళం కోసం 25న తిరుమలకు నారాలోకేష్



**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం జాతీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ, యువనేత నారాలోకేష్ ఈనెల 25వతేదీ బుధవారం తిరుమలకు విచ్చేస్తున్నారు. గురువారం రాత్రికి తిరుమలలోనే బసచేయనున్న ఆయన 26వతేదీ ఉదయం ఇష్టదైవమ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ఆశీస్సులందుకోనున్నారు. 27వతేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా యువగళం పేరుతో చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం కావాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే శక్తిని ప్రసాదించాలని వేడుకోవడానికి వస్తున్నారు. ఈ సందర్భంగా తిరుమల,తిరుపతిలో టిడిపి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టేందుకు సిద్దమవుతున్నారు. 28వతేదీ నుంచి 4వేల కిలోమీటర్లు చేపట్టనున్న పాదయాత్రలో తెలుగుదేశం శ్రేణులు కూడా పాల్గొననున్నాయి. 26,27,28 మూడురోజులు తిరుపతి, తిరుమల,కుప్పం పర్యటనలో ఉండనున్న లోకేష్ రాకముందే ఏర్పాట్లపై మాజీమంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు.చంద్రగిరి ఇన్‌ఛార్జి పులివర్తి నాని, పలువురు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు నిమగ్నమవుతున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో అప్పట్లో ఎన్నికలకు ముందు అప్పటి కాంగ్రెస్ నేత ,దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1,468కిలోమీటర్లు ప్రజాప్రస్థానం పేరుతో చేపట్టగా, ఆ తరువాత వస్తున్నా మీకోసం పేరుతో చంద్రబాబ పాదయాత్ర చేపట్టారు.

## రైతాంగానికి వ్యవసాయం పండుగైనప్పడే

# భారత దేశానికి సంపూర్ణ క్రాంతి

## దేశ, రాష్ట్ర రైతాంగానికి సిఎం కెసిఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణ వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న విప్లవాత్మక ప్రగతి అందించే స్ఫూర్తితో, యావత్ దేశ రైతాంగానికి వ్యవ సాయం పండుగైన నాడే.. భారతదేశానికి సంపూర్ణ క్రాంతి చేకూరుతుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని సిఎం కెసిఆర్ దేశ, రాష్ట్ర రైతాంగానికి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పంట పొలాల నుంచి ధాన్యపు రాశులు ఇండ్లకు చేరుకున్న శుభ సందర్భంలో రైతన్న జరుపుకునే సంబురమే సంక్రాంతి పండుగని, నమ్ముకున్న భూతల్లికి రైతు కృతజ్ఞతలు తెలుపుకునే రోజే సంక్రాంతి పండుగ అని సిఎం అన్నారు.

నేడు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింప చేసేందుకు చేపట్టిన కార్యాచరణతో తెలం గాణ పల్లెలు పచ్చని పంట పొలాలు, ధాన్యపురాశులు, పాడి పశువులు, కమ్మని మట్టి వాసనలతో సంక్రాంతి శోభను సంతరించుకుని వైభవోపేతంగా వెలుగొందుతున్నాయని సిఎం పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి మార్గదర్శనంగా నిలిచిందని సిఎం కెసిఆర్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేదిశగా లక్షలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ఒకేఒక రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. తెలంగాణ అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటి వరకు 2,16,000 కోట్లకుపైగా ప్రభు త్వం ఖర్చు చేసిందనీ సిఎం పేర్కొన్నారు. రైతుల సంక్షేమం పట్ల తెలంగాణ ప్రభు త్వానికున్న నిబద్ధతకు ఇది తార్కాణం అని సిఎం అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విప్లవాత్మక రైతు సంక్షేమ వ్యవసాయ రంగ అభివృద్ధి కార్యాచరణతో నాడు రాష్ట్ర ఆవిర్భావం నాటికి 1 కోటీ 31 లక్షల ఎకరాలు మాత్రమే వున్న సాగు విస్తీర్ణం, నేడు 2 కోట్ల లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు.

ఇది దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పరిణామమని సిఎం తెలిపారు. ఒకనాడు దండుగ అన్న వ్యవ సాయం తెలంగాణలో నేడు పండుగ అయిందని, వ్యవసాయ రంగాన్ని నమ్ముకుంటే జీవి తానికి ధోకా లేదనే విశ్వాసం తెలంగాణ రైతుల జీవితాల్లో తొణికిసలా డుతున్నదని, ఇదే విశ్వాసాన్ని దేశ రైతాం గంలో పాదుకొల్పుతామని సిఎం స్పష్టం చేశారు.

ఈ దిశగా యావత్ భారత ప్రజల సహకారంతో, సమష్టి కృషితో దేశ వ్యవసాయ రంగ నమూనాను సమూలంగా మార్చి గుణాత్మక అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలంతా మకర సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనీ, ప్రతీ ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని సిఎం కెసిఆర్ ఆకాంక్షించారు.

# అన్నప్రసాదం క్యూలైన్లో భక్తులకు సౌకర్యాలు

## - ఎండతగలకుండా ఏర్పాట్లు చేయాలన్న చైర్మన్ సుబ్బారెడ్డి

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు ఎంతో ప్రియంగా, భక్తితో స్వీకరించే అన్నప్రసాదం భవనంలోకి చేరుకునే సమయంలో క్యూలైన్లలో ఎండతగలకుండా ఏర్పాట్లు చేయాలని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. తిరుమలలో సోమావారం మధ్యాహ్నం ఛైర్మన్ సుబ్బారెడ్డి అన్నప్రసాదం భవనాన్ని తనిఖీచేశారు. ఇక్కడ అన్నప్రసాదం కోసం భక్తులు క్యూలైన్లో రావడాన్ని గమనించారు. నాలుగువరుసల క్యూలైన్లలో భక్తులు ఎండకు, వానకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లో ఉన్న భక్తులను పలకరించి సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి తెలుసుకున్నారు. ఇక్కడ భక్తులతోబాటు కలసి ఛైర్మన్ సుబ్బారెడ్డి అన్నప్రసాదం స్వీకరించారు.

# కొబ్బరిబొండాంపై శంఖుచక్రనామాలు

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లాలోని మండపేటకు చెందిన భక్తులు కొబ్బరిబొండాంలపై శ్రీవారి కల్యాణం కార్యక్రమంలో ఉపయోగించేందుకు శంఖు,చక్ర,నామాలుతో చెక్కిన వాటిని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులకు అందజేశారు. సోమవారం మధ్యాహ్నం తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో కోనసీమజిల్లాకు చెందిన రామారెడ్డి, మహాలక్ష్మి దంపతులు భద్రాచలం, ఒంటిమిట్ట, అంతర్వేది, అన్నవరం ఆలయాలకు ప్రత్యేక ఉత్సవాలు, కల్యాణం సందర్భంగా వీటిని అందిస్తూ వస్తున్నారు. ఇక్కడ దంపతులను ఛైర్మన్ సుబ్బారెడ్డి దంపతులు అభినందించారు.



# తెలుగు రాష్ట్రాలకురానున్న మరో రెండు వందే భారత్ రైళ్లు

## సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ విశాఖి-తిరుపతి-విశాఖి మార్గాలలో

**గుంతకల్లు రైల్వే, జనవరి 16 ప్రభాతవార్త** భారతదేశం 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆజాదికా అమృత్ మహోత్సవం సందర భ్భాన్ని పురస్కరించుకుని రైల్వే మంత్రిత్వశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టన వందేభారత్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్థానాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరో రెండుమార్గాలకు విస్త రించే అవకాశం ఉంది. ఇప్పటికే సికింద్రాబాద్- విశాఖ పట్నం- సికింద్రాబాద్‌ల మధ్య తొలి వందే భారత్ హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులు ఆదివారం నుంచి ప్రారంభమైన విషయం విధితమే. రైల్వే బోర్డు అభిజ్ఞ వర్గాల సమాచారం మేరకు.. రాబోయే రోజుల్లోఉభయ తెలుగు రాష్ట్రాల్లోమరో రెండు వందే భారత్ హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైల్లు పట్టాలు ఎక్కనున్నాయి. వీటిలో సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ ప్రధాన రైలు మార్గంలో తిరిగే వందే భారత్ హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగా, మరోకటి విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం ప్రధాన రైలు మార్గంలో తిరగనుంది. సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే భారత్ హై స్పీడ్ ఎక్ స్ప్రెస్ రైలుకు ప్రయాణికుల సౌకర్యార్థం, మార్గమధ్యంలో వరంగల్లు, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్/స్టాంపింగ్ కల్పించనున్నట్లు రైల్వే శాఖ నిర్ణయించినట్లు సమాచారం. అలాగే విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నంల మధ్య తిరిగే మరో వందే భారత్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల సౌకర్యార్థం మార్గం మధ్యలో రాజమండ్రి, విజయవాడ, గుండూరు, ఒంగోలు, నెల్లూరు రైల్వే స్టేషన్లలో హాల్టింగ్/స్టాంపింగ్‌కల్పించనున్నట్లు రైల్వే శాఖ వర్గాలు తెలిపాయి. ఏదిఏమైనా రాబోయే రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో మరో రెండు వందే భారత్ హై స్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలు ఎక్కనున్నాయి.



# భారత్‌లో కొత్త తరహా ఉగ్రవాదానికి పాక్ యత్నాలు

**ప్రముఖ నేతల హత్యకు ఇక్కడి ఉగ్రమూక, నేరగాళ్లతో స్కెచ్**

**ఢిల్లీలో వెలుగుచూసిన యువకుడి హత్య తరహాలో**

**మరికొందరిని చంపేందుకు వ్యూహాలు?.. అప్రమత్తమైన నిఘా వర్గాలు**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** దాయాది దేశం పాకిస్తాన్ ఓవైపు ఆర్థికంగా దివాళ అంచున నిలబడినా భారత్‌పై విద్వేషాలు, ఉగ్రవాద కార్యకలాపాలను మా త్రం వీడడం లేదు. ఇప్పటి వరకు నిర్వహించిన దానికి భిన్నంగా కొత్త తరహా ఉగ్రవాద కార్యకలాపాల విస్తరణకు, ఢిల్లీలో పేరొందిన నాయకులను హత్య చేసేందుకు పాక్ గూఢాచార సంస్థ ఐఎస్ఐతో పాటు దాని అనుబంధ ఉగ్రవాద సంస్థలు రంగంలో దిగినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలో భారత్‌కు చెందిన ఓ మాజీ ఉగ్రవాది, మరో నేరగాడు కలిసి ఓ అమాయకుడిని దారుణంగా చంపి, అతని శరీరాన్ని ముక్కలు చేసి, వారం రోజుల పాటు తాముండే ఇంట్లోనే వుంచి ఆన క వాటిని మురికి కాలువలో పడవేసిన వైనం సాదాసీదాగా జరిగింది కాదని దీని వెనుక పాక్ ఉగ్రవాద సంస్థల హస్తం వుందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. తాము హత్య చేసిన యువకుడిని దారుణం జరిగిన సమయంలో హత్యను వీడియో చిత్రీకరించిన ఇద్దరు నేరగాళ్లు ఈ వీడియోను పాక్‌లోని ఉగ్ర సంస్థకు పంపి ఆ సంస్థ నుం చి రెండు లక్షల రూపాయలు నజరానాగా అందుకున్నారు. తాము తలచుకుంటే ఎవరినైనా హత్య చేయగలమని నిరూపించుకునేందుకు ఇద్దరు నేరగాళ్లు పాక్ ఉగ్రవాదుల కు చెప్పినట్లు, దీని ద్వారా ఢిల్లీలో పేరొందిన నాయకులను హత్య చేసే బాధ్యతలను పాక్‌కు చెందిన లష్కర్ ఏ తోయిబా, ఖలిస్తాన్ ఉగ్రవాద సంస్థలు ఇద్దరు నేరగాళ్లకు అ ప్పగించిందని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఘటన తరువాత నిఘా వర్గాలు పాక్ ఉగ్రవాదుల టార్గెట్‌లో వున్న వారిని అప్రమత్తం చేశాయి.

ఢిల్లీలో గత డిసెంబర్ 15వ తేదీన పార్కులో వున్న ఓ యువకుడిని ఢిల్లీలోనే నివసించే మాజీ ఉగ్రవాది నౌషద్, మరో కరుడుగట్టిన నేరగాడు జగ్జిత్ సింగ్ తమ ఇ ంటికి మద్యం, మాదకద్రవ్యాలు ఇస్తామని నమ్మించి తీసుకువెళ్లి దారుణంగా అంతమొందించారు. ఈ దారుణాన్ని ఇద్దరు నేరగాళ్లు వీడియో తీసి పాక్‌లోని లష్కర్ ఏ తోయినా ఉగ్రవాది సొహైల్‌కు పంపారు. దీని తరువాత ఉగ్రవాది సొహైల్ దుబాయ్‌లో వుంటున్న మరో ఉగ్రవాది ద్వారా నౌషద్, జగ్జిత్ సింగ్‌లకు రెండు లక్షల రూపాయలు అందేలా చేశాడు.

కాగా నౌషద్ గతంలో పలు ఉగ్రవాద కేసుల్లో నిందితుడు. జగ్జిత్‌సింగ్ హత్యతో పాటు పలు ఇతర తీవ్రమైన కేసుల్లో నిందితుడు. వీరిద్దరికి జైల్లో పరిచయం ఏర్పడగా దీని తరువాత ఇద్దరు కలిసి ఢిల్లీలో ఉగ్రవాద కార్యకలాపాలను కొత్త తరహాలో నిర్వహించేందుకు సిద్దపడి పాక్‌లోని లష్కర్ ఏ తోయిబా నాయకుడు సొహైల్‌తో మాట్లాడి ఒప్పందం చేసుకున్నాడు. ఇందులో భాగంగా తాము ఢిల్లీలో ఎవరినైనా ఈజీగా హత్య చేయగలమని నిరూపించుకునేందుకు ఓ అమా యకుడిని మద్యం ఆశచూపి ఇంటికి తీసుకు వచ్చి చంపారు. ఇతన్ని చంపే సమయంలో అరగంట వరకు వున్న వీడియో తీసి, దీనిని సొహైల్‌కు పం పారు. ఈ వీడి యో ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో సంచలనం రేపుతోంది. యువకుడిని హత్య చేసిన త రువాత అతని శరీరాన్ని ముక్కలుగా చేసి ప్లాస్టిక్ సంచుల్లో వుంచి పది రో జుల పాటు ఇంట్లోనే దాచి వుంచారు.

అనంతరం వీటిని మురికి కాలువలో పడవేశారు. వీటిని కూడా నౌషద్, జగ్జిత్ సింగ్‌లు వీడియో తీశారు. నౌషద్, జగ్జిత్ సింగ్ లను అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు మొదట వీరు పాల్పడ్డ హత్య మామూలుదే అయి వుంటుందని భావించినా, విచారణ సమయంలో వెలుగుచూసిన విషయాలు చూ సి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తాము ఈ హత్య పగ, ప్రతీకారం కోసమో...? డబ్బుల కోసమో చేయలేదని, పాక్‌లోని ఉగ్రవాదుల మెప్పుకోసం చేశామని, వారు ఆదేశిస్తే ఢిల్లీలో కొందరు ప్రముఖులను ఇలాగే హత్య చేసేందుకు వ్యూహాలు రెడీ చేస్తున్నామని నౌషద్, జగ్జిత్ సింగ్‌లు పోలీసులకు చెప్పడం సంచలనం రేపింది. ఇదే సమయంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల కొత్త తరహా ఉగ్రవాద కుట్రలు వెలుగు చూశాయి. దీంతో నౌషద్, జగ్జిత్ సింగ్‌లను ఢిల్లీ పోలీసులు మరింత లోతుగా విచారిస్తున్నా రు. వీరి టార్గెట్‌లో వున్న వారిని గుర్తించే పనిలో వున్నారు. ఇదే సమయంలో వీరికి దుబాయ్ నుంచి డబ్బులు పంపిన ఉగ్రవాదిని గుర్తించే పనిలో వున్నారు.

# 9 రాష్ట్రాలపై బిజెపి గురి

≫ ప్రసంగించిన పార్టీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్.. బలహీనమైన బూతులను గుర్తించి, వాటిని బలోపేతం చేయాలని ప్రధాని మోడీ ఆదేశించారని గుర్తు చేశారు. అందుకు సంబంధించి నడ్డా ఇప్పటికే వివరించారని ఆయన పేర్కొన్నారు. రెండురోజులపాటు జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. 2023లో జరిగే 9 రాష్ట్రాల ఎన్నికలతోపాటు 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు కూడా ఈ సమావేశాల్లోనే మెగా ప్రణాళికను సిద్ధం చేస్తారు. పార్టీ నిర్మాణానికి సంబంధించిన అంశాలతోపాటు ఆర్థిక, రాజకీయ అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. జి 20 సదస్సుకు భారత్ నేతృత్వం వహించడంలాంటి అంశాలతోపాటు, మోడీ హయాంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాలు, ప్రపంచమంతా కొవిడ్ మహమ్మారితో ఆందోళన చెందుతున్నవేళ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి ప్రజలకు గుర్తు చేస్తూ ప్రచారం నిర్వహించేలా కార్యకర్తలకు తర్ఫీదున్విడంపైనా కార్యవర్గం చర్చించనున్నది. ప్రతి రాష్ట్రం నుంచి ఈ సమావేశానికి ప్రతినిధులు వస్తుండటంతో దేశంలో స్థూలంగా పార్టీ పరిస్థితిపై ఓ అంచనాకు రానున్నారు. తద్వారా 2024 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావడానికి తీసుకోవాల్సి న చర్యల గురించి చర్చించనున్నారు.

## వచ్చే వారం నుండి మార్కెట్లోకి కొత్త పసుపు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వచ్చే వారం నుండి మార్కెట్‌లోకి కొత్త పసుపు రానుంది. దీంతో అధికారులు వాటి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పసుపు అమ్మకాలను ఈనామ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించనున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు పాత పసుపు వస్తుండగా, కాడా రకం క్వింటాల్ 4,100 రూపాయలు నుండి 7,500 రూపాయల వరకూ ధర పలుకుతోంది. మోడల్ రకం పసుపు క్వింటాలు 5,600 రూపాయల నుండి 6,500 రూపాయల వరకూ, గోళా రకం పసుపు క్వింటాలుకు 4 వల ఉండి 6,500 రూపాయల మధ్య ధర పలుకుతోంది. కొత్త పసుపు మార్కెట్‌క వచ్చే అది మరింత ధర పలికే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా రాష్ట్రంలోని నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, వరంగల్ తదితర జిల్లాల్లో పసుపును రైతులు సాగు చేస్తున్నారు.

## జూలై 1 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి

**సిఎంకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వేతన సవరణ సంఘం(పిఆర్‌సి)ను ఏర్పాటు చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జూలై 1వ తేది నుంచి జీతాలు చెల్లించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ సిఎం కెసిఆర్‌ను కోరారు. ఈమేరకు సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ రాసారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు 42 రోజుల పాటు సకల జనుల సమ్మె చేస్తే ఆ నాటి ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. పార్లమెంటులో బిజెపి మద్దతుతో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది స్వరాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు. స్వరాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కులను కాపాడాల్సి ఉండగా, అడుగడుగునా వారిని మోసంచేస్తున్నారన్నారు. ప్రతినెల 1వ తేదిన జీతాలు తీసుకోవడం ఉద్యోగుల హక్కుగా ఉన్నప్పటికీ, సక్రమంగా జీతాలు చెల్లించకుండా వారి హక్కులను కాలరాస్తున్నారన్నారు. 317 జిఓ అమలు పేరుతో ఉద్యోగుల కుటుంబాలను చిన్నాభిన్నం చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సి న నాలుగు డిలను కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. పిఆర్‌సి విషయంలో మోసం చేస్తున్నారన్నారు. స్వరాష్ట్రంలో సిఆర్ బిస్వాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తొలి పిఆర్‌సి నివేదికను 2018 జూలై 1వ తేదినుంచి అమలు చేయాల్సి నప్పటికీ 21నెలలు అమలు చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టారన్నారు. మీ కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయలకు పెంచిన జీతం అమలు కాకుండా 21 నెలలు నష్టపోయారన్నారు. ఈ యేడాది జూన్ 30వ తేది నాటితో మొదటి పిఆర్‌సి గడువు ముగియబోతుందన్నారు. పిఆర్‌సి కమిషన్ నియమించక పోవడం అన్యాయం, ఉద్యోగులను, ఉపాధ్యాయులను దగా చేయడమే అవు తుందన్నారు. ఈ విషయంలో మీరు అనుసరిస్తున్న వైఖరి ఏ మాత్రం సమ ర్థనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని తక్షణమే పిఆర్‌సి ఏర్పాటు చేయాలన్నారు. పిఆర్‌సిని ఏర్పాటు చేయని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పక్షాల బిజెపి ఉద్యమనిస్తుందన్నారు.

# 19 నుంచి జిల్లాల్లో కంటి వెలుగు శిబిరాలు

**షెడ్యూల్ ప్రకారం ప్రజలు వచ్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలి**

**ప్రతి ఇంటికి కంటి వెలుగు ఆహ్వాన పత్రిక వెళ్లాలి**

**సకాలంలో క్యాంపులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి**

**కలెక్టర్ల విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 18న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఖమ్మం లో లాంఛనంగా ప్రారంభిస్తారని.. ఆ తరువాత 19న అన్ని జిల్లాల్లో నూ కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించనున్నట్టు వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు జిల్లా కలెక్టర్లకు చెప్పారు. 19 నుంచి జిల్లాల్లో ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా.. అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంపై మంత్రి హరీష్ రావు సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్‌ను నిర్వహించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతి పాల్గొన్నారు. జనవరి 19న ఉదయం 9 గంటల నుంచి జిల్లాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని.. ఇలా చాలా సున్నితమైన కార్యక్రమమని.. దీనిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రత కల్పించాలన్నారు. 18న ఖమ్మంలో సీఎం లాంఛనంగా ప్రారంభిస్తుండగా.. 19న జిల్లాలోలన ప్రారంభించాలన్నారు. 19న జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, జడ్పీ ఛైర్మన్లు, జడ్‌పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్, డీఎంహెచ్‌వోలు వాట్సాప్ ద్వారా ప్రతి బృందం సకాలంలో క్యాంపులు ప్రారంభించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాల్లో ఉన్న వైద్య బృందాలు సమీప పట్టణాలు, మండల కేంద్రాల్లో నైట్‌హాల్ట్ చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 8.45 గంటలకే బృందాలు క్యాంపుకు చేరుకో వాలన్నారు. కంటి వెలుగు క్యాంపు నిర్వహణకు సంబంధించిన విషయం ప్రతి ఒక్కరికి తెలిసేలా ప్రతి ఇంటికి కంటివెలుగు ఆహ్వాన పత్రిక వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో వచ్చేలా షెడ్యూల్ చేయాలన్నారు. క్యాంపు నిర్వహణకు అవసరమైన సామాగ్రి, మందులు, కళ్లద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరాలకు వచ్చే ప్రజలకు తప్పనిసరిగా వారి ఆధార్‌కార్డు తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో



కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమానిన నిర్వహిస్తున్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని.. ప్రణాళికా బద్ధంగా ప్రజలు క్యాంపులో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కంటే బృందాల సంఖ్య రెట్టింపు చేసినందున అధికంగా ప్రజలకు కంటి వెలుగు క్యాంపులు అందుబాటులో వచ్చే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేయాలని.. చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్త వహించాలని సీఎస్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## డిమాండ్ బ్యాడ్జీలతో కంటి వెలుగు డ్యూటీలకు

**తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్ణయం**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని రకాల ఏఎన్ఎంలు డిమాండ్ బ్యాడ్జిలతో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో డ్యూటీలకు హాజరు కావాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్ణయించింది. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎంలు, ఈసీఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, వైద్య, విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను యధావిధిగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 నుంచి 21 వరకు జరిగే కంటి వెలుగు వెలుగు కార్యక్రమంలో డిమాండ్ బ్యాడ్జిలతో డ్యూటీలకు హాజరు కావాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియోద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యాద నాయక్ తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగానికి ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నా నేటికీ రెగ్యులరైజ్ కాకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఏఎన్ఎంలు ఏక కాలంలో 36 రకాల రికార్డులను ఆన్‌లైన్‌లో.. ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య, ఆరోగ్య పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని అన్నారు. గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలకు 8, 9, 10 పీఆర్‌సీల ప్రకారం బేసిక్‌పే ఇచ్చారు.. కానీ ప్రస్తుతం తెలంగాణలో మొదటి పీఆర్‌సీ బేసిక్‌పే ఇవ్వకుండా 30 శాతం వేతనాలు పెంచడం వలన ఏఎన్ఎంలు ప్రతి నెలా రూ. 5వేలు నష్టపోతున్నారని యాద నాయక్ ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీరందరినీ వెంటనే ఎటువంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందనను బట్టి జనవరి 22న తదుపరి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్టు తెలిపారు.

## తెలంగాణ పదం లేకుండా ఏర్పాటైన బిఆర్ఎస్

**ఆ పార్టీ పనిపట్టే దిశగా కాంగ్రెస్ : మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** పార్టీలో తెలంగాణ అనే పదం లేకుండా బిఆర్ఎస్ ఏర్పాటు చేసుకున్నారని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు.



సోమ వారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయ కులు హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లా డారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నో ఆటుపోట్లు చూసిన సముద్రం లాంటిదన్నారు. పదవులే పరమావధిగా బిజెపి, టిఆర్ఎస్ నాయకులు పనిచేస్తున్నారన్నారు. సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ లేదని, మీకు పదవులు వచ్చాయంటే సోనియాగాంధీ బిక్షతో వచ్చా యన్నారు. ఈ నెల 20, 21, 22లో ఎఐసిసి ఇన్‌చార్జి తెలంగాణ పర్యటనకు వస్తున్నారని, ఇటీవలం కలవని నేతలతో కూడా సమావేశం అవుతారన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర, పార్టీ బలోపేతం మీద చర్చిస్తారన్నారు. రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారన్నారు. టీచర్ల బదలీలు, ప్రమోషన్లు తప్పుల తడకగా ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సి న ఎన్నికలకు వందల కోట్లు పెట్టి సామాన్యులు ఎన్నికల్లో పాల్గొనకుండా చేస్తున్నారన్నారు. టీచర్ల ఎమ్మెల్సీ లో కూడా అదే కుట్ర చేస్తున్నారన్నారు. ఉపా ధ్యాయ సంఘం నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎన్నికలలో కూడాద మరోసారి వంచించకుండా ఆదరాబాదరాగా ఎన్నికలకుగా వెళ్లారన్నారు. ఇతర శాఖలలో పదోన్నతులు ఇచ్చి ఉపాధ్యాయులకు గతంలో ఇవ్వలేదన్నారు. అనేక సార్లు కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటం వల్లనే ప్రమోషన్లు వచ్చినందుకు సంతోషం కానీ, ఉపాధ్యాయులకు 2005 లోనే ఇప్పుడు ఇచ్చిన అన్ని పదోన్నతులు ఇచ్చామన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఈ ప్రకటన చేశారని, కస్తూరిబా పాఠశాలలో బదలీలు లేవు. రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జిఓ తెచ్చి బదిలీలలో ఉపాధ్యాయులకు న్యాయం చేయలేద న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి డిఏలు ఇస్తే, ఇప్పుడు నాలుగు డిఏలు పెండిం గ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి నెల ఒకటో తేదిన రావాల్సి న జీతాలు సమయానికి రావడం లేదన్నారు.

# 32 రోజుల్లో ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి

- దరఖాస్తుకు 4 రోజులు.. సర్టిఫికెట్ల సమర్పణకు 3 రోజులు
- అధికారుల వెరిఫికేషన్‌కు మరో 3 రోజుల సమయం
- మార్గదర్శకాలను సిద్ధం చేసిన పాఠశాల విద్య

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతుల ప్రక్రియను 32 రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరక్టర్ సిద్ధం చేశారు. అయితే ఏ రోజు నుంచి బదలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభిస్తారనేది ఒకటి, రెండు రోజుల్లో పూర్తి షెడ్యూల్‌ను జారీ చేసే అవకాశం ఉంది. పాఠశాలల్లో క్లియర్ వెకెన్సీ లిస్టును, గ్రేడ్-2 హెడ్మాష్టర్స్ మరియు స్కూల్ అసిస్టెంట్ వెకెన్సీ లిస్టును ఒక రోజు ప్రకటిస్తారు. ఆన్‌లైన్‌లో బదలీల కోసం దరఖాస్తులను స్వీకరించడానికి 4 రోజుల సమయం కేటాయిస్తారు. వాటికి సెంబంధించిన హార్డ్ కాపీలను సమర్పించడానికి 3 రోజుల సమయం ఇవ్వనున్నారు. ఉపాధ్యాయులు సమర్పించిన సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్‌ను 3 రోజుల్లో పూర్తి చేస్తారు. డీఈవో ఆఫీసులో సీనియారిటీ లిస్టుతోపాటు ప్రమోషన్లకు అర్హులైన వారి లిస్టును ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతరాలను ఒక రోజు స్వీకరిస్తారు. వాటిని ఆర్‌జేడీ స్థాయిలో ఒక రోజు పరిశీలించి పరిష్కరిస్తారు. మరొక రోజు ఫైనల్ సీనియారిటీ, ప్రమోషన్ లిస్టును ప్రకటిస్తారు. గ్రేడ్-2 హెడ్మాష్టర్స్ బదలీలకు వెబ్ ఆప్షన్లకు ఒక రోజు సమయం ఇస్తారు. ఒక రోజు బదలీలు చేస్తారు. రెండు రోజులు ఎస్ఏలు బదలీలకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి మరో రెండు రోజులు బదలీలకు అవకా శం ఇస్తారు. ఎస్ఏల బదలీల అనంతరం ఎస్ఏ లుగా పదోన్నతులు పొం దడానికి వెకెన్సీలు లిస్టును ప్రకటిస్తారు. ఎస్‌జీటీ నుంచి ఎస్ఏలుగా పదోన్నతులు పొందేవారి నుంచి దరఖాస్తులు. బదలీలకు అవకావం ఉన్న ఎస్‌జీటీల లిస్టు ఒక రోజు ప్రకటి స్తారు. తరువాత 2 రోజులపాటు బదలీల కోసం దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇలా మొత్తం 32 రోజులోలన ఉపాధ్యా యుల బదలీలు, పదోన్నతులకు సంబంధిం చిన ప్రక్రియను పూర్తి చేయనున్నారు. వీటికి సంబంధించిన షెడ్యూల్ లను ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించనున్నారు.

## 10 లక్షల టన్నుల కంది పప్పుల దిగుమతి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** మార్కెట్‌లో పప్పుల ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 10 లక్షల టన్నుల కంది పప్పును దిగుమతి చేయాలని నిర్ణయించింది. కంది పప్పు దిగుమతికి 2024 మార్చి 31వ తేదీ వరకూ లైసెన్స్ కూడా ఇచ్చింది. దీంతో దేశీయ మార్కెట్‌లో పెరిగిన పప్పుల ధరల నుండి సామాన్యులకు విముక్తి కలగనుంది. దీనికి సంబంధించి కేంద్రం ప్రణాళికను సిద్ధం చేసింది. గత ఏడాది డిసెంబరు నెలలో దాదాపు 2 లక్షల టన్నుల వరకూ కందులను దిగుమతి చేసుకుంది. మన దేశంలో చాలా వరకూ కంది పప్పు తూర్పు ఆఫ్రికా, మయన్మార్ నుండి వస్తుంది. మరోపక్క గత ఏడాది కందిపప్పు దిగుబడి 43.4 లక్షల టన్నులుగా ఉంది. 2022-23 పంటల సంవ్సరంలో అంటే జూలై నుండి జూన్ నెల వరకూ ఉత్పత్తి 38.9 లక్షల టన్నులు వరకూ ఉంటుందని అంచనా. ప్రధానంగా కరువుతో పాటు, పంటకు అనేక రకాల తెగుళ్ల సోకడం, భారీ వర్షాలతో ఈ సారి కందిపప్పు దిగుబడి తగ్గ నుం దని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## రాష్ట్రంలో కరోనా తాజా కేసులు-1

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 14:** రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు బాగా తగ్గాయి. శనివారం సాయంత్రం వరకు ఒక్క రోజు లో ఒక్క పాజిటివ్ కేసు మాత్రమే నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ తెలి పింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 8,41,449 పాజిటివ్ కేసులు నమోద య్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు. రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4,111 వరకు చేరింది. ఒక్క రోజులో 3,527 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 3,83,35,966 మందికి కరోనా పరీక్షలు నిర్వ హించారు. ఇప్పటివరకు కరోనా నుంచి 8,37,293 మంది కోలుకోగా (99.51శాతం) శనివారం ముగ్గురు కోలుకున్నారు. మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 45కు చేరింది. శనివారం నమోదైన కేసుల్లో జిహెచ్‌ఎంసి పరిధిలో ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదైంది.

## 22న ఎఇఇ పోస్టుల భర్తీ పరీక్ష

**హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం: టిఎస్‌పిఎస్‌సి**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వివిధ శాఖల్లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షను ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్స్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లోని 1540 ఏఈఈ పోస్టుల భర్తీ కోసం సెప్టెంబర్ 3న టీఎస్‌పీఎస్‌సీ నోటిఫికేషన్ నంబర్12-2022ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఏఈఈ పరీక్షను ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2.30 గంల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓఎంఆర్ విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులు 45 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రంలోని వెళ్లాల్సి ఉంటుందని కమిషన్ ప్రకటించింది.

## విద్యార్థుల నామినల్ రోల్స్‌ను 19లోపు పంపించాలి

**ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్‌మిట్టల్**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించిన నామినల్ రోల్స్ వివరాలను ఈ నెల 19లోపుగా ఇంటర్ బోర్డుకు పంపించాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక పరీక్షలు మార్చి 15 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకుక సంబంధించి హాల్ టికెట్స్ పేర్లలో తప్పులను.. విద్యార్థి పేరుతో తప్పులను, సెకండ్ లాంగ్వేజ్‌లో మార్పులు, మీడియం మార్పు, గ్రూప్ మార్పు తదితర వాటికి సంబంధించిన మార్పులు ఏమైనా ఉంటే.. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్స్ జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ద్వారా ఇంటర్ బోర్డుకు మెయిల్ ద్వారా పంపించాలని నవీన్ మిత్తల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాలేజీల ప్రిన్సిపాల్స్ నామినల్ రోల్స్‌ను ఈ నెల 19లోగా పంపించాలని.. అదనపు సమయం కేటాయించబడతని ప్రకటనలో స్పష్టం చేశారు.

# సిఎం కెసిఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

- జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా నిర్మాణంలో ఉన్న సచివా లయం వచ్చే నెల 17న ప్రారంభమ వుతుందని లేఖ విడుదల చేశారన్నారు. భవన నిర్మాణంలో కాంగ్రెస్‌కి బలమైన సంబంధం ఉందన్నారు. కూల్చే సమయంలో సిఎంని కలసి అందులో కొత్త భవనాలు ఉన్నాయని, ఒకసారి పునరాలోచన చేయాలని కాంగ్రెస్ కోరిందని, ఎవరి మాట వినకుండా శంకుస్థాపన చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా ఉండాలని ప్రకటించామని అంటున్నారు. జన్మదినం పెద్ద జరుపుకోండి, కానీ సచివాలయం ప్రారంభం ఎందుకు అన్నారు. ఏదైనా అధికారిక భవన నిర్మాణంలో విధివిధానాలు ఉంటా యన్నారు. ఆదరాబాధరగా నిర్మించిన భవనానికి అన్ని రకాల అనుమతులు తీసుకోవాలి. ఇది ప్రైవేటు భావనలకు కూడా వర్తిస్తుందన్నారు. సిఎం అధికారంలోకి వచ్చాక ఏదైనా నా శిలాఫలకం ఉండాలని అనుకుంటున్నారు. అన్ని మతాలను కాంగ్రెస్ గౌరవిస్తుందన్నారు. కానీ ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వం జోతిష్యం మీద ఆధారపడటం సరికాదు అన్నారు. సచివాలయం నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. నిర్మాణం పూర్తయిన తరువాత పర్యావరణ, అగ్నిమాపక, హెచ్‌ఎండిఎ అనుమతులు తీసుకోవాలన్నారు. అనేక సార్లు చెప్పినా వాళ్లకు ఇష్టం ఉన్నదే చేస్తున్నామన్నారు. 17వ తేదిన సిఎం పుట్టినతేది నేపథ్యంలో భవన నివాసానికి యోగ్యం గా ఉందని శాఖలు అనుమతి ఇవ్వాలన్నారు. అలాంటివి ఏమీ లేకుండా ఆక్సుపెన్సీ సర్టిఫికెట్‌లు లేకుండా సచివాలయం ఎలా ప్రారంభిస్తారన్నారు. సిఎం కెసిఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, ప్రజల సొమ్ము ప్రతిపైసా జాగ్రత్తగా ఖర్చు పెట్టే బాధ్యత మీ మీద ఉందన్నారు. సచివాలయంలో ఉన్నవుడైన వస్తువులు ఎక్కడికి పోయాయి, ఎవరికి అమ్మారు అనేది ఇంత వరకు చెప్పలేదన్నారు. ప్రారంభించే తేది మీద పునరాలోచన చేయాలన్నారు.





# బ్యాటింగ్ మెరుపుల వెనుక ఈ ముగ్గురి కృషి

## సపోర్టింగ్ స్టాఫ్‌ను అభిమానులకు పరిచయం చేసిన కోహ్లి

**న్యూఢిల్లీ:** మైదానంలో నిప్పులు చేరిగే బంతులను టీమిండియా బ్యాటర్లు అలవోకగా బౌండరీలు దాటించడం వెనుక సపోర్టింగ్ స్టాఫ్ కృషి చాలా ఉందని విరాట్ కోహ్లి పేర్కొన్నాడు. నిన్న శ్రీలంకతో 3వ వన్డే ముగిసిన తర్వాత బిసిసిఐ టివిలో శుభ్‌మన్ గిల్‌తో కలిసి విరాట్ మాట్లాడాడు. ఈ సందర్భంగా వారిద్దరు భారత జట్టు త్రోడౌన్ నిపుణులైన డి.రాఘవేంద్ర, నువాన్ సెనెవిరత్నే, దయానంద గరానీని అభిమానులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కోహ్లి మాట్లాడుతూ ఈ ముగ్గురు నాకు ప్రతిసారి ప్రపంచస్థాయి శిక్షణను అందిస్తారు.

మరే బౌలర్‌కు సాధ్యం కాని రీతిలో వారు నెట్స్‌లో గంటకు 145, 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి మమ్మల్ని సవాలు చేస్తారు. వారు ఎప్పుడూ మమ్మల్ని ఔట్ చేయడానికి ప్రయత్నిస్తూ మా ప్రతిభను పరీక్షిస్తారు. ఆ సమయంలో అది మాకు కఠినంగా అనిపిస్తుంది. నేను ఇటువంటి ప్రాక్టీస్ లేకుండా క్రికెటర్‌గా కెరీర్ ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ చాలా తేడా ఉందని నిజాయితీగా చెబుతున్నాను. దీనిలో చాలా క్రెడిట్ వీరికే దక్కుతుంది. మీరు వీరి పేర్లు, ముఖాలు గుర్తుపెట్టుకోండి. మా విజయాల వెనుక వీరి శ్రమ ఎప్పుడూ దాగి ఉంటుంది అని వివరించారు. శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ ఈ ముగ్గురు సమష్టిగా 1200 నుంచి 1500 వికెట్లు తీసుకుని ఉంటారు. మ్యాచ్‌లో ఎదురయ్యే అన్ని రకాల పరిస్థితులను తట్టుకునేలా మమ్మల్ని సంసిద్ధులను చేస్తారు అని వెల్లడించాడు.

క్రికెట్‌లో బ్యాటింగ్ సాధనకు ఉపయోగించే పరికరాన్ని సైడ్ ఆర్మ్ అంటారు. ఇది పొడవుగా ఉండే ఒక గరిటె వంటటి పరికరం. దీని ముందు భాగంలో బంతిని అమర్చి ఒక వ్యక్తి వేగంగా విసురుతాడు. బ్యాటర్లు దీని సాయంతో వైవిధ్యమైన బంతులను సాధన చేస్తుంటారు. డి.రాఘవేంద్ర రఘుగా భారత జట్టు అభిమానులకు పరిచయం ఉన్న వ్యక్తి. ఇతడిది ఉత్తర కర్ణాటకలోని కుమత ప్రాంతం. 1990లో క్రికెట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ముంబయి వచ్చాడు. ఆటలో రాణించకపోవడంతో తిరిగి బెంగళూరు వెళిపోయాడు. అక్కడ నేషనల్ క్రికెట్ అకాడమీలో కోచ్‌లు, ఆటగాళ్లకు సహాయకుడిగాపనిచేశాడు. రఘు సైడ్‌ఆర్మ్‌త్రోలు బ్యాటర్లను విపరీతంగా ఆకట్టుకొన్నాయి. సచిన్ , ధోని వంటివారు తమ ట్రైనింగ్ సెషన్లకు రఘును తీసుకెళ్లడానికి ఇష్టపడేవారు. ఇక తన బ్యాటింగ్‌పై రఘు ప్రభావాన్ని కోహ్లి తాజాగా వివరించాడు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిడ్నాపూర్ జిల్లాలోని ఓ గ్రామం నుంచి దయానంద వచ్చాడు. కోల్‌కతా సివిక్ పోలీస్ వాలంటీర్‌గా పనిచేశాడు. ఇతడు మీడియం పేస్ బౌలర్. ఆ తర్వాత త్రోడౌన్ కోర్సు పూర్తి చేశాడు. అనంతరం ఆంధ్రా రంజీ టీమ్‌తో కలిసి పనిచేశాడు. 2020లో పంజాబ్ జట్టు త్రోడౌన్ నిపుణుడిగా కెరీర్‌ను ప్రారంభించాడు. రఘుకు కొవిడ్ పాజిటివ్ రావడంతో తొలిసారి టీమిండియా వెంట ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాడు. ఆనటటి నుంచి జట్టుతో కొనసాగుతున్నాడు. 42 ఏళ్ల నువాన్ 2018కు ముందు దాదాపు పదేళ్లపాటు శ్రీలంక జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. 2018లో పాకిస్తాన్ లెఫ్టార్మ్ సీమరైన మహమ్మద్ అమీర్, జునైద్ ఖాన్‌లను ఎదుర్కొనేందుకు భారత్ జట్టు నువాన్ త్రోడౌన్ సేవలను కోరింది. నాటి నుంచి అతడు జట్టుతోనే కొనసాగుతున్నాడు.

ఆట

# వచ్చే యేడాది కూడా లేనట్లే?

### పంత్ హెల్త్ విషయంలో షాకింగ్ అప్‌డేట్!



**ముంబయి:** కొత్త యేడాదికి ఇంటికెళుతూ ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఆరోగ్యం గురించి షాకింగ్ వార్త తెలిసింది. ఈ ఏడాది ఐపిఎల్‌లో అతను ఆడటం లేదని ఇప్పటికే సౌరవ్‌గంగూలీ వెల్లడించాడు. అయితే తాజాగా ఇప్పుడు అందుతున్న సమాచారం ప్రకారం పంత్ కేవలం ఈ ఐపిఎల్ మాత్రమే కాదు. వన్డే వరల్డ్ కప్ కూడా మిస్ అవుతాడట. వచ్చే యేడాదిలో జరిగే టీ20 వరల్డ్ కప్ కూడా అతను ఆడబోడని తెలుస్తోంది. పంత్ కనీసం 18 నెలల పాటు క్రికెట్‌కు దూరం అవుతాడని కొందరు నిపుణులు చెపుతున్నారు. దీంతో అతను వచ్చే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ, ఐపిఎల్ మాత్రమే కాకుండా వన్డే వరల్డ్ ప్ కూడా ఆడలేడని తెలుస్తోంది. అంతేకాదు ఆ తర్వాత జరిగే సిరీసుల్లో కూడా పంత్ ఆడలేడు. వచ్చే ఏడాది జూన్ నెలలో జరిగే టి20 వరల్డ్ కప్‌లో కూడా పంత్ ఆడటం అనుమానమే. టెస్టుల్లో భారత్‌కు పంత్ చాలా కీలకమైన ఆటగాడు. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరాలంటే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఖచ్చితంగా నెగ్గాలి. ఈ సిరీస్‌లో పంత్ లేని లోటు ఖచ్చితంగా కనిపిస్తుందని మాజీలు అంటున్నారు. పంత్ వికెట్ కీపర్ కాబట్టి అతను చేసే ప్రతి పనీ మోకాళ్లపైనే భారం చూపుతుంది. వికెట్ల వెనుక కూర్చోవాలన్నా పక్కలకు చటుక్కున దూకాలన్నా, మోకాళ్లు పర్‌ఫెక్ట్‌గా ఉండటం అవసరం. వాటికే శస్త్రచికిత్స జరగడం వల్ల తను కోలుకోవడానికి కొంచెం టైం పడుతుంది. అందుకని అతన్ని తొందరపెట్టడం కూడా కరెక్ట్ కాదు. కాబట్టి పంత్ కోలుకోవడానికి చాలా టైం పడుతుంది అని బిసిసిఐ వర్గాలు అంటున్నాయి. మరి పంత్ మళ్లీ జట్టుతో ఎప్పుడు కలుస్తాడో చూడాలి. పంత్ క్రికెట్‌కు దూరం అవడంతో ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మరో కొత్త కెప్టెన్ వేటలో పడిన సంగతి తెలిసిందే. కొత్త ఏడాదిలో తల్లికి సర్‌ప్రైజ్ ఇద్దామని వెళుతుండగా రూర్కీ సమీపంలో పంత్ కారుకు యాక్సిడెంట్‌అయిన సంగతి తెలిసిందే. స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో అతనికిప్రాథమిక చికిత్స అందించిన అనంతరం డెహ్రాడూన్‌లోని మ్యాక్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పంత్ కొంత కోలుకున్న తర్వాత అతన్ని ముంబైలోని అంబానీ ఆసుపత్రికి బిసిసిఐ తీసుకొచ్చింది. ఈ ఆసుపత్రిలోనే పంత్‌కు పలు శస్త్రచికిత్సలు జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అతని మోకాళ్లకు రెండు ఆపరేషన్లు చేసినట్లు సమాచారం.



# స్టార్ క్రికెటర్ల కుమార్తెలపై వ్యాఖ్యలు చేసిన గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ కుమార్తె జీవా, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి కుమార్తె వామికపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జీవా, వామికలపై సోషల్ మీడియాలో దారుణ రీతిలో వ్యాఖ్యలు చేయడాన్ని ఢిల్లీ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ పోలీసులకు నోటీసులు పంపింది. దీనిపై ఢిల్లీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్వాతి మలివాల్ స్పందించారు. తమ నోటీసుల తర్వాత ఢిల్లీ పోలీసులు ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని వెల్లడించారు. అతి త్వరలోనే నిందితులను అరెస్ట్ చేసి, జైలుకు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఎఫ్ఐఆర్ కాపీని కూడా ట్వీట్ చేశారు.

# హైదరాబాద్ చేరుకున్న న్యూజిలాండ్ క్రికెటర్లు




**ముంబయి:** టీమిండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో తొలి వన్డే జరగనుంది. మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. ఆన్‌లైన్‌లో టికెట్స్ కొనుగోలు చేసిన వారు ఎల్‌బి స్టేడియం లేదా గచ్చిబౌలి స్టేడియంలలో ఫిజికల్ టికెట్లను తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు తొలి వన్డే కోసం న్యూజిలాండ్ జట్టు హైదరాబాద్‌కు చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన కివీస్ జట్టుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎస్కార్ట్ మధ్య ఎయిర్‌పోర్టు నుంచి హోటల్‌కు కివీస్ ప్లేయర్లు చేరుకున్నారు. ఈ సాయంత్రం 4 గంటల నుంచి ఉప్పల్ స్టేడియంలో న్యూజిలాండ్ జట్టు ప్రాక్టీస్ చేయనుంది. టీమిండియా ఆటగాళ్లు కాసేపట్లో హైదరాబాద్ చేరుకోనున్నారు.



# ఉప్పల్, వైజాగ్ స్టేడియంలలో త్వరలో అంతర్జాతీయ మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల క్రికెట్ ప్రేమికులకు ఇక పండగే. హైదరాబాద్, విశాఖపట్నం వేదికలుగా త్వరలో అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనున్నాయి. గతేడాది ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగ్గా, రెండింటిలోనూ భారత్ జయకేతనం ఎగరేసింది. ఇప్పుడు మరోసారి మన దగ్గర అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగనుండటంతో క్రికెట్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే మ్యాచ్ హైదరాబాద్‌లోనే జరగనుంది. ఈ నెల 18న ఉప్పల్ మైదానంలో ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తారు. దీనికిగాను ఇప్పటికే రెండు జట్లు హైదరాబాద్ చేరుకున్నారు. న్యూజిలాండ్‌తో వన్డే, టి20 సిరీస్‌లు ముగిసిన అనంతరం టీమిండియా స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టులు ఆడనుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్ జరుగు తుంది. ఈ సిరీస్‌లోని రెండో వన్డేకు వైజాగ్ ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 19న ఈ మ్యాచ్ నిర్వహిస్తారు. గతేడాది భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు టి20ల సిరీస్ జరగ్గా మూడో టి20కి విశాఖ ఆతిథ్యం ఇచ్చింది. అప్పటికే ఈ సిరీస్‌లో భారత్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి డీలాపడిన సమయంలో విశాఖలో విజయగర్జన చేసింది. 48 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసి సత్తా చాటింది. ఇంకో మ్యాచ్ విషయానికొస్తే మూడు టి20ల సిరీస్‌లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య గతేడాది సెప్టెంబర్ 25న మూడో టి20 జరిగింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 16:** రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి ట్విన్స్ కంపెనీల వంటి దిగ్గజ షేర్లు క్షీణించడంతో దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిసాయి. ఉదయం సానుకూలంగానే ట్రేడింగ్ ప్రారంభించినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరిగింది. చివరికి సెన్సెక్స్ 168.21 పాయింట్లు క్షీణించి 60,092.97 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 61.75 పాయింట్లు పెరిగి 17,894.85 పాయింట్ల వద్దస్థిరపడింది. మార్కెట్లు ముగిసే సమయానికి డాలర్‌తో మారకంలో రూపాయి విలువ రూ.81.57 వద్ద స్థిరపడిం ది. టెక్‌మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, సన్‌ఫార్మా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. యాక్సిస్ బ్యాంకు, ఎన్‌టిపిసి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, మహీంద్రాఅండ్‌మహీంద్రా, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్‌అండ్‌టి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జస్ట్ డయల్ లాభాలు మూడింతలకుపైగా పెరగడంతో కంపెనీ షేరు 10శాతానికిపైగా పెరిగి రూ.58.55 వద్ద అప్పర్ సర్క్యూట్‌ని తాకింది. భారత్ బిల్ పేమెంట్ సంస్థ కిందవిద్యుత్తు, డిటిహెచ్, నీరు, గ్యాస్ తదితర బిల్లు చెల్లింపు సేవల్ని అందిస్తున్న భారత్ బిల్ పేమెంట్ ఆపరేటింగ్ యూనిట్‌ను నిర్వహించేందుకు పేటిఎం బ్యాంక్‌కు ఆర్‌బిఐ అనుమతి ఇచ్చింది. సోమవారం ఈ షేరు ధర 1.27శాతం క్షీణించి రూ.553 గా నిలిచింది.




# ఈసారి బడ్జెట్ మధ్యతరగతి వారిదే: నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జనవరి 16:** కేంద్ర బడ్జెట్‌కు ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొన్న ఒత్తిళ్లు తనకు తెలుసునని అన్నారు. అయితే అదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలపై ఎలాంటి కొత్త పన్ను విధించ లేదని కూడా చెప్పారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో నిర్మలా సీతా రామన్ 2023-24 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వం ఆదాయపు పన్ను పరిమితిని పెంచి మధ్య తరగతి పన్ను చెల్లింపు దారులు, ఇతరులకు ఉపశమనం ఇస్తుందని చాలా మంది దేశ ప్రజలు భావిస్తున్నారు. తాను కూడా మధ్యతరగతికి చెందిన కుటుంబం నుంచి వచ్చానని, తాను కూడా ఆ ఒత్తిళ్లను అర్థం చేసు కోగలనని నిర్మాలా సీతా రామన్ అన్నారు. మధ్యతరగతి ప్రజల విషయంలో ఇబ్బందులు తనకు తెలుస న్నారు. మోడీ ప్రభుత్వం కొత్తగా మధ్యతర గతి ప్రజలపై ఎలాంటి పన్నులు తీసుకు రాలేదని ఆమె వ్యాఖ్యానించారు. అలాగే రూ.5లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. 27 నగరాల్లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం, జీవన సౌలభ్యాన్ని పెంపొందించేందుకు 100 స్మార్ట్ సిటీలను రూపొందించడం వంటి అనేక చర్యలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం మరింత చేయూ తనిస్తుందని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారు. ప్రస్తుతం దేశంలో ఈ కేటగిరీ కింద జనాభా పెరిగిందనిఅన్నారు. ఈ క్రమంలో వారి సమస్యలను తాను బాగా అర్థం చేసుకున్నా నని నిర్మలా సీతారామన్ తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇదే చివరి పూర్తి బడ్జెట్. దీని తర్వాత దేశంలిన అనేక రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. అయితే ఇది మధ్యంతర బడ్జెట్ అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రజలకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ బడ్జెట్‌లో పన్ను శ్లాబ్‌లలో కూడా మార్పులు చేయనున్నట్లు రెవెన్యూ కార్యదర్శి తరుణ్ బజాజ్ సూచించారు.




# వాణిజ్యం

## షేర్‌చాట్ ఉద్యోగులకు ఉద్వాసన !

**ముంబై, జనవరి 16:** ప్రముఖ సోషల్ షేరింగ్ యాప్ షేర్‌చాట్ మాతృ సంస్థ మొహల్లా టెక్ భారీ సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసన పలికిం ది. ఖర్చులుతగ్గించుకోవడంలో భాగంగా దాదాపు 600 మందిని తొలగించింది. ప్రస్తుతం కంపెనీ లో దాదాపు 2,100 మంది పనిచేస్తుండగా, అందులో 20 శాతం మంది ఉద్యోగుల్ని తొల గించింది. గతంలో భారీ సంఖ్యలో ఉద్యోగుల్ని నియమించుకున్న నేపథ్యంలో ఇప్పుడు అధికంగా ఉన్న వారిని తొలగించినట్లు తెలిసింది. తొల గింపు విషయాన్ని ఆ కంపెనీ ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా తెలియచేసింది. ప్రభావితం కాని ఉద్యోగులకు కూడా సమాచారం చేరవేసిం ది. తొలగించిన ఉద్యోగులకు 2022 డిసెంబర్ వరకు నూరు శాతం వేరియబుల్ పేని చెల్లించ నున్నట్లు కంపెనీ పేర్కొంది. అలాగే నోటీసు పీరియడ్ ఉన్న కాలానికి పూర్తి వేతనం చెల్లించ నున్నారు. పనిచేసిన కాలానికి గానూ యేడాదికి రెండు వారాలా చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించ నున్నారు. 2023 జూన్ వరకు ఆరోగ్య బీమా సదుపాయం కొనసాగుతుందని కంపెనీ తెలిపిం ది. వాడుకోని సెవలును గరిష్టంగా 45 రోజుల వరకు ఎన్‌క్యాష్ చేసుకోవచ్చు. ఐఐటి పూర్వ విద్యార్థులైన సత్యదేవ, ఫరీద్ అషన్, భాను సింగ్ కలిసి 2015లో షేర్‌చాట్‌యాప్‌ను ప్రారం భించారు. ప్రాంతీయ భాషలో కంటెంట్‌ను అందించడంతో అనతి కాలంలోనే ఈ యాప్ ప్రజాదరణ పొందింది. టిక్‌టాక్ బ్యాన్ తర్వాత ఇదే కంపెనీ మోజ్ పేరిట ఓ విడియో షేరింగ్ యాప్‌ను కూడాతీసుకొచ్చింది. విడియో షేరింగ్, సోషల్ మీడియా విభాగంలో మరింత విస్తరిస్తు న్న ఈ కంపెనీలో పెద్ద పెద్ద కంపెనీలు పెట్టు బడి పెట్టాయి. దీంతో షేర్‌చాట్ మాతృ సంస్థ భారీ సంఖ్యలో ఉద్యోగుల్ని నియమించుకుంది. ఫండింగ్ నెమ్మదించడంతో ఇప్పుడు అధికంగా ఉన్న ఉద్యోగుల్ని తొలగించే ప్రక్రియ చేపట్టిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత డిసెంబర్ లో కూడా ఇదే కంపెనీ జీత్ 11 ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్‌ను మూసేసింది. అందులో 115 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. నెల రోజులు తిరగకముందే షేర్ చాట్‌లో 20శాతం మందిని తొలగించింది.




# నిరాశపరచిన చమన్ మెటాలిక్స్ లిస్టింగ్




**ముంబై, జనవరి 16:** కొత్త వారం మార్కెట్లోకి కొత్త ఐపిఓ అరంగేట్రం చేసింది. ఇది ఇన్వెస్టర్లకు ఊహించని లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ఇన్వెస్టర్ల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ఏకంగా 75 శాతం లాభం పొందడంతో మార్కెట్లో ఇప్పుడు ఈ ఐపిఓ గురించే చర్చ జరుగుతోంది. చమన్ మెటాలిక్స్ సోమవారం బ్యాంగ్ ఎంట్రీ ఇచ్చింది. ఊహించిన లాభాలతో ఇన్వెస్టర్లు పట్టలేని సంతోషం తో పొంగిపోతున్నారు. అయితే కొద్ది సేపటికే భారీలాభాలు ఆవిరయ్యాయి. షేర్ విలువ పతనమైంది. కంపెనీ షేర్ల లిస్టింగ్ సమయంలో రూ.68కి జాబితా చేయబడింది. అంటే చమన్ మెటాలిక్స్ మార్కెట్లోకి వచ్చిన వెంటనే 78శాతానికిపైగా లాభాలను అందించింది. దీంతో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో కొద్ది సేపటి కే దాని రేటు కొంతమేర పతనమైంది. ఐపిఓలో షేర్లను పొందిన ఇన్వెస్టర్లకు ఒక్కో షేరుపై రూ.30 వరకు లాభాన్ని అందించింది. అయితే ఇప్పటికే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడిపై 70శాతం లాభంలోనే ఉన్నారు. చిన్న కంపెనీగా ప్రారంభమైన చమన్‌మెటాలిక్స్ లిమిటెడ్ కంపెనీ ఉక్కు రంగంలో వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఉక్కు ఉత్పత్తిలో కంపెనీ వేగంగా అభివృద్ధి చెందుతోంది.

# కార్ల ధరలు పెంచిన మారుతి

**న్యూఢిల్లీ, జనవరి 16:** భారతదేశపు అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ వినియోగదారులకు షాకిచ్చింది. తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ప్రతి కారుపై సగటున 1.1 శాతం పెంచుతున్నట్లు మారుతి సుజుకీ సోమవారం తెలిపింది. అన్ని మోడళ్ల కార్లకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ధరల పెంపు సోమవారం నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. అధిక ద్రవ్యోల్బణం, పెరిగిన వ్యయం కారణంగా జనవరి నెలలో కార్ల ధరలను పెంచాల్సి ఉంటుందని మారుతి సుజుకీ గత నెలలో తెలిపింది. ఈ క్రమంలో సోమవారం నుంచి అన్ని మోడళ్ల కార్ల ధరలను పెంచింది. ప్రస్తుతం భారత మార్కెట్‌లో బడ్జెట్ కార్ల వినియోగంలో మారుతి ముందంజలో ఉంది. మధ్యస్థాయి ప్రీమియం కార్ల శ్రేణిలోనూ ఇతర సంస్థలకు మారుతి గట్టి పోటీనిస్తోంది. మారుతి కార్ల ధరలు పెరుగుదల మార్కెట్‌పై ప్రభావం చూపనుంది. మారుతి బాటలో ఇతర కంపెనీలు కూడా ధరలను పెంచే అవకాశం కనిపిస్తోంది.




# లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కు టిప్లస్1 సెటిల్‌మెంట్: సెబి

**ముంబై, జనవరి 16:** అన్ని లార్జ్ క్యాప్, బ్లూచిప్ స్టాక్స్‌కు జనవరి 27 నుంచి టి ప్లస్1 సెటిల్ మెంట్ విధానం అమలు కానుంది. ఇప్పటి వరకు కేవలం కొన్ని కంపెనీలే టి ప్లస్1 సెటిల్‌మెంట్‌కు మారడం విశేషం. టి ప్లస్1 సెటిల్‌మెంట్ విధానం వల్ల ఇన్వెస్టర్లు కొనుగోలు చేసిన షేర్లు మనుసటి ట్రేడింగ్ రోజే ఖాతాలో జమ అవుతాయి. విక్రయించిన షేర్లకు నగదు మొత్తం మరుసటి ట్రేడింగ్ రోజు జమ అవుతుంది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న మాదిరి రెండు రోజుల పాటు వేచి చూడక్కర్లేదు. టి ప్లస్1 సెటిల్‌మెంట్ విధానానికి మళ్లుతున్నట్లు 2021 నవంబర్ 8న స్టాక్ ఎక్చేంజీలు, డిపాజి టరీలు, క్లియరింగ్ కార్పొరేషన్లు ప్రకటించడం విశేషం. అంతకుముందు సెప్టెంబర్ 7న సెబి దీనిపై ప్రకటన చేసింది. అతి తక్కువ మార్కెట్ విలువ ఉన్న వాటికి ముందుగా టి ప్లస్1 సెటిల్‌మెంట్ అమలు చేస్తున్నారు. ప్రతీ నెలా చివరి శుక్రవారం అతి తక్కువ మార్కెట్ విలువ కలిగివన 500 స్టాక్స్‌ను టి ప్లస్1 కిందకు మారుస్తున్నారు. 2002 ఏప్రిల్ 1న ఈక్విటీ మార్కెట్లలో టి ప్లస్ 3 విధానం స్థానంలో టి ప్లస్2 విధానం అమలోకి వచ్చింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14